LGTV
# లోకల్ గైడ్
జాతీయ దినపత్రిక
LOCAL NEWS GOBAL FOCUS
తెలంగాణ www.localguidenews.com RNI No:APBIL/2013/50718 ఆంధ్రప్రదేశ్



లోకల్ గైడ్ www.localguidenews.com తెలంగాణ
విలేకరులు కావలెను
సరికొత్త హంగులతో నూతన ఒరవడితో వెలువడుతున్న లోకల్ గైడ్ జాతీయ తెలుగు దినపత్రికలో పని చేయుటకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో జిల్లా ఇన్చార్జిలు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గాల ఆర్సీలు,మరియుమండలాల వారిగా రిపోర్టర్లు కావలెను.
ADVERTISEMENT మేనేజర్లు కావలెను అనుభవము ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును సంప్రదించండి
8977761499/9110308094



ప్రచురణ :, తెలంగాణ | సంపుటి 14, | సంచిక ,240 | పేజీలు -12 | మంగళవారం -30 - జూన్ - 2026 | వెల రూ.2/-


## ఏపీ డిజిటల్ భవిష్యత్తుపై
# చంద్రబాబు ఫోకస్..
### చర్చలు ఫలప్రదంగా సాగాయన్న ముఖ్యమంత్రి చంద్రబాబు

చంద్రబాబుతో భారతి ఎంటర్‌ప్రైజెస్ చైర్మన్ సునీల్ మిట్టల్ భేటీ

రాష్ట్రంలో డిజిటల్ మౌలిక సదుపాయాలపై కీలక చర్చలు

డేటా సెంటర్లు, కనెక్టివిటీ, అండర్ సీ కేబుల్‌పై ప్రధానంగా దృష్టి



అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో డిజిటల్ మౌలిక సదుపాయాలను బలోపేతం చేసే దిశగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కీలక సమావేశం నిర్వహించారు. ప్రముఖ టెలికాం దిగ్గజం భారతీ ఎంటర్‌ప్రైజెస్ వ్యవస్థాపక చైర్మన్ సునీల్ భారతీ మిట్టల్‌తో ఆయన భేటీ అయ్యారు. రాష్ట్ర ప్రజలకు మెరుగైన కనెక్టివిటీని అందించడం, డిజిటల్ రంగంలో పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ఈ చర్చలు సాగాయి. ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నివాసంలో ఈ సమావేశం జరిగింది. ఈ భేటీలో పలు కీలక అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. సునీల్ మిట్టల్‌తో జరిగిన చర్చలు అత్యంత ఫలప్రదంగా సాగాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సామాజిక మాధ్యమం 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా వెల్లడించారు. "ఆంధ్రప్రదేశ్ డిజిటల్ మౌలిక సదుపాయాల బలోపేతం, పౌరులకు మెరుగైన కనెక్టివిటీని అందించడంపై నిర్మాణాత్మక చర్చలు జరిగాయి" అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు. మరోవైపు, విశాఖపట్నంలో ఏర్పాటు చేస్తున్న గూగుల్ ఏఐ డేటా సెంటర్ ప్రాజెక్టులో భారతీ ఎంటర్‌ప్రైజెస్‌కు చెందిన ఎయిర్‌టెల్ నెక్స్‌ట్రా ఇప్పటికే భాగస్వామిగా ఉంది. భారీ పెట్టుబడులతో, స్వచ్ఛ ఇంధనంతో నడిచేలా రూపొందిస్తున్న ఈ ప్రాజెక్టుకు సంబంధించి 2026 ఏప్రిల్‌లో శంకుస్థాపన చేసేలా ప్రణాళికలు సిద్ధమయ్యాయి. ఈ ప్రాజెక్టును 2028 సెప్టెంబర్ నాటికి పూర్తి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇదివరకే భాగస్వామ్య సంస్థలను కోరారు.



### 1 నుంచి 5 వరకు జిల్లాల్లో సీఎం పర్యటన

హీరో మోటో కార్ప్, రాయలసీమ స్టీల్ ప్లాంట్ పనులకు ప్రారంభోత్సవాలు

- ఒకటో తేదీన నెల్లూరు జిల్లా చిల్లకూరు మండలంలో పేదల సేవలో కార్యక్రమం
- 2న ఉదయం తిరుపతి జిల్లా రైల్వేకోడూరులో వీబీ జీ రామ్‌జీ ప్రారంభ కార్యక్రమం
- 3న ఉదయం కడప జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గం సున్నపురాళ్లపల్లెలో రాయలసీమ ఉక్కు కర్మాగారం పనులు ప్రారంభం

### ఏవీసీ మెన్స్ కప్‌లో చారిత్రక విజయం..
### తొలిసారిగా పతకం సాధించిన భారత్

ఏవీసీ మెన్స్ వాలీబాల్ కప్‌లో భారత్‌కు చారిత్రక కాంస్యం



కాంస్య పతక పోరులో బహ్రెయిన్‌పై 3-1 తేడాతో గెలుపు

ఈ టోర్నీలో భారత్‌కు ఇదే తొలి పతకం



## కేంద్ర మంత్రిమండలిలో మార్పులు?

వర్షాకాల సమావేశాల్లోపే పునర్ వ్యవస్థీకరణ!

గవర్నర్లుగా కొందరికి.. పార్టీలో ఇంకొందరికి అవకాశం

భాజపా గూటికి చేరినవారికీ పదవులు

స్పీకర్ నిర్ణయం కీలకం

### మూడు రాష్ట్రాలకు అగ్రతాంబూలం!

ఉత్తర్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, పంజాబ్‌ల నుంచి పలువురికి ఈసారి మోదీ బృందంలో మంత్రులుగా అవకాశం రావచ్చని సమాచారం. ఈ మూడు రాష్ట్రాల్లో వచ్చే ఏడాది శాసనసభ ఎన్నికలు జరగనున్నాయి.

# మా పాలన, బీఆర్ఎస్ పాలన, దేశంలో బీజేపీ పాలనపై చర్చిద్దాం
### బీఆర్ఎస్, బీజేపీలకు సీఎం రేవంత్‌రెడ్డి సవాల్

- ★ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తే కడుపు మంట ఎందుకు?
- ★ ప్రజలకు ఎవరేం చేశారో తేల్చుకుందాం
- ★ అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలు నిర్వహిద్దాం
- ★ మేం సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తుంటే తప్పుడు ప్రచారం చేస్తున్నారు
- ★ ఎన్ని నాటకాలు వేసినా ప్రజలు నమ్మరు.. 2034 వరకు అధికారంలో ఉంటాం..




హైదరాబాద్: : 'రూ.16 వేల కోట్లు పెట్టి పేదలకు సన్న బియ్యం ఇస్తున్నాం. ఫామ్ హౌస్‌లో ఉండే కేసీఆర్ ఏం తింటున్నారో, తండాలో ఉండే గిరిజన బిడ్డలు కూడా ఆ సన్న బియ్యమే తింటున్నారు. బీఆర్ఎస్ నేతలకు దౌటు ఉంటే తండాలు, గూడేలకు వెళ్లి సన్న బియ్యం తింటున్నారో? లేదో? మిగతా 2 లో



### 30న మత్స్యపల్లిలో రైతు ఆశీర్వాద సభ

- వర్షం వచ్చినా సభ రెట్టింపు ఉత్సాహంతో జరుగుతుంది
- రెండున్నరేళ్లలో చేపట్టిన పనులను రైతులకు వివరిస్తాం
- బీఆర్ఎస్ నేతలు పొర్లుదండాలు పెట్టినా ప్రజలు క్షమించరు
- బీఆర్ఎస్ హయాంలో అసంపూర్తిగా వదిలేసిన సాగునీటి ప్రాజెక్టులను కూడా పూర్తి చేస్తున్నాం
- సీఎం సభా ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం మంత్రి పొంగులేటి



### కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు
## లేఖ రాసిన సీఎం చంద్రబాబు

- తోతాపురి మామిడి రైతులను ఆదుకోవాలని కేంద్రానికి సీఎం చంద్రబాబు లేఖ
- అంతర్జాతీయ మార్కెట్ సమస్యలతో నిలిచిపోయిన మామిడి గుజ్జు ఎగుమతులు
- భారీగా పడిపోయిన తోతాపురి ధరలు.. తీవ్రంగా నష్టపోతున్న రైతులు
- మామిడి కొనుగోలుకు రూ. 281 కోట్లు కేటాయించాలని కేంద్రానికి వినతి

రైతుల కోసం ప్రత్యేక ధరల వ్యత్యాస చెల్లింపు పథకం అమలు చేయాలని విజ్ఞప్తి

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో తోతాపురి మామిడి రైతులు

### సౌదీలో ఘోర ప్రమాదం.. హెలికాప్టర్ కుప్పకూలి 14 మంది దుర్మరణం

సౌదీ అరేబియాలో కుప్పకూలిన అరామ్కో హెలికాప్టర్



- ప్రమాదంలో 14 మంది సౌదీ పౌరులు మృతి
- రస్ తనూరా తీరంలో ఆదివారం ఉదయం ఈ ఘటన
- ప్రమాద కారణాలపై సౌదీ ప్రభుత్వం దర్యాప్తునకు ఆదేశం
- మృతుల కుటుంబాలకు ఇంధన మంత్రిత్వ శాఖ సంతాపం

## మోదీకి సీషెల్స్ గౌరవ
# పురస్కారం ప్రదానం
### భారత్, సీషెల్స్‌ల ఉమ్మడి ఇల్లు ఈ సముద్రమే

- హిందూ మహాసముద్రం అవకాశాల సంద్రం
- ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాలకు సముద్ర భద్రతే కేంద్రం
- ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్య
- సీషెల్స్ అధ్యక్షుడు ప్యాట్రిక్ హెర్మినీతో చర్చలు



ఢిల్లీ: ప్రధాని మోదీకి సీషెల్స్ ప్రభుత్వం 'గార్డియన్ ఆఫ్ ది బ్లూ హొరైజన్'అనే గౌరవ పురస్కారాన్ని ప్రదానం చేసింది. సీషెల్స్ అధ్యక్షుడు హెర్మినీ ఆయనను ఈ పురస్కారంతో మిగతా 2 లో

# ఉప్పల్‌లో జూలై 2న భూపోరాటానికి పిలుపు
### ఆ సినిమా టైటిల్ కు అర్థం ఏమిటో పవన్ కల్యాణ్ ను అడగండి: కవిత

- 'ఇడుపు కాయితం' టైటిల్‌పై రాజుకున్న వివాదం
- అర్థం తెలియాలంటే పవన్‌ను అడగాలన్న కవిత
- తెలంగాణ యాసను రేవంత్ రెడ్డి కాపాడటం లేదని విమర్శ
- తెలంగాణ అస్తిత్వంపై దాడి జరుగుతోందని ఆవేదన



హైదరాబాద్: టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత మరోసారి తనదైన శైలిలో మిగతా 2 లో


### కువైట్, బహ్రెయిన్‌లోని అమెరికా సైనిక
## స్థావరాలపై ఇరాన్ క్షిపణి దాడులు



- మళ్లీ భగ్గుమన్న పశ్చిమాసియా.. అమెరికా దాడులకు ప్రతీకారంగా బహ్రెయిన్, కువైట్ లను టార్గెట్ చేసిన ఇరాన్
- తమపై అమెరికా జరిపిన దాడులకు ప్రతీకారంగా ఈ చర్య చేపట్టినట్లు ఇరాన్ ప్రకటన

### తెలంగాణలో 32 శాతం లోటు..
## ఏపీలో సాధారణ వర్షపాతం
### దేశంలో దోబూచులాడుతున్న
## నైరుతి రుతుపవనాలు

- స్తంభించిన నైరుతి రుతుపవనాలు.. దేశంలో వర్షాభావ పరిస్థితులు
- జూన్ 28 నాటికి దేశవ్యాప్తంగా 45 శాతం వర్షపాత లోటు నమోదు
- ఖరీఫ్ సాగుపై తీవ్ర ప్రభావం.. రైతాంగంలో పెరుగుతున్న ఆందోళన
- ఎల్‌నినో ప్రభావంతోనే రుతుపవనాలు బలహీనపడ్డాయని నిపుణుల అంచనా



ఢిల్లీ: నైరుతి రుతుపవనాలు దేశంలోకి ప్రవేశించినప్పటికీ, పూర్తి స్థాయిలో వర్షపాతం నమోదు కావడంలేదు. కొన్నిరోజులు చురుగ్గా ఉంటే, మరికొన్ని రోజులు నిలిచిపోయే పరిస్థితి కనిపిస్తోంది. ప్రస్తుతం నైరుతి రుతుపవనాలు మిగతా 2 లో

లోకల్ గైడ్
జాతీయ దినపత్రిక
LOCAL NEWS GOBAL FOCUS
తెలంగాణ www.localguidenews.com RNI No:APBIL/2013/50718 ఆంధ్రప్రదేశ్


## ఏవీసీ మెన్స్ కప్‌లో చారిత్రక విజయం..
# తొలిసారిగా పతకం సాధించిన భారత్

ఢిల్లీ: భారత పురుషుల వాలీబాల్ జట్టు సరికొత్త చరిత్ర సృష్టించింది. ఏవీసీ మెన్స్ కప్ 2026లో తొలిసారిగా పతకాన్ని సాధించి చారిత్రక విజయాన్ని నమోదు చేసింది. ఆదివారం జరిగిన కాంస్య పతక పోరులో డిఫెండింగ్ ఛాంపియన్ బహ్రెయిన్‌ను మట్టికరిపించి భారత్ కాంస్యాన్ని కైవసం చేసుకుంది. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జరిగిన ఈ మ్యాచ్‌లో భారత్ 3-1 తేడాతో బహ్రెయిన్‌పై అద్భుత విజయం సాధించింది. హోరాహోరీగా సాగిన ఈ పోరులో భారత జట్టు 25-23, 23-25, 25-21, 25-17 స్కోర్లతో సెట్లను గెలుచుకుంది. అంతర్జాతీయ ర్యాంకింగ్స్‌లో తమ కంటే మెరుగైన స్థానంలో ఉన్న బహ్రెయిన్‌పై గెలిచి భారత ఆటగాళ్లు సత్తా చాటారు. శనివారం జరిగిన సెమీఫైనల్‌లో ఇండోనేషియాతో ఐదు సెట్ల పాటు జరిగిన పోరులో భారత్ స్వల్ప తేడాతో ఓటమి పాలైంది. అయితే, ఆ ఓటమి నుంచి వెంటనే తేరుకున్న భారత జట్టు, కాంస్య పతక పోరులో అద్భుతమైన ప్రదర్శన కనబరిచింది. భారత్ ఆతిథ్యమిచ్చిన ఈ టోర్నమెంట్‌లో పతకం సాధించడం దేశ వాలీబాల్ చరిత్రలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుంది. ఆసియాలోని బలమైన జట్లతో పోటీపడి సాధించిన ఈ విజయం, జట్టులో పెరుగుతున్న ఆత్మవిశ్వాసానికి నిదర్శనమని క్రీడా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## 30న మత్కేపల్లిలో రైతు ఆశీర్వాద సభ

హైదరాబాద్: అధికారంలోకి వచ్చిన రెండున్నరేళ్లలో రైతుల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేశామని, ఈ వివరాలను 30వ తేదీన చింతకాని మండలం మత్కేపల్లిలో జరిగే రైతు ఆశీర్వాద సభలో వివరిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఖమ్మం జిల్లా మత్కేపల్లిలో జరిగే రైతు ఆశీర్వాద సభ ఏర్పాట్లను మంత్రి పరిశీలించారు. వర్షం వచ్చినా సభ రెట్టింపు ఉత్సాహంతో జరుగుతుందని.. తమ పథకాలు కూడా అదే స్థాయిలో అమలవుతాయని పొంగులేటి తెలిపారు. దేశంలోనే అత్యధిక ధాన్యాన్ని రాష్ట్ర రైతులు పండించినా మద్దతు ధరతో కొనుగోలు చేసి వారంలో డబ్బు జమ చేశామన్నారు. బీఆర్ఎస్ హయాంలో అసంపూర్తిగా వదిలేసిన సాగునీటి ప్రాజెక్టులను కూడా పూర్తి చేస్తున్నామని, రహదారుల నిర్మాణానికి పెద్దమొత్తంలో నిధులను ప్రభుత్వం మంజూరు చేస్తోందని తెలిపారు. పదేళ్ల కాలంలో ప్రజా, రైతు సంక్షేమాన్ని విస్మరించిన బీఆర్ఎస్ నేతలను ప్రజలు తిరస్కరించగా.. 30న జరిగే సభకు వచ్చే లక్షలాది మంది రైతులు, జనాన్ని చూస్తే బీఆర్ఎస్ నేతల గుండె పగలడం ఖాయమని పేర్కొన్నారు. బీఆర్ఎస్ నేతలు పాదయాత్ర చేసినా, పొర్లుదండాలు పెట్టినా కారు కూతలు కూస్తున్న వారిని ప్రజలు క్షమించబోరని తెలిపారు. బీజేపీ, బీఆర్ఎస్ నేతలు తమ ప్రభుత్వంపై చేస్తున్న విమర్శలను పరిశీలిస్తే వచ్చే ఎన్నికల్లోనూ వారి ఓటమిని స్వీకరించినట్టు తెలుస్తోందని చెప్పారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన ఇళ్లు.. కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి విడతలో ఇచ్చిన ఇళ్లలో 25 శాతం కూడా లేవన్నారు.

## కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు
# లేఖ రాసిన సీఎం చంద్రబాబు

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో తోతాపురి మామిడి రైతులు ఎదుర్కొంటున్న తీవ్ర సంక్షోభంపై ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టి సారించారు. రైతులను ఆదుకునేందుకు తక్షణమే జోక్యం చేసుకోవాలని కోరుతూ కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు ఆయన లేఖ రాశారు. రాష్ట్రంలో రైతులు తీవ్ర నష్టాల్లో ఉన్నారని, కేంద్రం అండగా నిలవాల్సిన అవసరం ఉందని ఆయన నొక్కిచెప్పారు. అంతర్జాతీయంగా నెలకొన్న ప్రతికూల మార్కెట్ పరిస్థితుల కారణంగా మామిడి గుజ్జు (పల్ప్) ఎగుమతులు పూర్తిగా నిలిచిపోయాయని చంద్రబాబు తన లేఖలో వివరించారు. దీని ప్రత్యక్ష ప్రభావంతో స్థానిక మార్కెట్లలో తోతాపురి మామిడి ధరలు ఒక్కసారిగా కుప్పకూలాయని, దీంతో రైతులు పెట్టిన పెట్టుబడి కూడా రాక తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్లిష్ట పరిస్థితుల్లో రైతులను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణమే సహాయం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో సుమారు 7.03 లక్షల మెట్రిక్ టన్నుల తోతాపురి మామిడిని రైతుల నుంచి సేకరించేందుకు రూ. 281 కోట్లు ఆర్థిక సహాయంగా మంజూరు చేయాలని కోరారు. దీంతో పాటు, మార్కెట్ ధరకు, గిట్టుబాటు ధరకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని భర్తీ చేసేలా ప్రత్యేకంగా 'ధరల వ్యత్యాస చెల్లింపు పథకం' అమలు చేయాలని సూచించారు.

## సౌదీలో ఘోర ప్రమాదం.. హెలికాప్టర్ కుప్పకూలి 14 మంది దుర్మరణం

ఢిల్లీ: సౌదీ అరేబియాలో ఘోర హెలికాప్టర్ ప్రమాదం జరిగింది. ప్రభుత్వ రంగ దిగ్గజ చమురు సంస్థ సౌదీ అరామ్కోకు చెందిన హెలికాప్టర్ కుప్పకూలడంతో అందులో ప్రయాణిస్తున్న 14 మంది అక్కడికక్కడే మృతి చెందారు. మృతులంతా సౌదీ జాతీయులేనని సౌదీ ప్రభుత్వ వార్తా సంస్థ వెల్లడించింది. సౌదీ తూర్పు తీరంలోని రస్ తనూరా ప్రాంతంలో ఆదివారం ఉదయం 6 గంటల సమయంలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ఈ విషయాన్ని ఇంధన మంత్రిత్వ శాఖ అధికారి ఒకరు ధ్రువీకరించినట్లు సౌదీ ప్రెస్ ఏజెన్సీ తన కథనంలో పేర్కొంది. ప్రమాదంపై సౌదీ ప్రభుత్వం ఉన్నత స్థాయి దర్యాప్తునకు ఆదేశించింది. అయితే, ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలు ఇంకా తెలియరాలేదు. ఈ ఘటనపై సౌదీ అరామ్కో సంస్థ ఇప్పటివరకు అధికారికంగా స్పందించలేదు. రస్ తనూరా ప్రాంతం సౌదీ ఇంధన రంగానికి అత్యంత కీలకం. ప్రపంచంలోనే అతిపెద్ద చమురు ఎగుమతి టెర్మినల్స్‌లో ఒకటి ఇక్కడే ఉంది. ప్రాంతీయ ఉద్రిక్తతల కారణంగా దాదాపు నాలుగు నెలల పాటు నిలిచిపోయిన కార్యకలాపాలు శుక్రవారమే ఇక్కడ తిరిగి ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో తాజా ప్రమాదం జరగడం గమనార్హం. మృతుల కుటుంబాలకు ఇంధన మంత్రిత్వ శాఖ ప్రగాఢ సంతాపం తెలియజేసింది. దర్యాప్తు పూర్తయితే ప్రమాదానికి సంబంధించిన మరిన్ని వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

## కువైట్, బహ్రెయిన్‌లోని అమెరికా సైనిక
# స్థావరాలపై ఇరాన్ క్షిపణి దాడులు

ఢిల్లీ: పశ్చిమాసియాలో మరోసారి ఉద్రిక్తతలు భగ్గుమన్నాయి. కువైట్, బహ్రెయిన్‌లలో ఉన్న అమెరికా సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని ఇరాన్ బాలిస్టిక్ క్షిపణులు, డ్రోన్లతో దాడులు చేసింది. కువైట్‌లోని అలీ అల్ సేలం ఎయిర్‌బేస్, బహ్రెయిన్‌లోని పోర్ట్ సల్మాన్‌లో ఉన్న అమెరికా ఫిఫ్త్ ఫ్లీట్‌పై ఈ దాడులు జరిగినట్లు ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ ధృవీకరించింది. ఒక రోజు క్రితం అమెరికా తమ భూభాగంలోని ఐదు ప్రాంతాలపై దాడులు జరిపిందని, దానికి ప్రతీకారంగానే ఈ చర్యలు తీసుకున్నామని ఇరాన్ స్పష్టం చేసింది. హోర్ముజ్ జలసంధి సమీపంలో చమురు ట్యాంకర్‌పై ఇరాన్ డ్రోన్ దాడికి పాల్పడటంతో అమెరికా ప్రతీకార చర్యలు ప్రారంభించింది. ఈ దాడులు, ప్రతిదాడుల పరంపరతో ఇరు దేశాల మధ్య జూన్ 17న కుదిరిన 60 రోజుల కాల్పుల విరమణ ఒప్పందం పూర్తిగా నీరుగారిపోయింది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలను తగ్గించేందుకు పాకిస్థాన్ మధ్యవర్తిత్వంతో ఈ ఒప్పందం కుదిరింది. కానీ, తాజా పరిణామాలతో శాంతి ప్రయత్నాలకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఈ దాడులను కువైట్, బహ్రెయిన్ తీవ్రంగా ఖండించాయి. తమ సార్వభౌమత్వాన్ని ఉల్లంఘించడమేనని ఆగ్రహం వ్యక్తం చేశాయి. మరోవైపు, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర స్వరంతో స్పందించారు. ఇరాన్ కనుక ఒప్పందాలను ఉల్లంఘిస్తూ దాడులకు పాల్పడితే, ఆ దేశం "ఇకపై ఉనికిలో ఉండదు" అని తీవ్రంగా హెచ్చరించారు. ఇరాన్ విదేశాంగ శాఖ మాత్రం అమెరికాయే ఒప్పందాన్ని ఉల్లంఘించిందని, తమ సార్వభౌమత్వాన్ని కాపాడుకుంటామని తేల్చి చెప్పింది. ఖతార్, యూఏఈ, జోర్డాన్ వంటి దేశాలు ఇరుపక్షాలు సంయమనం పాటించాలని విజ్ఞప్తి చేశాయి. ఈ దాడుల్లో అమెరికా సిబ్బందికి ఎలాంటి నష్టం జరగలేదని ప్రాథమిక సమాచారం. అయితే, బహ్రెయిన్‌లో ఓ నివాస భవనం దెబ్బతినడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

## ఉప్పల్‌లో జూలై 2న భూపోరాటానికి పిలుపు

హైదరాబాద్: టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత మరోసారి తనదైన శైలిలో సంచలన వ్యాఖ్యలు చేశారు. 'ఇడుపు కాయితం' అనే సినిమా టైటిల్‌పై జరుగుతున్న ప్రచారాన్ని ప్రస్తావిస్తూ, ఆ పదానికి అసలైన అర్థం తెలియాలంటే ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను అడగాలని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఉప్పల్‌లో తన పార్టీ జెండాను ఆవిష్కరించిన సందర్భంగా ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రియదర్శి, నాగదుర్గ ప్రధాన పాత్రల్లో తెలంగాణ నేపథ్యంలో తెరకెక్కుతున్న 'ఇడుపు కాయితం' సినిమా టైటిల్‌పై సోషల్ మీడియాలో కొద్ది రోజులుగా తీవ్ర దుమారం రేగుతోంది. ముఖ్యంగా కొందరు ఆంధ్ర నెటిజన్లు తెలంగాణ యాసను, ఈ పదాన్ని కించపరిచేలా ట్రోల్ చేస్తుండటం వివాదానికి దారితీసింది. ఈ నేపథ్యంలో కవిత స్పందిస్తూ, తెలంగాణ భాష, అస్తిత్వంపై దాడి జరుగుతున్నా కాంగ్రెస్, బీజేపీ, చివరికి సొంత పార్టీ బీఆర్ఎస్ కూడా మౌనంగా ఉండటాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. "రాష్ట్రంలో మరోసారి ఉద్యమకాలం నాటి పరిస్థితులు కనిపిస్తున్నాయి. అప్పుడు మనల్ని, మన భాషను ఎలా అయితే అవాకులు చెవాకులు పేలారో, ఇప్పుడు మళ్లీ అదే తరహా ప్రయత్నాలు జరుగుతున్నాయి. మనమందరం ఈ విషయాన్ని గమనించుకోవాలి. నిన్నగాక మొన్న 'ఇడుపు కాయితం' అనే పేరుతో ఒక సినిమా వచ్చింది. ఈ పేరు అర్థం కావడం లేదంటూ కొందరు దానిపై ట్రోలింగ్ చేస్తున్నారు. తెలంగాణ యాసను అవమానించడమే దీని వెనుక ఉన్న ఉద్దేశం. నేను ఒకటే సూటిగా అడుగుతున్నా... 'ఇడుపు కాయితం' అంటే అర్థం తెలియకపోతే, వెళ్లి సినిమా నటుడు పవన్ కళ్యాణ్‌ను అడగండి. ఆయనకు ఆ పదం అర్థం బాగా తెలుసు, కచ్చితంగా వివరిస్తారు. మా భాషను, యాసను అవహేళన చేసినందుకే తెలంగాణ రాష్ట్రం సాధించుకున్నాం. ఇంకోసారి ఇటువంటి వెకిలి ప్రయత్నాలు చేయకండి. ఒకరి భాషను ఒకరం, ఒకరి సంస్కృతిని ఒకరం గౌరవించుకుందాం. అందరం కలిసే ఉందాం. కానీ, తెలంగాణను అవమానిస్తాం, మా భాషను కించపరుస్తాం అంటే చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదు. ఈరోజు తెలంగాణ భాషను ఇంతగా కించపరుస్తున్నా కాంగ్రెస్ పార్టీ నోరు మెదపదు. ఎందుకంటే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి తెలంగాణ ఉద్యమంతో ఎలాంటి సంబంధం లేదు. ఇక బీజేపీ సంగతి సరేసరి. దేశంలోని సమస్యలు తప్ప, తెలంగాణ గురించి వారికి పట్టదు. బీఆర్ఎస్ పార్టీ కూడా మాట్లాడదు. ఎందుకంటే, అందులో ఓ గుంటనక్క ఉంది. ఆయన వ్యాపారాలన్నీ ఇప్పటికీ ఆంధ్ర ప్రాంతానికి చెందిన వారితోనే ముడిపడి ఉన్నాయి" అని ఆరోపించారు.

## 1 నుంచి 5 వరకు జిల్లాల్లో సీఎం పర్యటన

అమరావతి: సీఎం చంద్రబాబు జులై ఒకటి నుంచి ఐదో తేదీ వరకు శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, కడప జిల్లాల్లో పర్యటించనున్నారు. ఒకటో తేదీన నెల్లూరు జిల్లా చిల్లకూరు మండలంలో జరిగే 'పేదల సేవలో' కార్యక్రమంలో పాల్గొంటారు. అదే రోజు తిరుపతి జిల్లా సత్యవేడు నియోజకవర్గంలోని శ్రీసిటీలో ద్విచక్ర వాహనాల సంస్థ హీరో మోటో కార్ప్ రూ.750 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేయనున్న గ్లోబల్ పార్ట్స్ సెంటర్‌కు శంకుస్థాపన చేస్తారు. రాత్రికి అక్కడే బస చేస్తారు. 2న ఉదయం తిరుపతి జిల్లా రైల్వేకోడూరులో వీబీ జీ రామ్‌జీ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొంటారు. తిరుపతిలో జరిగే జీఎస్‌డీపీ కెపాసిటీ బిల్డింగ్ వర్క్‌షాపునకు హాజరవుతారు. ఇందులో నీతి ఆయోగ్ సభ్యులు, పీఎం ఆర్థిక సలహా మండలి సభ్యులు పాల్గొంటారు. 3న ఉదయం కడప జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గం సున్నపురాళ్లపల్లెలో రాయలసీమ ఉక్కు కర్మాగారం పనులు ప్రారంభిస్తారు. అనంతరం చిత్తూరు జిల్లా కుప్పం చేరుకుంటారు. 3 నుంచి ఐదో తేదీ వరకూ చంద్రబాబు కుప్పంలో పర్యటిస్తారు. పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుడతారు.

# మా పాలన, బీఆర్ఎస్ పాలన,దేశంలో బీజేపీ పాలనపై చర్చిద్దాం

మొదటి పేజి తరువాయి

బీఆర్ఎస్ నేతలకు దౌటు ఉంటే తండాలు, గూడేలకు వెళ్లి సన్న బియ్యం తింటున్నారో? లేదో? చూసి రావాలి. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో పేదలకు ఇళ్లు ఇవ్వలేదు. మేము రెండున్నరేళ్లలో 4.5 లక్షల ఇళ్లు కట్టిస్తుంటే బీఆర్ఎస్ నేతలకు కడుపు మండుతోంది. పేదవాళ్లకు ఇందిరమ్మ ఇళ్లు ఇస్తుంటే వందల ఎకరాల్లో ఫామ్‌హౌస్‌లు కట్టుకున్న వారికి కడుపుమంట ఎందుకు? తండ్రి, కొడుకు, అల్లుడికి ఫామ్ హౌస్‌లు, పదవులు తప్ప ప్రజల గురించి ఆలోచనే లేదు. పరీక్షలు పెట్టి పేపర్లు అమ్ముకుని వేల కోట్ల అక్రమాలకు పాల్పడ్డారు..' అని సీఎం సీఎం రేవంత్‌రెడ్డి దుయ్యబట్టారు. మూసీ ప్రక్షాళన చేసి తీరుతా. ఎవరు అడ్డ పడినా మూసీలో వేసి తొక్కుతా. మోదీ సబర్మతే కాదు..ఢిల్లీ యమునా కాదు.. యోగి గంగా నది కాదు.. దేశానికి ఎవరొచ్చినా మూసీ ప్రక్షాళన చూడటానికే రావాలనేలా, దేశానికే తలమానికంగా ఉండేలా మూసీని ప్రక్షాళన చేస్తా. వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి ఎస్ఎల్‌బీసీ పూర్తి చేసి కృష్ణా జలాలను నల్లగొండ గడ్డపై పారించి రైతులకు సాగునీరు అందిస్తా. డిండి ఎత్తిపోతలను కూడా పూర్తి చేస్తా..' అని ముఖ్యమంత్రి సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు.

రాష్ట్రంలో రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలన, పదేళ్ల బీఆర్ఎస్ పాలన, దేశంలో 12 ఏళ్ల బీజేపీ పాలన, మేనిఫెస్టోలపై చర్చించేందుకు తాము సిద్ధమని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. తెలంగాణ ఉద్యమం, ఆత్మ బలిదానాలపై కూడా చర్చిద్దామని, ప్రజలకు ఎవరేం చేశారో తేల్చుకుందామని అన్నారు. 'మీరు స్పీకర్‌కు లేఖ రాయండి.. అసెంబ్లీ, మండలి ప్రత్యేక సమావేశాలు నిర్వహిద్దాం. ఎన్ని రోజులైనా చర్చిద్దాం.. ఇందుకు మీరు సిద్ధమా..' అని సవాల్ విసిరారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.13 వేల కోట్లతో నిర్మించనున్న హ్యామ్ రోడ్లకు నల్లగొండ జిల్లా కనగల్ మండల కేంద్రంలో ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు.

### 2034 వరకు మాదే అధికారం..

'మా ప్రజా ప్రభుత్వం పేదలకు రేషన్‌కార్డులు, సన్న బియ్యం, ఇందిరమ్మ ఇళ్లతో పాటు అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తుంటే.. కాంగ్రెస్ రెండున్నరేళ్లలో ఏమీ చేయలేదని బీజేపీ, బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తున్నాయి. కేసీఆర్ శుక్రాచార్యుడిలా ఫామ్‌హౌస్‌లో ఉంటే కేటీఆర్, హరీశ్‌లు బిల్లారంగా తరహాలో తెలంగాణలో తిరుగుతూ తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ప్రజా ప్రభుత్వం పోవాలని, బీఆర్ఎస్ ప్రభుత్వం రావాలని ప్రజలు కోరుకుంటున్నట్లు చెబుతున్నారు. వాస్తవానికి ప్రజలు అలా ఏమీ కోరుకోవడం లేదు. వారి కుటుంబం, వారికి సంబంధించిన వారే కోరుకుంటున్నారు. సింగరేణిలో టెండర్ ప్రక్రియ పూర్తి కాకముందే ఆరోపణలు చేశారు. వారు ఎన్ని నాటకాలు వేసినా తెలంగాణ ప్రజలు నమ్మరు. వారు సామాజికంగా బీఆర్ఎస్‌ను బహిష్కరించారు. 2034 వరకు మేమే అధికారంలో ఉంటాం. పదేళ్లు వెనక్కు తిరగకుండా అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తాం. మాకు ప్రజలు అండగా ఉండాలి..' అని సీఎం కోరారు.

### ఏపీలో రూ.3 వేల కోట్లు..ఇక్కడ రూ.26 వేల కోట్లు

ఆంధ్రప్రదేశ్‌లో ఆర్అండ్‌బీ శాఖ పరిధిలో రూ.3 వేల కోట్లతో రోడ్డు పనులు చేస్తుంటే రాష్ట్రంలో రూ.6 వేల కోట్లతో చేస్తున్నామని చెప్పారు. దానికి అదనంగా రూ.13 వేల కోట్లతో హ్యామ్ రోడ్లు, పంచాయతీరాజ్ శాఖ నుంచి రూ.7 వేల కోట్లతో హ్యామ్ రోడ్లు, శాఖాపరంగా అన్నీ కలిపి రూ.26 కోట్లతో రోడ్లను నిర్మిస్తున్నామని తెలిపారు. ఎస్ఎల్‌బీసీ డి?రస్ట్రిబ్యూటరీ పనులతో పాటు గ్రీన్ ఫీల్డ్ రోడ్డు, దాన్ని వెంటే బుల్లెట్ ట్రెయిన్ నిర్మాణానికి సంబంధించి డీపీఆర్‌లు సిద్ధమయ్యాయని, అవీ కలిపితే రోడ్ల పనులు దాదాపు రూ. 80 వేల కోట్లకు చేరతాయని చెప్పారు. బీఆర్ఎస్ నేతలు.. టెండర్లు ఓపెన్ చేయకుండానే స్కామ్‌లు జరిగాయని ఆరోపించడం దురదృష్టకరమన్నారు. 'ఇప్పుడు టెండర్లు తెరిచాం. పబ్లిక్ డొమైన్‌లో ఉన్నాయి. గతంలో మీరు చేసినప్పటి రేట్లు ఇప్పటి రేట్లు చూసుకోవాలి' అని ఆయన హితవు పలికారు

# మోదీకి సీషెల్స్ గౌరవ పురస్కారం ప్రదానం

మొదటి పేజి తరువాయి

సీషెల్స్ అధ్యక్షుడు హెర్మినీ ఆయనను ఈ పురస్కారంతో సత్కరించారు. పర్యావరణ పరిరక్షణ పట్ల మోదీ చూపుతున్న నిబద్ధత, చిన్న ద్వీప దేశాల ఆకాంక్షలను ముందుకు తీసుకెళ్లడంలో ఆయన చేస్తున్న కృషికి ఈ గౌరవాన్ని అందించారు. వాతావరణ మార్పులు విసురుతున్న సవాళ్లతో పోరాడుతున్న దేశాలకు, పర్యావరణ పరిరక్షణను భవిష్యత్ తరాల పట్ల తమ బాధ్యతగా భావిస్తున్న దేశాలకు అవార్డ్‌ను అంకితం చేస్తున్నట్లు మోదీ ప్రకటించారు.

19 కీలక అంశాలపై నిర్ణయం

రక్షణ, సముద్ర భద్రత, డిజిటల్ చెల్లింపులు, అంతరిక్షం, ఆరోగ్య సంరక్షణ, వ్యవసాయం, విద్య వంటి పలు రంగాల్లో పరస్పర సహకారాన్ని మరింత పటిష్టం చేసుకోవాలని భారత్, సీషెల్స్ తీర్మానించుకున్నాయి. భారత ప్రధాని మోదీ, సీషెల్స్ అధ్యక్షుడు హెర్మినీ మధ్య ఆదివారం జరిగిన చర్చల్లో 19 అంశాలపై నిర్ణయానికి వచ్చారు. ఇందులో నేరస్తుల అప్పగింత ఒప్పందం, బాహ్య అంతరిక్షాన్ని శాంతియుత ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవడంలో సహకార ఒప్పందం, సీషెల్స్‌లో యూపీఐ ఆధారిత డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించే ఒప్పందం, ఎక్స్‌పోర్ట్--ఇంపోర్ట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాతో సమగ్ర రుణ ఒప్పందం, నూతన సీషెల్స్ జాతీయ ఆసుపత్రికి సహకార ఒప్పందం ఉన్నాయి. సీషెల్స్‌కు ఒక వేగవంతమైన గస్తీ నౌకను బహుమతిగా ఇవ్వడం, రక్షణ దళానికి 10 యుటిలిటీ వాహనాలు, ఐదు లేజర్ రేడియల్ తరగతి పడవలను అప్పగించడం, తీర రక్షక దళం బలోపేతానికి సహకరించడం, గ్లాస్ కాక్‌పిట్‌తో ఒక డోర్నియర్ విమానాన్ని ఉన్నతీకరించడం వంటి అంశాలను ఇరు పక్షాలు ప్రకటించాయి. దౌత్య శిక్షణ కోసం సుష్మా స్వరాజ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ సర?వస్, సీషెల్స్ విదేశీ వ్యవహారాల శాఖ మధ్య ఒప్పందం కుదిరింది.

భాగస్వామ్యం అనేది దేశ పరిమాణంపై కాకుండా పరస్పర గౌరవం, విశ్వాసంపై ఆధారపడి ఉండాలని భారత ప్రధాని మోదీ తేల్చిచెప్పారు. ఆర్థిక శ్రేయస్సుతో పాటు సముద్ర భద్రత కూడిన సుసంపన్న హిందూ మహాసముద్రాన్ని భారతదేశం ఆకాంక్షిస్తోందని అన్నారు. భారత్, సీషెల్స్ దేశాల రక్షణ, భద్రతలు ఒకదానికొకటి విడదీయరానివని స్పష్టంచేశారు. హిందూ మహాసముద్రాన్ని అవకాశాల సముద్రంగా మార్చడమే తమ ధ్యేయమని ఉద్ఘాటించారు. ప్రధాని మోదీ ఆదివారం సీషెల్స్‌లోని విక్టోరియా నగరంలో సీషెల్స్ అధ్యక్షుడు ప్యాట్రిక్ హెర్మినీతో సమావేశమయ్యారు. ప్రతినిధుల స్థాయి చర్చలు జరిపారు. ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక సహకారంపై విస్తృతంగా చర్చించారు. ఉమ్మడి ప్రయోజనాలతో ముడిపడి ఉన్న ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలపై అభిప్రాయాలు పంచుకున్నారు. హెర్మినీతో భేటీ అనంతరం మోదీ మాట్లాడారు. హిందూ మహాసముద్రం మన ఉమ్మడి ఇల్లు అని విశ్వసిస్తున్నట్లు చెప్పారు. సముద్ర భద్రత, సుస్థిరత, శ్రేయస్సు మన ఉమ్మడి బాధ్యత అని పేర్కొన్నారు. భారతదేశపు మహాసాగర్ (ప్రాంతాలవ్యాప్తంగా భద్రత, వృద్ధి కోసం పరస్పర మరియు సంపూర్ణ పురోగతి) దార్శనికతకు ఇదే మూలమని తెలిపారు. భారత్, సీషెల్స్ మధ్య ద్వైపాక్షిక ఆర్థిక సహకారాన్ని మరింత పటిష్టంగా తీర్చిదిద్దడంపై చర్చించినట్లు ప్రధానమంత్రి వెల్లడించారు. పరిశ్రమలు, అనుసంధానం, టెక్నాలజీ, డిజిటల్ మౌలిక సదుపాయాలు సహా ఇతర రంగాల్లో వృద్ధి కోసం రెండు దేశాలు నూతన అవకాశాలను అన్వేషిస్తాయని చెప్పారు.

వాతావరణ మార్పులపై పోరాడుదాం

తర్వాత సీషెల్స్ నేషనల్ అసెంబ్లీలో మోదీ మాట్లాడారు. వాతావరణ మార్పుల వల్ల గ్లోబల్ సౌత్ దేశాలు.. ముఖ్యంగా ద్వీప దేశాలు ఎక్కువగా ప్రభావితమవుతున్నాయని ప్రధాని మోదీ ఆందోళన వ్యక్తంచేశారు. వాతావరణ మార్పుల ప్రభావాలు ఇప్పటికే తీరప్రాంతాలు, సముద్ర జీవావరణ వ్యవస్థలు, వాతావరణ సరళి, సమాజాలపై కనిపిస్తున్నాయని చెప్పారు. ఆయన ఆదివారం సీషెల్స్ జాతీయ అసెంబ్లీలో ప్రసంగించారు. వాతావరణ మార్పులకు అతి తక్కువగా కారణమైవారు దాని పర్యవసానాల అత్యధిక భారాన్ని మోయకూడదని స్పష్టంచేశారు. వాతావరణ మార్పుల నియంత్రణకు ప్రపంచ దేశాలు కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. మరింత సమ్మిళిత ప్రపంచం, సమకాలీన వాస్తవాలను ప్రతిబింబించే అంతర్జాతీయ సంస్థల పట్ల భారత్, సీషెల్స్ ఒకే దృక్పథాన్ని పంచుకుంటున్నాయని గుర్తుచేశారు. గ్లోబల్ సౌత్ ప్రయోజనాలను ముందుకు తీసుకెళ్లడానికి నిబద్ధతను చాటుతున్నాయని పేర్కొన్నారు.

## తెలంగాణలో 32 శాతం లోటు..
# ఏపీలో సాధారణ వర్షపాతం

ప్రస్తుతం నైరుతి రుతుపవనాలు పూర్తిగా స్తంభించిపోయాయి. దీంతో దేశవ్యాప్తంగా వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. జూన్ 28 నాటికి దేశంలో 45 శాతం వర్షపాత లోటు నమోదైంది. ఇది ఖరీఫ్ సాగుపై తీవ్ర ఆందోళనకు కారణమవుతోంది. జలాశయాల్లో నీటి మట్టాలు పడిపోవడం, వేడి కారణంగా విద్యుత్ వినియోగం పెరగడం వంటి సమస్యలు తలెత్తుతున్నాయి. జూన్ 4 నుంచి 28 వరకు దేశవ్యాప్తంగా సాధారణంగా 141.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, కేవలం 77.1 మిల్లీమీటర్ల వర్షం మాత్రమే కురిసింది. వారం క్రితం 40 శాతంగా ఉన్న లోటు ఇప్పుడు 45 శాతానికి చేరడం పరిస్థితి తీవ్రతను సూచిస్తోంది. ఉపగ్రహ చిత్రాల ప్రకారం, మధ్య, పశ్చిమ, వాయవ్య భారతదేశంలోని చాలా ప్రాంతాల్లో ఆకాశం మేఘరహితంగా ఉంది. కేవలం ఈశాన్య రాష్ట్రాలు, ద్వీపకల్పంలోని కొన్ని ప్రాంతాల్లో మాత్రమే వర్షాలు కురుస్తున్నాయి. ముఖ్యంగా గుజరాత్‌లో 86 శాతం, మహారాష్ట్రలో 60 శాతం వర్షపాత లోటుతో పరిస్థితి అత్యంత దయనీయంగా ఉంది. మధ్యప్రదేశ్ (42 శాతం), ఉత్తరప్రదేశ్ (59 శాతం), బీహార్ (52 శాతం), ఒడిశా (53 శాతం), కర్ణాటక (47 శాతం) రాష్ట్రాల్లోనూ తీవ్ర వర్షాభావం నెలకొంది. తెలుగు రాష్ట్రాల విషయానికొస్తే, తెలంగాణలో 32 శాతం లోటు నమోదు కాగా, ఆంధ్రప్రదేశ్‌లో పరిస్థితి మెరుగ్గా ఉండి సాధారణ వర్షపాతం నమోదైనట్టు నివేదికలు చెబుతున్నాయి. వాతావరణ నిపుణుల ప్రకారం, ఇది 'బ్రేక్-లైక్ ఫేజ్' అని, తేమతో కూడిన గాలులు బంగాళాఖాతం, ఈశాన్య రాష్ట్రాలకే పరిమితమై దేశంలోని ఇతర ప్రాంతాలకు విస్తరించడం లేదని చెబుతున్నారు. ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో రుతుపవనాలు బలహీనంగా ఉంటాయని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) ముందుగానే అంచనా వేసింది. రాబోయే రోజుల్లో రుతుపవనాలు పుంజుకోవడం ఖరీఫ్ పంటలకు అత్యంత కీలకం. దేశంలోని మెజారిటీ ప్రాంతాలు రుతుపవనాల క్రియాశీలత కోసం ఆశగా ఎదురుచూస్తున్నాయి.

# కేంద్ర మంత్రిమండలిలో మార్పులు?



ఢిల్లీ: కేంద్ర మంత్రిమండలిలో మార్పులు చేర్పులపై ఊహాగానాలు ఊపందుకున్నాయి. ఇలాంటి అంశాలపై చివరి క్షణం వరకు గోప్యత పాటించడం ప్రధాని నరేంద్ర మోదీ ప్రత్యేకత అయినా వివిధ సంకేతాలను బట్టి.. ఇప్పటి నుంచి పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లోగా ఏ క్షణమైనా పునర్వ్యవస్థీకరణ జరగవచ్చని భావిస్తున్నారు. మంత్రిమండలిలో ఇప్పటికే ఖాళీగా ఉన్న, త్వరలో ఖాళీ కాబోతున్న స్థానాలను భర్తీచేయడంతోపాటు తృణమూల్ కాంగ్రెస్, శివసేన (యూబీటీ) వంటి పార్టీల నుంచి చీలికవర్గం ఎంపీలు ప్రత్యేక వర్గాలుగా ఏర్పడి భాజపాకు మద్దతు ప్రకటిస్తుండటంతో వాటి నుంచీ కొందరికి మంత్రి పదవులు ఇచ్చే అవకాశం ఉంది. భాజపా నూతన సారథి నితిన్ నబీన్ జట్టులో కీలకమైన పదవుల్ని కొంతమంది యువ నేతలకు అప్పగించే అవకాశముందని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే పార్టీ పదవుల జాబితా దాదాపు కొలిక్కి వచ్చింది. కొందరు కేంద్ర మంత్రులతో నబీన్ కొద్దిరోజుల క్రితం చర్చలు జరిపారు. కొత్తవారిని మంత్రులుగా తీసుకోవడం, కొందరి శాఖల్ని మార్చడం వంటి వాటిపై సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. వరకు సీషెల్స్ పర్యటనలో ఉండే ప్రధాని మోదీ తిరిగి జులై 6 నుంచి 11 వరకు విదేశాల్లో ఉంటారు. జపాన్ ప్రధాని సనాయె తకాయిచి జులై 1 నుంచి 3 వరకు మన దేశంలో పర్యటించనున్నారు. అందువల్ల ప్రధాని వెసులుబాటును బట్టి మంత్రిమండలిలో మార్పులు చేపట్టనున్నారు. పశ్చిమ బెంగాల్ నుంచి కొందరు ఎంపీలను మంత్రిమండలిలోకి తీసుకోనున్నారు. శిందే నేతృత్వంలోని శివసేన పార్టీ నుంచి ఒక సీనియర్ నేతకు క్యాబినెట్ మంత్రి పదవి లభించనుందని తెలుస్తోంది. తృణమూల్, శివసేన (యూబీటీ) చీలిక వర్గాల్లో ఎవరికైనా అవకాశం ఇచ్చేముందు స్పీకర్ నిర్ణయం కీలకం కానుంది.

గవర్నర్లుగా కేంద్ర మంత్రులు!

గవర్నర్లుగా థావర్‌చంద్ గహ్లోత్ (కర్ణాటక), మంగూభాయ్ పటేల్ (మధ్యప్రదేశ్), గుర్మీత్‌సింగ్ (ఉత్తరాఖండ్)ల పదవీ కాలం త్వరలో ముగియనుంది. ప్రస్తుత మంత్రుల్లో కొందరిని వీరి స్థానాల్లోకి పంపిస్తారని, ఆ మేరకు మంత్రిమండలిలో యువ రక్తాన్ని తీసుకువస్తారని చెబుతున్నారు. ఆప్ నుంచి విడిపోయి భాజపాలో చేరుతున్న ఏడుగురు రాజ్యసభ సభ్యుల్లో ఒకరిద్దరికి విస్తరణలో బెర్తులు ఖాయం కానున్నాయి.

వీరి భవితవ్యం ఏమిటో?

నీట్ ప్రశ్నపత్రం లీకేజీ, సీబీఎస్ఈ డిజిటల్ మూల్యాంకనంలో తప్పిదాల తర్వాత కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ భవితవ్యం డోలాయమానంలో పడింది. రాజ్యసభ సభ్యులుగా నవంబరులో పదవీకాలం ముగిసిపోతున్న వారిలో కేంద్ర మంత్రులు హర్‌దీప్‌సింగ్ పురీ, బి.ఎల్.వర్మ ఉన్నారు. వారికి మరో అవకాశం లభిస్తుందా..లేదా అనేది తేలాలి. పంకజ్ చౌధరీ, హర్ష్ మల్హోత్రాలకు యూపీ, దిల్లీ రాష్ట్రశాఖల పార్టీ బాధ్యతల్ని అప్పగించారు. 'ఒకరికి ఒకే పదవి' నిబంధన కింద వీరిద్దరినీ మంత్రివర్గం నుంచి తప్పించేందుకు ఎక్కువ అవకాశాలు కనిపిస్తున్నాయి. జార్జి కురియన్, రవ్‌నీత్‌సింగ్ బిట్టూల రాజ్యసభ పదవీ కాలం ఈ నెల 21న ముగిసింది. మంత్రి పదవికి కురియన్ రాజీనామా సమర్పించారు. పంజాబ్ ఎన్నికలపై దృష్టి పెట్టాల్సిందిగా బిట్టూకు పార్టీ సూచించినట్లు సమాచారం.

## బడేభాయ్ ఏది చెప్తే.. చోటా భాయ్ జీ హుజూర్ అంటారు



వికారాబాద్/మొయినాబాద్: స్పీకర్.. సీఎం..ఇక్కడి ఎమ్మెల్యేలు ప్రాజెక్టుల పేరిట రైతుల భూములు కొల్లగొడుతున్నారని, బాధిత రైతులకు అండగా బీఆర్ఎస్ ఉంటుందని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కేటీఆర్ మాట్లాడుతూ 'స్పీకర్ పోలీసులను అడ్డం పెట్టుకుని బీఆర్ఎస్ కార్యకర్తలను వేధిస్తున్నారు... పోలీసులారా ఖబడ్దార్.. వచ్చేది మేమే.. మా ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, మేము మిమ్మల్ని గుర్తు బెట్టుకుంటం.. అధికారంలోకి వచ్చాక వడ్డీతో సహా చెల్లిస్తాం'అన్నారు. సీఎంను ప్రశ్నిస్తే 'ఎంత మొగోడైనా మూడు నెలల్లో పిల్లలు పుట్టిస్తరా అంటడు.. మూడు నెలల్లో పుట్టరు.. ముప్పై నెలలు అయినా పుట్టకపోతే ఏమనాలో మీరే చెప్పాలి'అని కేటీఆర్ ఎద్దేవా చేశారు. సీఎం రేవంత్‌రెడ్డికి మోదీ అంటే భయమని, బడేభాయ్ ఏది చెప్తే.. చోటా భాయ్ జీ హుజూర్ అంటారని, అందుకే బడేబాయ్ అడగ్గానే దామగుండం అడవిలో 2,700 ఎకరాలు నేవీకి రాసిచ్చిండని, నాడు తమకు ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా అడవి జోలికి రాకుండా మోదీని అడ్డుకున్నామన్నారు. ప్రతి ఒక్కరు బూత్ స్థాయినుంచి గట్టిగా పనిచేయాలని, రేవంత్ పోవాలి.. కేసీఆర్ రావాలనే నినాదంతో ముందుకు వెళితే అధికారంలోకి వచ్చేది మనమే అన్నారు. లోక్‌సభకు ఎన్నికకు నామినేట్ చేసిన మీనాక్షినటరాజన్ అభ్యర్థిత్వాన్ని నాశనం చేసింది ముమ్మాటికి సీఎం రేవంత్‌రెడ్డే అని, బీజేపీ కాంగ్రెస్‌ది అక్రమ పొత్తులని అందరికి అర్థం అవుతోందన్నారు. ఓట్లు తొలగించి పశ్చింబెంగాల్‌లో మమతను బీజేపీ ఓడించిందని, ఏపీలోనూ చంద్రబాబు ఇదే చేయించి వైసీపీని ఓడించారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి సబితారెడ్డి, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ మాజీ ఎమ్మెల్యేలు మహేశ్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, నాగేందర్‌గౌడ్, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్‌పటేల్, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. కాగా, రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని పెద్దమంగళారంలో తెలంగాణ అమరవీరుడు మందడి యాదిరెడ్డి కుటుంబ సభ్యులు, ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన ఎనికేపల్లికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త డప్పు కరంచంద్ కుటుంబాలను ఆదివారం ఆయన పరామర్శించారు. పార్టీ పరంగా ఆదుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.

## మళ్లీ చర్చల బాట పట్టిన యుఎస్-ఇరాన్..
# ఇరు దేశాలు దాడుల నిలిపివేత



ఢిల్లీ: పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్తతలకు కారణమైన అమెరికా-ఇరాన్ వివాదం తాత్కాలికంగా సద్దుమణిగింది. ఒకరిపై ఒకరు సైనిక దాడులు నిలిపివేయాలని ఇరు దేశాలు నిర్ణయించుకున్నాయి. ప్రపంచ ఇంధన రవాణాకు కీలకమైన హర్మూజ్ జలసంధిలో నౌకల రాకపోకలపై తలెత్తిన వివాదాన్ని పరిష్కరించుకునేందుకు మంగళవారం(30న) ఖతార్ రాజధాని దోహాలో అత్యవసర సాంకేతిక చర్చలు జరపనున్నట్లు అమెరికా అధికారులు ధ్రువీకరించారు. జూన్ 17న కుదిరిన ఒప్పందం 11 రోజుల్లోనే విఫలమవడంతో ఈ కొత్త దౌత్య ప్రయత్నాలు తెరపైకి వచ్చాయి. ఆ ఒప్పందం ప్రకారం, ఇరాన్ ఓడరేవులపై అమెరికా నౌకాదళ దిగ్బంధనాన్ని ఎత్తివేయాలి. బదులుగా హర్మూజ్ జలసంధిలో అంతర్జాతీయ వాణిజ్య నౌకలకు ఇరాన్ భద్రత కల్పించాలి. అయితే, జలసంధి దాటే నౌకలు తమ అనుమతి తీసుకోవాలని ఇరాన్ పట్టుబట్టడం, అమెరికా వ్యతిరేకించడంతో వివాదం ముదిరింది. ఈ క్రమంలోనే వారాంతంలో ఇరు దేశాల మధ్య దాడులు చోటుచేసుకున్నాయి. వాణిజ్య నౌకలపై ఇరాన్ దాడులకు ప్రతిగా, అమెరికా సెంట్రల్ కమాండ్ ఇరాన్ సైనిక స్థావరాలపై వైమానిక దాడులు జరిపింది. దీనికి బదులుగా ఇరాన్.. కువైట్, బహ్రెయిన్‌లలోని అమెరికా స్థావరాలపై క్షిపణులు, డ్రోన్లతో దాడులు చేసింది. ఈ దాడుల్లో అమెరికా సైనికులకు ప్రాణనష్టం జరగకపోయినా, స్వల్ప ఆస్తి నష్టం వాటిల్లింది. ఇరాన్ ఒప్పందాన్ని గౌరవించకపోతే "పని పూర్తి చేస్తాం" అని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా హెచ్చరించడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. ఈ నేపథ్యంలో అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ చొరవతో చర్చలు పునఃప్రారంభమయ్యాయి. అమెరికా సాంకేతిక బృందానికి నిక్ స్టైవర్ట్ నాయకత్వం వహించనున్నారు. ఇరు దేశాల సైన్యాల మధ్య, ముఖ్యంగా యూఎస్ మిలిటరీ, ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ మధ్య కమ్యూనికేషన్ హాట్‌లైన్‌ను ఏర్పాటు చేసి భవిష్యత్తులో సముద్ర ఘర్షణలను నివారించడమే ఈ చర్చల ప్రధాన లక్ష్యం. ప్రస్తుతం దాడులు నిలిచిపోవడంతో హర్మూజ్ జలసంధిలో వాణిజ్య నౌకల రాకపోకలు సాధారణ స్థితికి చేరుకున్నాయి.

## సంఘం అధ్యక్షులు మూల మధుకర్ రెడ్డి సహకార జెండాను ఆవిష్కరించి వారోత్సవాలను ప్రారంభించారు

బయ్యారం లో ఘనంగా సహకార వారోత్సవాలు..

సహకార జెండాను ఆవిష్కరించిన అధ్యక్షులు మూల మధుకర్ రెడ్డి..



లోకల్ గైడ్ మహబూబాబాద్ మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండల కేంద్రంలో అనంతరం రైతులు, పాలకవర్గ సభ్యులు, ప్రజాప్రతినిధులతో కలిసి సహకార ప్రతిజ్ఞ..బయ్యారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ అధ్యక్షులు మూల మధుకర్ రెడ్డి ఆధ్వర్యంలో సహకార వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు మూల మధుకర్ రెడ్డి సహకార జెండాను ఆవిష్కరించి వారోత్సవాలను ప్రారంభించారు. అనంతరం రైతులు, పాలకవర్గ సభ్యులు, ప్రజాప్రతినిధులు సిబ్బంది మరియు గ్రామ ప్రజలతో కలిసి సహకార ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా చైర్మన్ గారు మాట్లాడుతూ సహకార సంఘాలు రైతులకు అండగా నిలుస్తూ వ్యవసాయాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నాయని, రైతులు సహకార సంఘాల సేవలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా మరింత బలోపేతం కావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలను సహకార సంఘాల ద్వారా పారదర్శకంగా అందించేందుకు కృషి చేస్తున్నామని, రైతుల అభివృద్ధే సంఘం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు చాగర్లమూడి భాస్కర్ చెరుకుపల్లి నాగమణి , కసనబోయిన శ్రీను కొత్తపేట సర్పంచ్ భూక్యా ప్రవీణ్ నాయక్ సంతులాల్ బోడు సర్పంచ్ జి మని భాస్కర్ గారు, చర్లపల్లి సర్పంచ్ బాలకృష్ణ , ఉప్పలపాడు సర్పంచ్ పానుగోత్ వెంకన్న , సింగారం సర్పంచ్ సపవత్ సరస్వతి రాందాస్ నాయక్ , నర్సాతండా సర్పంచ్ గుగులోత్ సేవాలాల్ నాయక్ రైతులు కొల్లా హరినాథ్ బాబు పుట్టగుంట సత్యనారాయణ చల్లగుండ్ల ఉప్పలయ్య గంగ్రాతి భాస్కర్ రెడ్డి బానోత్ చంద్రు చెరుకుపల్లి నర్సయ్య , వంకుడోత్ రాంజీ , పసుల వెంకన్న , మోహన్ , పూర్ణ , రవి ధనసరి భద్రం, సతీష్ , సిబ్బంది గంట్ల అనూష, తుడుం రాజేష్, ఉప్పరపల్లి వెంకటేష్, రేగళ్ల గణేష్, నీలారపు సతీష్, ముధాకర్, సంగీత తదితరులు పాల్గొన్నారు..

## విజయ సంకల్ప సమ్మేళనానికి కురవి మండలం నుంచి బీజేపీ నాయకులు,భారీగా తరలిన బీజేపీ కార్యకర్తలు




లోకల్ గైడ్ మహబూబాబాద్ మహబూబాబాద్ జిల్లా కురవి మండలం నుంచి భారీగా తరలిన బీజేపీ శ్రేణులువరంగల్ లో భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షులు నితిన్ నబిన్ ఆధ్వర్యంలో నిర్వహించిన బూత్ అధ్యక్షులు మరియు పైస్థాయి పదాధికారుల విజయ సంకల్ప సమ్మేళనానికి కురవి మండలం నుంచి బీజేపీ నాయకులు, బూత్ అధ్యక్షులు, పై స్థాయి పదాదికారులు సీనియర్ నాయకులు మండల అధ్యక్షుడు కిషన్ నాయక్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున తరలివెళ్లారు. ఈ సందర్భంగా మండల నాయకులు మాట్లాడుతూ, పార్టీని గ్రామ స్థాయి నుంచి మరింత బలోపేతం చేయడం, ప్రతి బూత్‌ను విజయానికి కేంద్రంగా తీర్చిదిద్దడం, కార్యకర్తలకు దిశానిర్దేశం చేయడం ఈ సమావేశం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. జాతీయ అధ్యక్షులు నితిన్ నబిన్ సందేశం తెలంగాణలో పార్టీ శ్రేణులకు నూతన ఉత్సాహాన్ని నింపుతుందని వారు పేర్కొన్నారు. తెలంగాణలో పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని బలోపేతం చేసే లక్ష్యంతో ఈ సమావేశం నిర్వహించబడిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కురవి మండల బీజేపీ సీనియర్ నాయకులు కోనతం పెంటయ్య జిల్లా కార్యదర్శి నాగరాజు బుడిగి బద్రి మరియు జిల్లా కౌన్సిల్ మెంబర్ కోడి రామకృష్ణకురవి మండల ప్రధాన కార్యదర్శులు జన్నె క్రిష్ణ కోనతం వెంకటేష్ కొత్త వెంకన్న జిన్నె నరేందర్ సత్యం వెంకన్న రమేష్ ప్రభాకర్ నీలం సతీష్ బూత్ అధ్యక్షులు, వివిధ మోర్చాల పదాధికారులు ఉత్సాహంగా తరలి వెళ్లారు

## ఏరువాక పౌర్ణమి వేడుకల్లో మంత్రి:పొన్నం ప్రభాకర్ కూరెళ్ల గ్రామంలో నాగలితో దున్ని విత్తనాలు చల్లిన మంత్రి



సిద్దిపేట లోకల్ గైడ్ జూన్ 29:సిద్దిపేట జిల్లా కోహెడ మండలం కూరెళ్ల గ్రామంలో నిర్వహించిన ఏరువాక పౌర్ణమి కార్యక్రమంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. సంప్రదాయ పద్ధతిలో నాగలి దున్ని విత్తనాలు చల్లి వ్యవసాయ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతులందరికీ ఏరువాక పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణలో ఏరువాక పౌర్ణమి వ్యవసాయ ప్రారంభ దినంగా భావిస్తారని పేర్కొన్నారు. రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులు పాడిపంటలతో, ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని భూమాతను ప్రార్థిస్తూ కూరెళ్లలో వ్యవసాయ కార్యక్రమాలను ప్రారంభించినట్లు చెప్పారు. ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావం ఉండే అవకాశం ఉన్నందున రైతులు ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించి అధిక దిగుబడులు సాధించి ఆర్థికంగా బలోపేతం కావాలని సూచించారు. దేశానికి వెన్నెముక అయిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారు.

## దుబ్బాకలో నీలకంఠ షాపింగ్ కాంప్లెక్స్, సంఘ భవనం ప్రారంభ

ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, బక్కి వెంకటయ్య గార్ల చేతుల మీదుగా ప్రారంభం



లోకల్ గైడ్ సిద్దిపేట జూన్ 29:దుబ్బాక పట్టణ కేంద్రంలో నూతనంగా నిర్మించిన నీలకంఠ షాపింగ్ కాంప్లెక్స్‌తో పాటు నీలకంఠ సంఘ భవనాన్ని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆధునిక వాణిజ్య సముదాయాల ఏర్పాటు ద్వారా దుబ్బాకలో వ్యాపారాభివృద్ధికి ఊతం లభిస్తుందని తెలిపారు. ఈ షాపింగ్ కాంప్లెక్స్‌తో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు పట్టణ అభివృద్ధికి కూడా దోహదపడుతుందని పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, మున్సిపల్ చైర్మన్‌తో పాటు మున్సిపల్ కౌన్సిలర్లు, ఇతర ప్రజాప్రతినిధులను నీలకంఠ సంఘం అధ్యక్షుడు, సభ్యులు శాలువాలతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ శ్రీరామ్ సంగీత రవీందర్, వైస్ చైర్మన్ ఆశ సులోచన స్వామి, మున్సిపల్ కౌన్సిలర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, వ్యాపారవేత్తలు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రతి అర్హుడూ తన ఓటు హక్కును కాపాడుకోవాలని ఎక్స్ జెడ్పిటిసి తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి విజ్ఞప్తి చేశారు



లోకల్ గైడ్ తెలంగాణ/ రంగారెడ్డి జిల్లా ఫరూక్నగర్ మండలం ప్రత్యేక సమగ్ర సవరణ( ఎస్ ఆర్ ఐ ) పేరుతో ఎన్నికల సంఘం చేపడుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎక్స్ జెడ్పిటిసి తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి పిలుపునిచ్చారు. ఓటు హక్కు ప్రతి పౌరుని రాజ్యాంగబద్ధమైన హక్కు. ఆ హక్కును ఏ కారణం చేతనైనా దూరం చేసే చర్యలు ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా అధికారులు పారదర్శకంగా వ్యవహరించాలని, రాజకీయ పక్షపాతం లేకుండా సవరణ ప్రక్రియ నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎక్స్ జెడ్పిటిసి తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి నాయకులు, కార్యకర్తలు ప్రతి గ్రామం, వార్డు, బూత్ స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించి, వారి పేర్లు ఓటరు జాబితాలో ఉన్నాయో లేదో తప్పనిసరిగా పరిశీలించాలని కోరారు. పేరు లేకపోయినా లేదా వివరాల్లో తప్పులు ఉన్నా వెంటనే సంబంధిత ఎన్నికల అధికారులను సంప్రదించి సరిదిద్దుకోవాలని సూచించారు.

## తొగుటలో సబ్సిడీపై కంది విత్తనాల పంపిణీ..

రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్న చెరుకు విజయ్ అమర్ రెడ్డి



లోకల్ గైడ్ సిద్దిపేట జూన్ 29:తొగుట మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతులకు సబ్సిడీపై కంది విత్తనాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చెరుకు విజయ్ అమర్ రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ గాంధారి నరేందర్ రెడ్డి, ప్యాక్స్ చైర్మన్ హరికృష్ణ రెడ్డి పాల్గొని రైతులకు కంది విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చెరుకు విజయ్ అమర్ రెడ్డి మాట్లాడుతూ రైతు సంక్షేమం, వ్యవసాయాభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. నాణ్యమైన విత్తనాలను సబ్సిడీపై అందించడం ద్వారా రైతుల సాగు వ్యయం తగ్గి అధిక దిగుబడులు సాధించే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న విత్తనాలు, ఎరువులు, ఇతర వ్యవసాయ సబ్సిడీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకుని వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటించాలని సూచించారు. వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ కుర్మ యాదగిరి, మండల వ్యవసాయ అధికారి మోహన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బక్కోళ్ల నరసింహారెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రీ - మెట్రిక్ స్కాలర్షిప్లకై దరఖాస్తులు



నిజామాబాదు జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్ ), జూన్ 29: నిజామాబాద్ జిల్లాలో 9వ, 10వ తరగతులు చదువుతున్న బీసీ, ఈబీసీ విద్యార్థులు 2026-27 విద్యా సంవత్సరానికి ప్రభుత్వం అందిస్తున్న ప్రీ-మెట్రిక్ స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి సుర్వ సాయి కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న అర్హులైన విద్యార్థులు తెలంగాణ ఇ-పాస్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులకు బీసీ సంక్షేమ శాఖ తరపున రూ.4,000/- ప్రీ-మెట్రిక్ స్కాలర్‌షిప్ అందజేయనున్నట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థుల కుటుంబ వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2.00 లక్షల లోపు ఉండాలని తెలిపారు. అర్హులైన విద్యార్థులు ఆధార్ కార్డు, కుల ధృవీకరణ పత్రం, ఆదాయ ధృవీకరణ పత్రం, పాస్‌పోర్ట్ సైజు ఫోటో, బ్యాంకు పాస్‌బుక్ కాపీ, బోనాఫైడ్ సర్టిఫికెట్‌తో సమీపంలోని మీ సేవ కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## పదవీ విరమణ పొందిన ఎంపీడీవో భాస్కర శర్మకు ఘన సన్మానం




లోకల్ గైడ్ సిద్దిపేట జూన్ 29:దుబ్బాక మండల ఎంపీడీవోగా విశిష్ట సేవలు అందించి పదవీ విరమణ పొందుతున్న వేలేటి భాస్కర శర్మకు దుబ్బాకలో ఘన సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పాల్గొని శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా బక్కి వెంకటయ్య మాట్లాడుతూ ప్రభుత్వ సేవలో భాస్కర శర్మ నిబద్ధత, నిజాయితీతో ప్రజలకు సేవలందించి మంచి గుర్తింపు పొందారని కొనియాడారు. పదవీ విరమణ అనంతరం కూడా ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ శ్రీరామ్ సంగీత రవీందర్, వైస్ చైర్మన్ ఆశ సులోచన స్వామి, ప్యాక్స్ చైర్మన్ కైలాసం, మున్సిపల్ కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

## జడ్చర్ల బస్టాండ్ లో పల్స్ పోలియో కార్యక్రమం. పోలియో చుక్కలు వేసిన కొంగలి శ్రీకాంత్ న్యాయవాది.



లోకల్ గైడ్ జడ్చర్ల జూన్ 29జడ్చర్ల పట్టణంలోని పోలియో చుక్కల పంపిణీ కార్యక్రమం జడ్చర్ల బస్టాండ్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక పోలియో కేంద్రంలో, పోలియో రహిత సమాజ స్థాపనే లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా ముఖ్యఅతిథిగా హాజరై చిన్న పిల్లలకు పోలియో చుక్కలు వేసి పోలియో కేంద్రాన్ని ప్రారంభించిన డాక్టర్ కొంగళి శ్రీకాంత్.ప్రయాణాల్లో ఉన్నవారు, సంచార జాతుల వారు, మరియు స్థానిక ప్రజలకు సైతం ఈ సౌకర్యం అందుబాటులో ఉండేలా ప్రతిగా ఉండే జడ్చర్ల బస్టాండ్లో కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. అక్కడ స్వయంగా ఒక చిన్నారికి పోలియో చుక్కలు వేసిన కొంగలి శ్రీకాంత్. ఈ సందర్భంగా పొంగలి శ్రీకాంత్ మాట్లాడుతూ, ఐదేళ్ల లోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయడం ప్రతి తల్లిదండ్రుల బాధ్యత, గతంలో వేయించినప్పటికీ ప్రతి విడతలోనూ తప్పనిసరిగా డ్రాప్స్ వేయించాలి. మన పిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసం పక్షవాతంలాంటి మహమ్మారి బారిన పడకుండా కాపాడుకోవడానికి ఈ రెండు చుక్కల మందు ఎంతో కీలకం అని పేర్కొన్నారు. బస్టాండ్ పరిసరాల్లో నీ ప్రయాణికులందరూ తమ పిల్లలకు తప్పకుండా పోలియో చుక్కలు వేయించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, ఆశా వర్కర్లు, అంగన్వాడి కార్యకర్తలు, మరియు ప్రయాణికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జూలై 1న పేదల ఇంటి స్థలాలు ఇంటి పట్టాల సాధనకై కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయండి

......సిపిఐ జిల్లా కార్యవర్గ సమావేశంలో బి విజయ సారధి పిలుపు




లోకల్ గైడ్ మహబూబాబాద్ మహబూబాబాద్ జిల్లా జూలై 5 6 7 తొర్రూర్ లో సిపిఐ జిల్లా రాజకీయ సైద్ధాంతిక శిక్షణా తరగతులు జయప్రదం చేయండి సిపిఐ జిల్లా కార్యవర్గ సమావేశంలో బి విజయ సారధి పిలుపు భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ మహబూబాబాద్ జిల్లా కార్యవర్గ సమావేశం నేడు జిల్లా కార్యవర్గ సభ్యురాలు మామిండ్ల సాంబ లక్ష్మీ అధ్యక్షతన జరిగింది ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సీపీఐ జిల్లా కార్యదర్శి బి విజయసారథి మాట్లాడుతూ జూలై 1న నిరుపేదల ఇంటి స్థలాల సాధనకై ఇంటి పట్టాల కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు జిల్లా కేంద్రంలో వేలాదిమంది ఇండ్లు లేని నిరుపేదలు ఇంటికిరాయిలు కట్టలేక ఇబ్బందులు పడుతున్నారని వారికి ఇంటి స్థలాలు ప్రభుత్వమే పంచాలని డిమాండ్ చేశారు అక్రమంగా ఇటీవల నిరుపేదలు వేసుకున్న గుడిసెలను రెవెన్యూ మున్సిపల్ పోలీసులు అక్రమంగా తెల్లవారుజామున కూలగొట్టి పేదవారిని నిరాశ్రయులుగా చేశారు అక్రమంగా నేతలపై కేసులు పెట్టారన్నారు రాష్ట్రవ్యాప్తంగా సిపిఐ ఇల్లు లేని నిరుపేదల కోసం ఉద్యమిస్తుంది అన్నారు ఇటీవల హన్మకొండ గుండ్ల సింగారంలో వేలాదిమంది గుడిసెలు వేసుకుంటే అర్ధరాత్రి వచ్చి కూలగొట్టారని వీటన్నిటిని నిరసిస్తూ జూలై 1న వందలాది మందితో కలెక్టరేట్ ముట్టడి చేస్తున్నామన్నారు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు మానుకోట జిల్లా కేంద్రంలో వందలాది ఎకరాలు ప్రభుత్వం ఆధీనంలో ఉన్నాయన్నారు కొంతమంది పెద్దలు కబ్జా చేస్తుంటే అధికారులు ప్రజాప్రతినిధులు కనులు మూసుకుపోయాయి అన్నారు పేదలు జానెడు గుడిసెలు వేసుకుంటే కూల్చేస్తారని హెచ్చరించారు మహబూబాబాద్ కలెక్టరేట్ ముట్టడి జూలై 1న పెద్ద ఎత్తున నిర్వహించబోతున్నామని కార్యకర్తలు ఇల్లు లేని నిరుపేదలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు ఈ సందర్భంగా తొర్రూర్ లో జులై 5 6 7న సిపిఐ మహబూబాబాద్ జిల్లా రాజకీయ సైతాంతిక శిక్షణా తరగతులు మూడు రోజులపాటు నిర్వహిస్తున్నామని పార్టీ శ్రేణులు శిక్షణా తరగతులలో పాల్గొనాలని పిలుపునిచ్చారు ఈ శిక్షణా తరగతులలో జిల్లా సమస్యలపై చర్చించి భవిష్యత్తు పోరాటాలకు బాటలు వేస్తామని మిలిటెంట్ ఉద్యమాన్ని జిల్లాలో నిర్మించి ముందుకు పోతామన్నారు పార్టీ బలోపేతానికి కార్యకర్తలంతా కృషి చేయాలని పిలుపునిచ్చారు ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బి అజయ్ సారధి రెడ్డి నల్లు సుధాకర్ రెడ్డి కట్టబోయిన శ్రీనివాస్ పెరుగు కుమార్ రేషపల్లి నవీన్ చింతకుంట్ల వెంకన్న కట్లోజు పాండురంగ చారి వరిపల్లి వెంకన్న నెల్లూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు

## అంత్యక్రియలకు ఆర్థిక సహాయం అందించిన అభిమన్యు రెడ్డి.



లోకల్ గైడ్ జడ్చర్ల జూన్ 29జడ్చర్ల నియోజకవర్గం రాజాపూర్ మండల పరిధిలోని ఖానాపూర్ గ్రామానికి చెందిన పూజారి నర్సమ్మ (76) సంవత్సరాలు మరణించడం జరిగింది. ఈ విషయాన్ని బి ఆర్ ఎస్ పార్టీ యువనేత చించోడు అభిమన్యు రెడ్డికి తెలుపగా, ఆయన వెంటనే స్పందించి సంతాపం తెలిపి యువసేన సభ్యుల ద్వారా 5000 రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పూజారి శేఖర్, వెంకట్ రెడ్డి, ముస్తఫా, సిరాజ్, చాన్,మహమ్మద్,గ్రామస్తులు మరియు బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు, యువసేన సభ్యులు,తది తరులు పాల్గొన్నారు.

## కల్లూరు పట్టణంలో నూతన డిసిసిబి బ్యాంకును ప్రారంభించిన మంత్రి తుమ్మల



లోకల్ గైడ్. కల్లూరు. పాల్గొన్న స్థానిక శాసన సభ్యురాలు డాక్టర్ మట్టా రాగమై దయానంద్.సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలోని కల్లూరు పట్టణములో నూతన గా ఏర్పాటుచేసిన డి సి సి బి నూతన బ్రాంచ్ ను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈరోజు ఉదయం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రి తుమ్మల తో పాటు సత్తుపల్లి నియోజకవర్గ శాసన సభ్యురాలు డాక్టర్ మట్టా రాగమై దయానంద్ తో పాటు సహకార సంఘ జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, ప్రజలు, తుమ్మల అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గం దానవాయిగూడెం లో దారుణం...




లోకల్ గైడ్. పాలేరు.కాంట్రాక్టు బిల్లు రాలేదని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల గేట్ కి తాళం వేసిన కాంట్రాక్టర్ గేట్ బయట పహారకాస్తున్న విద్యార్థులు,ఉపాధ్యాయులు మన ఊరు - మన బడి ప్రణాళిక సందర్భంగా చేసిన మరమ్మత్తులు బిల్లు ఇస్తేనే గేట్ తాళం తీస్తానని ఉపాధ్యాయులతో వాగ్వివాదం..11 లక్షలు రూపాయల బకాయి తక్షణం మంజూరు చేయక పోతే పెట్రోల్ పోసుకొని చేస్తానని నిరసన చేస్తున్న కాంట్రాక్టర్ అయోధ్య...ఉన్నత అధికారులకు సమాచారం ఇచ్చిన ఉపాధ్యాయులు, రంగంలోకి విద్యా ఉన్నత అధికారులు

## 1/70 చట్టం ఎవరి కోసం...

## గొండ్వానా సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షులు పూనెం ప్రతాప్

-ఆదివాసి భూములు గిరిజనేతరుల పరం...

-అక్రమ నిర్మాణాలు చేపడుతున్నా పట్టించుకోని అధికారులు...



వాజేడు, లోకల్ గైడ్ ప్రతినిధి :- ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీలకే ఆస్తి హక్కు ఉండాలన్న నినాదంతో కేంద్ర ప్రభుత్వం ఐదో షెడ్యూల్లో చేర్చి తెచ్చిన, 1/70 చట్టానికి కొందరు అక్రమార్కులు తూట్లు పొడుస్తున్నారని గోండ్వానా సంక్షేమ పరిషత్ ములుగు జిల్లా అధ్యక్షుడు పూనెం ప్రతాప్



ఆరోపించారు. ఆదివాసీ గిరిజనుల సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షించడం, అంతరించి పోతున్న తెగలను కాపాడలనే లక్ష్యంతో కేంద్రం ఈ చట్టాన్ని తీసుకొచ్చిందన్నారు.పూర్తిగా ఏజెన్సీ ప్రాంతమైన కొంగాల గ్రామపంచాయతీ పరిధిలోని జగన్నాధపురం ప్రధాన రహదారి ఇరువైపులా 1/70 చట్టానికి విరుద్ధంగా జరుగుతున్న భూముల విక్రయాలు,అక్రమ కట్టాలు ఆపాలని. సోమవారం వాజేడు మండలం నాయబ్ తాసిల్దార్ రామ్ సింగ్ ను కలసి వినతిపత్రము అందించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ.ఏజెన్సీ ఏరియాగా గుర్తించిన ప్రాంతంలో 1/70 చట్టం ప్రకారం గిరిజనులకు మాత్రమే భూములపై సంపూర్ణ హక్కులు ఉంటాయని.ఆ భూములు గిరిజనేతరులకు ఎట్టి పరిస్థితుల్లోనూ విక్రయించడం కానీ, హక్కులు కల్పించడం కానీ చేయకూడదని అన్నారు.ఒక వేళ గిరిజనులు వ్యక్తిగత అవసరా నిమిత్తం భూములు విక్రయించాల్సి వచ్చినా గిరిజనులకు మాత్రమే అమ్మ జూపాలి. లేదా ప్రభుత్వానికి విక్రయించాలి. తిరిగి ప్రభుత్వం సదరు భూములను గిరిజనులకు తప్పా ఇతర వర్గాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ హక్కులు కల్పించకూడదని.ప్రజాప్రయోజనాల రీత్యా భూమి అవసరమైతే సంబంధిత గ్రామ పంచాయతీలలో గ్రామసభ ద్వారా తీర్మానం చేసి మాత్రమే అక్కడ గిరిజనేతరులకు లేదా ప్రభుత్వానికి భూమిని ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు. ఒక వేళ గిరిజనేతరులు ఆయా స్థలాలను ఆక్రమించినా, కొనుగోలు చేసినా అధికారికంగా వారికి ఎలాంటి హక్కు ఉండవని స్పష్టం చేశారు. జగన్నాధపురం ప్రధాన రహదారికి ఇరువైపులా గిరిజనుల భూములను డబ్బు ఆశ చూపుతూ,వలస గిరిజనేతర్లు కొనుగోలు చేస్తున్నారని,అట్టి భూమిలో గ్రామపంచాయతీ తీర్మానాలు లేకుండా పంచాయతీ అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని ఆయన ఆరోపించారు.గిరిజనుల ప్రయోజనాలను పరిరక్షించే 1/70 చట్టాన్ని అధికారులు కచ్చితంగా అమలు చేయాలని,రెవిన్యూ అధికారులు ఉదాసీనతగా వ్యవహరించడంతో గిరిజనేతరులు ఆదివాసీ భూముల్లో తిష్ఠ వేసి యథేచ్ఛగా రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేస్తున్నారని మండిపడ్డారు.ఏజెన్సీలో గిరిజనేతరులు అక్రమ నిర్మాణాలను ప్రభుత్వం వెంటనే స్వాధీనం చేసుకోవాలని.ఆదివాసుల దగ్గర కొన్న భూమిని వెంటనే స్వాధీన పరుచుకొని గిరిజననేతర్లపై ఎస్టీఆర్ కేసులు నమోదు చేయాలని అన్నారు.లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతాం హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పద్దం సుధాకర్,కార్యదర్శి కారం రాజబాబు, తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన దర్బార్‌కు వచ్చిన ప్రతి అర్జీని

## త్వరితగతిన పరిష్కరించాలి : ఐటిడీఏ పీవో బీ రాహుల్



భద్రాచలం : లోకల్ గైడ్ :వర్షాలు కురుస్తున్నప్పటికీ ఎంతో నమ్మకంతో గిరిజన దర్బార్‌కు వస్తున్న ఆదివాసీ కుటుంబాల సమస్యలను సత్వరమే పరిష్కరించడంతో పాటు, అర్హులైన ప్రతి గిరిజన కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా సంబంధిత అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని ఐటిడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ సూచించారు. సోమవారం భద్రాచలంలోని ఐటిడీఏ సమావేశ మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బార్‌లో సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజనుల నుంచి ఆయన అర్జీలు స్వీకరించారు. అనంతరం వాటిని సంబంధిత శాఖల అధికారులకు పంపిస్తూ, వీలైనంత త్వరగా సమస్యలు పరిష్కరించి ప్రభుత్వ పథకాల లబ్ధి అర్హులందరికీ అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా గిరిజనులు గురుకులం, ఈఎంఆర్ఎస్ పాఠశాలల్లో ప్రవేశాలు, పోడు భూముల పట్టాలు, పట్టాలలో పేర్ల మార్పు, రైతుబంధు, వ్యక్తిగత మరియు భూ సమస్యలు, ఉన్నత విద్యకు ఆర్థిక సహాయం, వ్యవసాయానికి విద్యుత్, బోర్లు, మోటార్లు, మారుమూల గ్రామాలకు తాగునీటి సౌకర్యం, కొత్త మత్స్యకార సంఘాల ఏర్పాటు, దీర్ఘకాలిక వ్యాధుల చికిత్సకు ఆర్థిక సహాయం, స్వయం ఉపాధి కోసం వృత్తి శిక్షణలు, వ్యవసాయ బోర్ల అనుమతులు, సౌర విద్యుత్ కనెక్షన్లు, ఇసుక సొసైటీల సమస్యల పరిష్కారం తదితర అంశాలపై అర్జీలు సమర్పించినట్లు పీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్, ఆర్‌సీఓ గురుకులం అరుణకుమారి, డీడీ ట్రైబల్ వెల్ఫేర్ చందన, ఎస్‌డీసీ ఆనంద్ కుమార్, ఈఈ ట్రైబల్ వెల్ఫేర్ మధుకర్, ఏడీఎంహెచ్‌వో సైదులు, ఏవో సున్నం రాంబాబు, ఏడీ అగ్రికల్చర్, ఉద్యానవన శాఖ అధికారి ఉదయ్ కుమార్, ఏపీఓ పవర్ వేణు, ఎస్‌డీసీ మనిధర్, పీవీటీజీ అధికారి గన్యా, హౌసింగ్ ఏఈ హేమంత్, మిషన్ భగీరథ ఏఈఈ నారాయణరావు, మేనేజర్ ఆదినారాయణ, జేడీఎం హరికృష్ణ, ఐసీడీఎస్ సూపర్వైజర్ చంద్రకళతో పాటు వివిధ శాఖల అధికారులు, సిబ్బంది స్వాతి, లింగా నాయక్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను

## సత్వరమే పరిష్కరించాలి: అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్

ప్రజావాణి కార్యక్రమంలో 162 దరఖాస్తుల స్వీకరణ



సిద్దిపేట లోకల్ గైడ్ జూన్ 29: ప్రజావాణి కార్యక్రమానికి వచ్చే ప్రజల సమస్యలను అత్యంత ప్రాధాన్యంతో తీసుకుని సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) లక్ష్మీ కిరణ్ అధికారులను ఆదేశించారు.సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయం (ఐడీఓసీ) సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా మొత్తం 162 దరఖాస్తులు వివిధ సమస్యలపై అందాయి.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజలు తమ సమస్యల పరిష్కారంపై అధికారులపై నమ్మకంతో ప్రజావాణికి వస్తారని, అందువల్ల అందిన ప్రతి దరఖాస్తుకు అధిక ప్రాధాన్యత ఇచ్చి సంబంధిత శాఖలు వెంటనే పరిష్కార చర్యలు చేపట్టాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి నాగరాజమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## సాంఘిక సంక్షేమ గురుకులాల్లోఉపాధ్యాయ

## అధ్యాపక ఖాళీల భర్తీ కి దరఖాస్తుల ఆహ్వానం

నారాయణపేట జూన్ 29లోకల్ గైడ్ :నారాయణపేట జిల్లాలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల్లో తాత్కాలిక ప్రాతిపదికన ఉపాధ్యాయ, అధ్యాపక ఖాళీలను భర్తీ చేయను న్నట్లు జిల్లా సమన్వయ అధికారిణి బి . నాగమణి మాల ఒక ప్రకటనలో తెలిపారు.అర్హత కలిగిన ఆసక్తి ఉన్న అభ్యర్థులు జూలై నెల 1వ తేదీన ఉదయం పది గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు దరఖాస్తులు తెలంగా ణ సాంఘిక సంక్షేమ గురు కుల పాఠశాల/కళాశాల, మరికల్ నందు సమర్పించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.డెమో జూలై 3వ తేదీన ఉదయం పది గంటలకు జరుపబడుననీ తెలిపారు. నమోదు చేసుకున్న అభ్యర్థులు విద్యా అర్హతల ఒరిజినల్ ధృవ పత్రాలతో పాటు జిరాక్స్ ప్రతులను వెంట తీసుకుని రావాలని తెలిపారు. బాలికల పాఠశాలలు, కళాశాలల్లో బోధించుటకు మహిళా అభ్యర్థులు మాత్రమే అర్హులని పేర్కొన్నారు.బాలికల పాఠశాలలు, కళాశాలల్లో తెలుగు, ఇంగ్లీష్, మ్యాథ్స్, బయో సైన్స్, సోషల్,పి.ఈ.టి, ఆర్ట్/క్రాఫ్ట్/మ్యూజిక్, లైబ్రేరియన్ , హెల్త్ సూపర్ వైజర్ ఖాళీలు, అధ్యాపక ఖాళీలు తెలుగు, ఇంగ్లీష్, మ్యాథ్స్,జువాలజి, ఫిజిక్స్, కెమిస్ట్రీ.బాలుర పాఠశాలలో సోషల్ , లైబ్రేరియన్ పోస్టులఖాళీలు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## ప్రజలకు పారదర్శకంగా

## సేవలు అందించాలి : జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్




నారాయణపేట, జూన్ 29: లోకల్ గైడ్ పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారునికి ఎలాంటి భేదభావం లేకుండా పారదర్శకంగా, మర్యాదపూర్వకంగా సేవలు అందించాలని నారాయణపేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ పోలీసు అధికారులను ఆదేశించారు.వార్షిక తనిఖీల్లో భాగంగా సోమవారం ఉట్కూర్ పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ నల్లపు లింగయ్య, సీఐ రామ్‌లాల్, ఎస్ఐ రమేష్ పూలమొక్క అందించి స్వాగతం పలికారు. అనంతరం ఎస్పీ పోలీసుల గౌరవ వందనం స్వీకరించి పరేడ్, యూనిఫాం టర్నౌట్‌ను పరిశీలించి పలు సూచనలు చేశారు.పోలీస్ స్టేషన్ పరిసరాలు, పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ, పెండింగ్ కేసుల పురోగతి, దర్యాప్తు నాణ్యత, ప్రజలకు అందిస్తున్న సేవలు, సిబ్బంది పనితీరును సమీక్షించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులను ఎలా స్వాగతిస్తున్నారు, ఫిర్యాదులను ఆన్లైన్‌లో ఎలా నమోదు చేస్తున్నారో ప్రత్యక్షంగా పరిశీలించారు. అలాగే సి సి టి ఎం ఎన్ వ్యవస్థలో కేసుల నమోదు, నిర్వహణ విధానాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు.పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీటర్లు, కమ్యూనల్ షీటర్లపై నిరంతర నిఘా ఉంచి విధిగా తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. నేర నియంత్రణ, క్రైమ్ ప్రివెన్షన్, కేసుల త్వరితగతిన పరిష్కారం, ప్రజలతో సత్సంబంధాల పెంపుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకుని వెంటనే స్పందించాలని తెలిపారు. ప్రతి విలేజ్ పోలీస్ ఆఫీసర్ తమకు కేటాయించిన గ్రామాలను క్రమం తప్పకుండా సందర్శిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రతి పోలీసు సిబ్బంది నీట్ టర్నౌట్‌తో పాటు వృత్తిపై నిబద్ధత, క్రమశిక్షణ, సమయపాలన పాటించాలని పేర్కొన్నారు.పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుతో మర్యాదపూర్వకంగా మాట్లాడి వారి సమస్యను క్షుణ్ణంగా తెలుసుకుని తక్షణ చర్యలు తీసుకోవాలని, ప్రజల్లో పోలీసులపై నమ్మకం, భద్రత, భరోసా పెంపొందేలా వ్యవహరించాలని సూచించారు. డయల్-100 సేవలపై వేగంగా స్పందించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు.మహిళల భద్రత, సైబర్ నేరాల నివారణ, రోడ్డు ప్రమాదాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించిన ఎస్పీ, ప్రధాన రహదారులపై ప్రమాదాలు అధికంగా జరిగే హాట్‌స్పాట్లను గుర్తించి సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని భద్రతా చర్యలు చేపట్టాలని తెలిపారు.దొంగతనాల నివారణకు ముందస్తు నిఘా వ్యవస్థను బలోపేతం చేయాలనే విధానాన్ని అనుసరిస్తూ నేరాలు జరగక ముందే అప్రమత్త చర్యలు చేపట్టాలని సూచించారు. కాలనీలు, గ్రామాల్లో నిరంతర పెట్రోలింగ్ నిర్వహిస్తూ పాత నేరస్తులపై నిఘా ఉంచాలని, దొంగతనాలు జరిగిన వెంటనే కేసులను ఛేదించాలని ఆదేశించారు. అక్రమ వ్యాపారాలపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు.అనంతరం పోలీసు అధికారులు, సిబ్బందితో కలిసి ఎస్పీ మొక్కలు నాటారు.ఈ కార్యక్రమంలో డీఎస్పీ నల్లపు లింగయ్య, సీఐ రామ్ లాల్, ఎస్ఐ రమేష్,ఎస్ బి ఎస్సై భాగ్యలక్ష్మి రెడ్డి, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## వద్వాట్ లో డ్రైనేజీ పనులకు శ్రీకారం



నారాయణపేట జూన్ 29 లోకల్ గైడ్.:మాగనూర్ మండలం వద్వాట్ గ్రామపంచాయతీలో 15వ ఆర్థిక సంఘం కింద మంజూరు అయిన 2.60 లక్షల నిధులతో మురుగు కాల్వల సైడ్ డ్రెయిన్ పనులకు సోమవారం సర్పంచ్ జి రవీందర్ ప్రారంబించి శ్రీకారం చుట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా పని చేస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్స్ , గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఘనంగాశ్రీ లక్ష్మీ నరసింహ స్వామివారి అభిషేక సేవ



నారాయణపేట జూన్ 29 లోకల్ గైడ్.: మాగనూర్ లో వెలసిన శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయంలో సోమవారం ఏరువాక పౌర్ణమి సందర్భంగా స్వామివారికి ఘనంగా అభిషేక సేవ నిర్వహించారు.ఈ సేవలో ఓబుళశెట్టి సునీత అనిల్ దంపతులు భక్తిశ్రద్ధలతో స్వామివారికి అభిషేకం నిర్వహించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ పవిత్ర సేవలో వారు ఎంతో భక్తి, వినయంతో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. వారి ప్రార్థనలతో ఆలయ ప్రాంగణం భక్తిరసంతో నిండిపోయి, ప్రతి ఒక్కరి హృదయంలో ఆధ్యాత్మిక ఆనందాన్ని నింపింది.కాగా ఈ కార్యక్రమంలో 101 సంవత్సరాల వయస్సు గల కోమటి ఈశ్వరమ్మ పాల్గొనీ స్వామి వారి సేవలో పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.- ఈ వయస్సులోనూ స్వామివారి పట్ల ఆమెకు ఉన్న అచంచల భక్తి అందరికీ స్ఫూర్తిదాయకం.ఆమె భక్తి, విశ్వాసం నిజంగా తరతరాలకు ఆదర్శం.వీరి సేవా భావానికి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ కమిటీ తరపున హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలియజేసారు.స్వామివారి కటాక్షం మీ కుటుంబంపై ఎల్లప్పుడూ ఉండి,ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు,సుఖసంతోషాలు ప్రసాదించాలని ప్రార్థించారు.శతాధిక వృద్ధురాలు కోమటి ఈశ్వరమ్మను ఆలయ కమిటీ చైర్మన్ రమేష్ గౌడ్, కోశాధికారి కే కృష్ణయ్య, సభ్యులు పురుషోత్తం రెడ్డి, పూజారి ప్రభు ఘనంగా సన్మానించారు.

## కలెక్టరేట్ ప్రజావాణికి 23 ఫిర్యాదులు



నారాయణపేట జూన్ 29: లోకల్ గైడ్.నారాయణపేట కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యత నిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక అధికారులకు సూచించారు. ప్రజావాణి సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 23 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదు దారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీను, డి.ఆర్.ఓ లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ,డి.ఆర్.ఓ.రాజేశ్వరి వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆదర్శంగా ప్రజాపాలన...పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు



నారాయణపేట జూన్ 29లోకల్ గైడ్.:రాష్ట్రంలో ఆదర్శంగా ప్రజాపాలన సాగుతున్నదని అర్హులందరికీ కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ళు నిర్మిస్తున్నదని నారాయణపేట మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్,ఇందిరమ్మ ఇంటి కమిటీ సభ్యులు నారాయణమ్మ కాశినాథ్ అన్నారు.సోమవారం నారాయణపేట మండలం అప్పిరెడ్డిపల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ పోలీసు వెంకటరెడ్డి తో కలిసి ఇందిరమ్మ కమిటీ సభ్యులు బొక్క నారాయణమ్మ పూర్తి అయిన ఇందిరమ్మ ఇంటిని ప్రారంబించారు.ఈ కార్యక్రమంలో అవసరం శ్రీనివాస్ ,గాలదేవేంద్రప్ప, సెక్రెటరీ విజయలక్ష్మి ,గ్రామ ఉపసర్పంచ్ అంజిలమ్మ, అనుమంతు లతో కలిసి బొక్క కవిత గృహప్రవేశానికి బొక్క నారాయణమ్మ రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ వార్డు మెంబర్లు వర్కర్లు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# వర్షాల నేపథ్యంలో రైతు ఆశీర్వాద సభ వాయిదా..

# డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

లోకల్ గైడ్. ఖమ్మంరైతు భరోసా పంపిణీ అనంతరం ఘనంగా రైతు ఆశీర్వాద సభ నిర్వహిస్తాంరైతు సంక్షేమంలో తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శం.. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుఖమ్మం, ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం చేపడుతున్న రైతు సంక్షేమ, ప్రజా కార్యక్రమాలను మెచ్చి వరణ దేవుడు కరుణించాడని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. ఈనెల 30న చింతకాని మండలం జగన్నాధపురం లో నిర్వహించనున్న రైతు ఆశీర్వాద సభ సభా ప్రాంగణాన్ని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, పోలీస్ కమీషనర్ సునీల్ దత్, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ లతో కలిసి డిప్యూటీ సీఎం సోమవారం పరిశీలించారు. అనంతరం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు మీడియాతో మాట్లాడాతూ వాతావరణ పరిస్థితులు, వర్షాల కారణంగా ఈ నెల 30న ఖమ్మం జిల్లా చింతకాని మండలం మత్కేపల్లి క్రాస్ రోడ్, జగన్నాథపురం గ్రామంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిధిగా హాజరవనున్న రైతు ఆశీర్వాద సభను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. రైతులు, ప్రజలు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు అన్నారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో సభా ప్రాంగణం పూర్తిగా బురదమయంగా మారిందని, ప్రస్తుత పరిస్థితుల్లో లక్షలాది మంది రైతుల సమక్షంలో సభ నిర్వహించడం సాధ్యం కాదని తెలిపారు.రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం రైతుల సౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకొని సభను వాయిదా వేస్తోందని పేర్కొన్నారు. తొలుత ప్రారంభోత్సవ సభగా నిర్వహించాలని భావించిన ఈ కార్యక్రమాన్ని, ఇప్పుడు రైతు భరోసా పంపిణీ పూర్తయిన అనంతరం మరింత వైభవంగా 'రైతు ఆశీర్వాద సభ' పేరుతో ముగింపు వేడుకగా నిర్వహిస్తామని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు.వాతావరణ శాఖ నివేదికల ప్రకారం జిల్లాలో జూలై 3 లేదా 4వ తేదీ వరకు వర్షాలు కొనసాగే అవకాశం ఉందని తెలిపారు. రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మరో వారం రోజుల వాతావరణ పరిస్థితులను సమీక్షించి, పరిస్థితులు అనుకూలిస్తే జూలై 6, 7 లేదా 8వ తేదీల్లో సభ నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు.ఈ భారీ బహిరంగ సభను విజయవంతం చేసేందుకు స్థానిక మంత్రులు, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికార యంత్రాంగం సమన్వయంతో ఏర్పాట్లు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా రైతులు, ప్రజలు ఈ సభపై విశేష ఆసక్తి చూపుతున్నారని, వాతావరణం అనుకూలించిన వెంటనే నిర్వహించే రైతు ఆశీర్వాద సభ ప్రజలు ఊహించని స్థాయిలో విజయవంతం అవుతుందని డిప్యూటీ సీఎం విశ్వాసం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా లిరాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూవర్షాల కారణంగా చింతకాని మండలంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొనాల్సిన రైతు ఆశీర్వాద సభను వాయిదా వేసినట్లు తెలిపారు. రైతుల భద్రత, ప్రజల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. వర్షం అడ్డొచ్చినా రైతు సంక్షేమం ఆగదని, రైతు భరోసా నిధుల విడుదలకు సీఎం సిద్ధంగా ఉన్నారని,మంగళవారం హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు భరోసా పథకం నిధులను విడుదల చేస్తారని మంత్రి వెల్లడించారు. అనంతరం రాష్ట్రవ్యాప్తంగా రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమ చేసే ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు.రైతు భరోసా, రుణమాఫీ అంశాలపై ప్రతిపక్ష నాయకులు అర్థంపర్థం లేని విమర్శలు చేస్తున్నారని మంత్రి అన్నారు. గత ప్రభుత్వం పదేళ్లలో రైతు బంధు కింద రూ. 72 వేల కోట్లు అందించగా, ప్రజా ప్రభుత్వం కేవలం రెండున్నరేళ్లలోనే రైతు భరోసా ద్వారా రూ. 36 వేల కోట్ల సాయం అందించిందని అన్నారు.యూరియా పంపిణీ కోసం రూపొందించిన యాప్ ద్వారా రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎరువులు అందుతూ ఉన్నాయని, దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణ ప్రభుత్వం అన్ని రకాల పంటలను మద్దతు ధరకు కొనుగోలు చేస్తోందని మంత్రి స్పష్టం చేశారు. వానాకాలం సాగు ప్రారంభమవుతున్న నేపథ్యంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రైతు భరోసా పథకం కింద కేవలం తొమ్మిది రోజుల్లోనే రూ.9 వేల కోట్లను రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని తెలిపారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని పనిచేస్తోందని, ఈ పాలనలో తెలంగాణలో రైతు రాజ్యం సాకారమై దేశానికే మార్గదర్శకంగా నిలుస్తుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఆర్ అండ్ బి ఎస్ఇ యాకుబ్, విద్యుత్ శాఖ ఎస్ఇ శ్రీనివాసాచారి, పీఆర్ ఎస్ఇ వెంకట్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, మహబూబాబాద్ జిల్లా వ్యవసాయ అధికారి విజయ చందర్, డిఆర్డీవో శ్రీరామ్, ఖమ్మం ఆర్డీవో శ్రీనివాస్, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి సునీల్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య మహాసభ విద్యా కమిటీ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు ఘన సన్మానం



లోకల్ గైడ్. ఖమ్మం.ఖమ్మం మమతా కాలేజీ రోడ్ లో పసుమర్తి ఫంక్షన్ హాల్ నందు ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య మహాసభ విద్యా కమిటీ ఆధ్వర్యంలో పదో తరగతి అన్ని మండలాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన ఆర్యవైశ్య విద్యార్థిని , విద్యార్థులకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది . ఈ కార్యక్రమం ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య మహాసభ విద్యా కమిటీ చైర్మన్ రాయల నాగేశ్వరరావు అధ్యక్షతన , ప్రధాన కార్యదర్శి పెనుగొండ ఉపేంద్రరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు పసుమర్తి సీతా చంద్రావు , ప్రధాన కార్యదర్శి గోళ్ళ రాధాకృష్ణమూర్తి , ముఖ్య సమన్వయకర్త చారుగుండ్ల నరసింహమూర్తి , విశిష్ట అతిథులు విశిష్ట ఫౌండేషన్ ప్రతినిధి గుర్రం సీత , స్టెప్స్ పార్క్ జూనియర్ కాలేజ్ అధినేత కొండా శ్రీధర్ , పసుమర్తి ఫంక్షన్ హాల్ అధినేత పసుమర్తి రామచంద్రరావు , ప్రవీణ్ పాల్గొని విద్యార్థినీ , విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షిస్తూ ఈ కార్యక్రమాన్ని ఇంత ఘనంగా ఏర్పాటుచేసిన విద్యా కమిటీని అభినందించడం జరిగింది . ఈ కార్యక్రమానికి ఉపాధ్యక్షులు వేమిశెట్టి మోహన్ దాస్ , కార్యదర్శులు మందడపు శ్రీనివాసరావు , వెచ్చా రామకృష్ణ , దాచేపల్లి రామకృష్ణ తదితర కమిటీ సభ్యులు నిర్వహించడంతో పాటుగా , తల్లిదండ్రులు , ఆర్యవైశ్య నాయకులు పాల్గొని తమ ఆనందాన్ని వెలిపుచ్చటం జరిగింది .

## సిద్దిపేట జిల్లాలో రెండో రోజు పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం -- 100.56 శాతం లక్ష్య సాధన




సిద్దిపేట లోకల్ గైడ్ జూన్ 29:జాతీయ పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా సిద్దిపేట జిల్లాలో రెండో రోజు ఇంటింటి సర్వే, ట్రాన్సిట్ పాయింట్లు, మొబైల్ బృందాల ద్వారా నిర్వహించిన పోలియో చుక్కల కార్యక్రమం విజయవంతంగా పూర్తయింది. జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఆదేశాల మేరకు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ధనరాజ్ పర్యవేక్షణలో ప్రోగ్రాం అధికారులు, సూపర్వైజర్లు, ఆరోగ్య సిబ్బంది విస్తృతంగా కార్యక్రమాన్ని నిర్వహించారు.రెండో రోజు ఆరోగ్య సిబ్బంది రెండు బృందాలుగా ఏర్పడి ఇంటింటికి వెళ్లి తొలి రోజు చుక్కలు వేయించుకోని చిన్నారులను గుర్తించి పోలియో చుక్కలు వేశారు. అలాగే మొబైల్ టీంల ద్వారా వలస కార్మికుల పిల్లలు, ఇటుక బట్టీలు, క్వారీలు, రహదారుల వెంట ఉన్న చిన్నారులు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు వంటి ట్రాన్సిట్ కేంద్రాల్లో ఉన్న పిల్లలకు కూడా పోలియో చుక్కలు అందించారు.జిల్లాలో మొత్తం లక్ష్యం 94,321 మంది చిన్నారులు కాగా, రెండో రోజు ఇంటింటి సర్వే ద్వారా 3,649 మంది, ట్రాన్సిట్ పాయింట్లలో 426 మంది, మొబైల్ టీంల ద్వారా 208 మంది, రహదారుల వెంట గుర్తించిన 54 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. రెండో రోజు మొత్తం 4,534 మంది చిన్నారులకు పోలియో చుక్కలు అందించగా, రెండు రోజుల కలిపి మొత్తం 94,854 మంది చిన్నారులకు చుక్కలు వేయడంతో జిల్లా 100.56 శాతం లక్ష్యాన్ని అధిగమించింది.ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ దీప్తి ప్రియాంక జిల్లాలో నిర్వహించిన కార్యక్రమాల వివరాలను వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వినోద్ బాబ్జి, డాక్టర్ నిర్మలారెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్‌వోలు డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ మహేందర్ రెడ్డి, డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ శ్రీకాంత్ యాదవ్, డాక్టర్ మీనా కుమారి, సూపర్వైజర్లు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.రేపు మూడో రోజు కూడా ఇంటింటి సర్వే, మొబైల్ బృందాలు, ట్రాన్సిట్ బృందాల ద్వారా మిగిలిన ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ధనరాజ్ తెలిపారు.

## హరీష్ రావుపై రేవంత్ వ్యాఖ్యలను ఖండించిన బీఆర్ఎస్ నేతలు.. క్షమాపణ చెప్పాలని డిమాండ్



సిద్దిపేట లోకల్ గైడ్ జూన్ 29:నల్గొండ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావుపై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పాల సాయిరాం, ఎడ్ల సోమిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నాయకులు ఎల్లారెడ్డి, ఆంజనేయులు, కీసర పాపయ్య, జంగిటి శ్రీనివాస్‌లతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.హరీష్ రావు, తెలంగాణ ఉద్యమకారులపై చేసిన వ్యాఖ్యలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బేషరతుగా క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమంలో హరీష్ రావు కీలక పాత్ర పోషించారని, అలాంటి నాయకుడిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదన్నారు.తెలంగాణ ఉద్యమం గురించి మాట్లాడే నైతిక హక్కు రేవంత్ రెడ్డికి లేదని ఆరోపించిన వారు, ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకే ప్రతిపక్ష నేతలపై వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారని విమర్శించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ప్రజలతో కలిసి పోరాడిన నాయకులను అవమానించే విధంగా వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదన్నారు.కాంగ్రెస్‌లో చేరిన మాజీ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి ప్రజాక్షేత్రంలోకి రావాలని సవాల్ విసిరిన బీఆర్ఎస్ నేతలు, తెలంగాణ ఉద్యమకారులను కించపరిచే వ్యాఖ్యలను రాష్ట్ర ప్రజలు, మేధావులు ఖండించాలని కోరారు.ఈ సమావేశంలో నాయకులు దేవయ్య, సాయి ప్రేమ్, హైమద్ తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్ ను మర్యాదపూర్వకంగా కలిసిన మెదక్ మైనారిటీ చైర్మన్ సూఫీజ్ జానీ



మెదక్ లోకల్ గైడ్ ప్రతినిధి (జూన్29) మెదక్ కలెక్టర్ గారిని మర్యాదపూర్వకంగా నూతనంగా నియమించబడ్డ మెదక్ డిస్టిక్ మైనార్టీ చైర్మన్ గా ఎం సూఫీ జానీ గారు మర్యాదపూర్వకంగా కలిసి పూల గుచ్చం అందించడం జరిగింది ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెదక్ జిల్లాలో మైనార్టీ సభ్యులకు ఇలాంటి పక్షపాతం లేకుండా సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తానని తెలిపారు ఈ కార్యక్రమంలో మైనార్టీ సభ్యులు మహమ్మద్ అమీరుద్దీన్, జిల్లా జనరల్ సెక్రెటరీ కాంగ్రెస్ పార్టీ, శ్యాంసుందర్, మాజీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు,మరియు అదిల్ పాషా యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ వైస్ ప్రెసిడెంట్, షేక్ అక్బరుద్దీన్, షేక్ ఫస్యుద్దీన్, యూత్ కాంగ్రెస్ మండల వైస్ ప్రెసిడెంట్, షేక్ కాజా, ఎజాజ్, శానవాజ్, నదీమ్, అఫ్జల్ తదితరులు పాల్గొనడం జరిగింది

## ఎన్యూమరేషన్ పత్రాలు భర్తీ చేసి ఇవ్వకపోతే ఓటరు జాబితాలో పేర్లు ఉండవు

జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక.



నారాయణపేట జూన్ 29:లోకల్ గైడ్ఓటరు జాబితాల కచ్చితత్వం కోసం చేపట్టనున్న ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియలో భాగంగా కొనసాగుతున్న ఎన్యూమరేషన్ పత్రాల పంపిణీ కార్యక్రమానికి రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక కోరారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ లోని వీసీ హాల్ లో ఎస్. ఐ.ఆర్ ఎన్యూమరేషన్ పత్రాల పంపిణీ పై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 25 నుంచి జులై 24 వరకు బూత్ స్థాయి అధికారులు ఇంటింటి సర్వే నిర్వహించి ఓటర్ల వివరాలను ధృవీకరించనున్నట్లు ఆమె తెలిపారు. జూలై 31 న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురించడం జరుగుతుందని, ఆగస్టు 30 వరకు క్లెయిమ్స్, అభ్యంతరాలను స్వీకరిస్తారని, ఆ తర్వాత సెప్టెంబర్ 28 వరకు అభ్యంతరాలను పరిష్కరించి అక్టోబర్ 1 న తుది ఓటరు జాబితా విడుదల చేయనున్నట్లు కలెక్టర్ వివరించారు. ఈ నెల 25 నుంచి బీ ఎల్ వో లు ఇంటింటికి వెళ్లి ఎన్యూమరేషన్ పత్రాలను పంపిణీ చేస్తున్నారని, కొత్త ఓటర్ల నమోదు కోసం ఫామ్ -6 అందజేస్తున్నారని, ఆయా పత్రాలను ఓటర్లు పూరించి మళ్ళీ బీఎల్ వో లకు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఎన్యూమరేషన్ ఫారాలు నింపి బీఎల్ వో లకు ఇస్తేనే ఓటరు జాబితాలో ఉంటారని, ఇవ్వకపోతే ఓటరు జాబితాలో ఉండరని ఆమె స్పష్టం చేశారు, ఇక నుంచి ప్రతీ మంగళ వారం మండల స్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం ఉంటుందని,తర్వాత ఏ ఈ ఆర్ వో స్థాయిలో నిర్వహించడం జరుగుతుందని ఆమె తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ తమ బూత్ స్థాయి ఏజెంట్లు బి ఎల్ వో లకు సహకరించే విధంగా చూడాలని ఆమె సూచించారు. వారానికి ఒకసారి నిర్వహించే సమావేశానికి రాజకీయ పార్టీల ప్రతినిధులు తప్పక హాజరు కావాలని ఆమె కోరారు. ఎస్ ఐ ఆర్ ప్రక్రియ కు సంబంధించి అనుమానాలను నివృత్తి చేసేందుకు హెల్ప్ డెస్క్ లను ఏర్పాటు చేస్తామన్నారు. ఎన్యూమరేషన్ ప్రక్రియ పూర్తయ్యాక అన్ మ్యాపింగ్ కేసుల విచారణ జరుగుతుందన్నారు. అర్హులైన ఏ ఒక్కరి ఓటు తొలగించబడదని కంగారు పడాల్సిన అవసరం లేదని, తీసుకున్న ఎన్యూమరేషన్ పత్రాలను కచ్చితంగా పూరించి ఇవ్వాలన్నారు. ఇవ్వకపోతే మాత్రం ఓటరు జాబితాలో వాళ్ళ పేర్లు ఉండవు అని ఆమె స్పష్టం చేశారు.ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, డీ ఆర్ వో రాజ్యలక్ష్మి, సీ సెక్షన్ అధికారిని జయసుధ , వివిధ పార్టీలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

## జిల్లా ఎస్పీ నీ కలిసిన ఆఫీస్ నూతన సూపరింటెండెంట్



నారాయణపేట జూన్ 29లోకల్ గైడ్:నారాయణపేట జిల్లా పోలీస్ కార్యాలయం (డీపీఓ)లో నూతన ఆఫీస్ సూపరింటెండెంట్‌గా శ్యామ్ సుందర్ రాజు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు.శ్యామ్ సుందర్ రాజు తెలంగాణ స్పెషల్ పోలీస్ (టి జి ఎస్ పి) 10వ బెటాలియన్ నుంచి బదిలీపై నారాయణపేట జిల్లా డీపీఓ కార్యాలయానికి వచ్చారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి జిల్లా పోలీసు శాఖ పరిపాలనా వ్యవస్థను మరింత బలోపేతం చేసేలా కృషి చేయాలని సూచించారు.కాగా, ఇంతకుముందు నారాయణపేట జిల్లా డీపీఓ కార్యాలయంలో ఆఫీస్ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహించిన శంకర్ లాల్ బదిలీపై తెలంగాణ స్పెషల్ పోలీస్ 10వ బెటాలియన్‌కు వెళ్లారు.

## మహబూబాబాద్ జిల్లాలో పల్స్ పోలియో ఇంటింటి సర్వే విజయవంతం



లోకల్ గైడ్ మహబూబాబాద్మహబూబాబాద్ జిల్లాలో నిర్వహిస్తున్న పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా రెండో రోజు ఇంటింటి సర్వే విజయవంతంగా కొనసాగింది. జిల్లా వ్యాప్తంగా మొత్తం 938 బృందాలు ఇంటింటికీ వెళ్లి 5 సంవత్సరాల లోపు చిన్నారులను గుర్తించి, పోలియో చుక్కలు వేయని పిల్లలకు టీకా అందించాయి. ఈ కార్యక్రమంలో మొత్తం 2,456 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయడం జరిగింది.ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. రవి రాథోడ్ గారు కంబాలపల్లి గ్రామంలో స్వయంగా ఇంటింటి సర్వేను పరిశీలించారు. ప్రతి ఇంటికి వెళ్లి 5 సంవత్సరాల లోపు పిల్లలకు పోలియో చుక్కలు అందాయా లేదా అని ధృవీకరించి, ఒక్క చిన్నారి కూడా మిగిలిపోకుండా పోలియో చుక్కలు వేయాలని ఫీల్డ్ సిబ్బందికి సూచించారు. దేశాన్ని పోలియో రహితంగా కొనసాగించాలంటే ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయాలని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా. శివకుమార్, హెల్త్ ఎడ్యుకేటర్ ఎ. పురుషోత్తం, ఎంపీహెచ్ఈఓ కె.ఎల్.ఎన్. స్వామి, సబ్ యూనిట్ ఆఫీసర్ వి. శ్రీనివాస్, హెల్త్ అసిస్టెంట్ పి. లింగారెడ్డి, అనిల్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.జిల్లాలోని తల్లిదండ్రులు తమ 5 సంవత్సరాల లోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించి, పోలియో రహిత భారతదేశ పరిరక్షణకు సహకరించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ విజ్ఞప్తి చేసింది.

## ప్రజావాణికి 122 ఫిర్యాదులు



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, జూన్ 29 లోకల్ గైడ్: ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 122 ఫిర్యాదులు అందాయి. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు, అదనపు కలెక్టర్లు కిరణ్ కుమార్, భుజంగరావు, ట్రైనీ కలెక్టర్ సురేష్, డీఆర్ఓ గీత, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, జిల్లా పరిషత్ సీఈఓ సాయాగౌడ్, డీపీఓ శ్రీనివాస్, డీఆర్డీఓ సాయన్నలకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, ఫిర్యాదులను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. అన్ని శాఖల అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని అన్నారు. వేసవి సెలవుల అనంతరం విద్యా సంస్థలు తిరిగి ప్రారంభం అయిన నేపథ్యంలో మండల ప్రత్యేక అధికారులు, మండల విద్యాధికారులు క్షేత్రస్థాయిలో విధిగా సందర్శిస్తూ సౌకర్యాలను పరిశీలించాలని కలెక్టర్ సూచించారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రజావాణికి జిల్లా అధికారులు విధిగా హాజరు కావాలి

స్పష్టం చేసిన జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

గైర్హాజరైన అధికారులకు షోకాజ్ మెమోలు జారీ చేయాలని ఆదేశం



లోకల్ గైడ్/ సంగారెడ్డి:ప్రజల సమస్యలను సత్వరంగా పరిష్కరించేందుకు ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ స్పష్టం చేశారు. ముందస్తు సమాచారం లేకుండా గైర్హాజరయ్యే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.సోమవారం కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పాండు, ఆర్డీఓ రాజేందర్‌తో కలిసి జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అందిన అర్జీలను పరిశీలించి, వాటి సత్వర పరిష్కారం కోసం సంబంధిత శాఖల అధికారులకు పంపించారు.ప్రజావాణి అనంతరం జిల్లా అధికారులు హాజరు వివరాలను శాఖల వారీగా పరిశీలించిన కలెక్టర్, ముందస్తు సమాచారం ఇవ్వకుండా పలువురు అధికారులు గైర్హాజరైనట్లు గుర్తించి అసంతృప్తి వ్యక్తం చేశారు. గైర్హాజరైన అధికారులకు షోకాజ్ మెమోలు జారీ చేసి సంజాయిషీ కోరాలని ఆదేశించారు. ఇకపై ప్రజావాణికి గైర్హాజరయ్యే అధికారులపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ప్రజావాణి కార్యక్రమం ప్రజలకు అత్యంత ముఖ్యమైన వేదిక అని, అధికారులు దాని ప్రాధాన్యతను గుర్తించి విధిగా హాజరుకావాలని సూచించారు. ప్రజల నుంచి అందిన ప్రతి వినతిని అంకితభావంతో పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.జిల్లా వ్యాప్తంగా ప్రజావాణికి మొత్తం 75 వినతులు అందాయి. వాటిలో కలెక్టరేట్ ప్రజావాణికి 37, సంగారెడ్డి డివిజన్‌కు 19, నారాయణఖేడ్ డివిజన్‌కు 9, జహీరాబాద్ డివిజన్‌కు 8, ఆందోల్ డివిజన్‌కు 2 వినతులు అందినట్లు అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, రెవెన్యూ అధికారులు, గురుకుల కోఆర్డినేటర్ తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన నిరుద్యోగయువత ఉచిత నైపుణ్య శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలి... జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు విజయలక్ష్మి

ఖమ్మం, జూన్ -29:లోకల్ గైడ్ :సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ), భద్రాచలం ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా పరిధిలోని గిరిజన నిరుద్యోగ యువతీ, యువకులకు 3 నుంచి 4 నెలల పాటు వివిధ రంగాల్లో ఉచిత నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఆసక్తి గల అర్హులైన గిరిజన యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఎన్. విజయలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఐటీడీఏ స్కిల్ ట్రైనింగ్ సెంటర్, ఖమ్మంలో వేర్‌హౌస్ ఎగ్జిక్యూటివ్, జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్, బ్యూటీషియన్, గెస్ట్ సర్వీస్ అసోసియేట్ (ఫుడ్ అండ్ బేవరేజ్) లెవల్-4, ఫుడ్ అండ్ బేవరేజ్ సర్వీస్ అసోసియేట్ కోర్సుల్లో శిక్షణ అందజేయనున్నట్లు తెలిపారు. వేర్‌హౌస్ ఎగ్జిక్యూటివ్, గెస్ట్ సర్వీస్ అసోసియేట్, ఫుడ్ అండ్ బేవరేజ్ సర్వీస్ అసోసియేట్ కోర్సులకు ఎస్ఎస్‌సీ లేదా అంతకంటే పై విద్యార్హత, జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్ కోర్సుకు ఇంటర్మీడియట్, బ్యూటీషియన్ కోర్సుకు 8వ తరగతి లేదా అంతకంటే పై విద్యార్హత కలిగిన వారు అర్హులని తెలిపారు.వేర్‌హౌస్ ఎగ్జిక్యూటివ్, జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్, గెస్ట్ సర్వీస్ అసోసియేట్, ఫుడ్ అండ్ బేవరేజ్ సర్వీస్ అసోసియేట్ కోర్సులకు 18 నుంచి 30 సంవత్సరాల వయస్సు, బ్యూటీషియన్ కోర్సుకు 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు కలిగిన వారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. కోర్సు వ్యవధి 94 నుంచి 117 రోజుల వరకు ఉంటుందని పేర్కొన్నారు. శిక్షణ సమయం లో ఉచిత భోజనం, వసతి, యూనిఫాం, స్టడీ మెటీరియల్‌తో పాటు శిక్షణ పూర్తయిన అనంతరం సర్టిఫికెట్ అందజేయబడు తుందని తెలిపారు.అర్హులైన అభ్యర్థులు ఆధార్ కార్డు, కుల ధృవీకరణ పత్రం, పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు, విద్యార్హతల ధృవ పత్రాలతో జూలై 1, 2026 ఉదయం 9 గంటలకు రోటరీ నగర్ (పోలీస్ స్టేషన్ ఎదురుగా, ఎస్‌బీఐ బ్యాంక్ పైన) ఉన్న ఐటీడీఏ స్కిల్ ట్రైనింగ్ సెంటర్, ఖమ్మంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 6305802724 నంబర్ నందు సంప్రదించాలని ఉప సంచాలకులు ఆ ప్రకటనలో తెలిపా

## ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణను కార్యాచరణ ప్రకారం పూర్తి చేయాలి: రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి



సిద్దిపేట లోకల్ గైడ్ జూన్ 29:భారత ఎన్నికల సంఘం నిర్దేశించిన కార్యాచరణ ప్రకారం ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ ప్రక్రియను సమర్థవంతంగా చేపట్టాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా ఎన్నికల అధికారులు, ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పలు కీలక సూచనలు చేశారు.జూలై 24 వరకు ఇంటింటి సర్వే నిర్వహించి ప్రతి అర్హుడైన ఓటరుకు ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేసి, పూరించిన అనంతరం వాటిని సేకరించాలని సూచించారు. జూలై 1 నాటికి ఫారాల పంపిణీ పూర్తి చేసి, ప్రతిరోజూ పురోగతి నివేదికలు సమర్పించాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో ధృవీకరించి, ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లు ఒకే పోలింగ్ కేంద్రంలో నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓటరుగా నమోదు కావడం చట్టరీత్యా నేరమని ప్రజలకు అవగాహన కల్పించాలని, పేర్లు, ఇంటిపేర్లు, వివాహానంతరం మహిళల ఇంటిపేరు మార్పులు వంటి వివరాలను జాగ్రత్తగా పరిశీలించాలని సూచించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమన్వయం కొనసాగిస్తూ, బూత్ లెవల్ ఏజెంట్లతో తరచూ సమావేశాలు నిర్వహించాలని తెలిపారు.జిల్లా కలెక్టర్ కె. హైమావతి మాట్లాడుతూ, ఓటరు జాబితాలో పేరు కొనసాగాలంటే ప్రతి ఓటరు తప్పనిసరిగా ఎన్యూమరేషన్ ఫారాన్ని పూర్తి చేసి సంబంధిత అధికారులకు అందించాలని ప్రజలకు తెలియజేయాలని అన్నారు. ప్రతి ఫారంపై సంబంధిత ఓటరు సంతకం ఉండేలా బూత్ స్థాయి అధికారులు చర్యలు తీసుకోవాలని, విధుల సమయంలో బీఎల్‌ఓలు తప్పనిసరిగా గుర్తింపు కార్డులు ధరించాలని సూచించారు. కొత్తగా నియమితులైన బీఎల్‌ఓలకు వెంటనే గుర్తింపు కార్డులు జారీ చేసే చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) లక్ష్మీ కిరణ్, జిల్లా రెవెన్యూ అధికారి డి. నాగరాజమ్మ, డిప్యూటీ కలెక్టర్లు, ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలు, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

## జిల్లాలో ఎస్. ఐ.ఆర్ హెల్ప్ డెస్క్ ల ఏర్పాటు

నారాయణపేట జూన్ 29లోకల్ గైడ్ :నారాయణపేట జిల్లాలో ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ ఐ ఆర్) సంబంధించి అనుమానాలను నివృత్తి చేసేందుకు జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండలాలలో హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక తెలిపారు.జిల్లాలోని మండల తహసిల్దార్ కార్యాలయాల అధికారుల నంబర్లతో పాటు, జిల్లా స్థాయిలో హెల్ప్ డెస్క్ 1950 ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.సర్ కార్యక్రమంపై కల్లూరు రైతు వేదిక లో కల్లూరు మండలం మరియు కల్లూరు మున్సిపాలిటీ ల బ్లాక్ లకు అవగాహన సమావేశంలో పాల్గొన్న సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ .- కార్యక్రమంలో ఓటరు అవగాహనపై బ్లాక్ లకు దిశానిర్దేశం చేశారు. కల్లూరు పట్టణం - రైతు వేదిక లో :కల్లూరు:లోకల్ గైడ్ :పట్టణ కల్లూరు మండల స్థాయిలో నిర్వహిస్తున్న సర్ కార్యక్రమం పై బ్లాక్ లకు అవగాహన కార్యక్రమం రైతు వేదిక లో నిర్వహించటం జరిగింది . ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఓటరు నమోదు మరియు ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై ప్రతి ఒక్కరికీ పూర్తి అవగాహన ఉండాలని తెలిపారు. ముఖ్యంగా మ్యాపింగ్ ఫార్మ్ విషయంలో బ్లాక్ లు అప్రమత్తంగా వ్యవహరించి, ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగాఏ మ్మెల్యే మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ తరఫున బ్లాక్ లు పాటించాల్సిన విధానాలు, బాధ్యతలపై వివరంగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కల్లూరు ఏఎంసి చైర్మన్ నీరజ ప్రభాకర్ , మున్సిపాలిటీ చైర్మన్ మోహన్ నాయక్ , వైస్ చైర్మన్ కోటేశ్వరి , సత్తుపల్లి మున్సిపల్ చైర్మన్ రోహన బేగం, వైస్ చైర్మన్ బొంతు సుమలత, కల్లూరు పట్టణ అధ్యక్షులు ఉస్మాన్, కల్లూరు మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పొట్రూ అర్జున్ రావు, కల్లూరు మండల మరియు పట్టణం మండల నాయకులు, కార్యకర్తలు, మహిళా, యూత్, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# సర్ కార్యక్రమంపై కల్లూరు రైతు వేదిక లో కల్లూరు మండలం మరియు కల్లూరు మున్సిపాలిటీ ల బ్లాక్ లకు అవగాహన సమావేశంలో పాల్గొన్న సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ .

– కార్యక్రమంలో ఓటరు అవగాహనపై బ్లాక్ లకు దిశానిర్దేశం చేశారు.



కల్లూరు పట్టణం - రైతు వేదిక లో :కల్లూరు:లోకల్ గైడ్ :పట్టణ కల్లూరు మండల స్థాయిలో నిర్వహిస్తున్న సర్ కార్యక్రమం పై బ్లాక్ లకు అవగాహన కార్యక్రమం రైతు వేదిక లో నిర్వహించటం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఓటరు నమోదు మరియు ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై ప్రతి ఒక్కరికీ పూర్తి అవగాహన ఉండాలని తెలిపారు. ముఖ్యంగా మ్యాపింగ్ ఫార్మ్స్ విషయంలో బ్లాక్ లు అప్రమత్తంగా వ్యవహరించి, ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగాఏ మ్మెల్యే మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ తరఫున బ్లాక్ లు పాటించాల్సిన విధానాలు, బాధ్యతలపై వివరంగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కల్లూరు ఏఎంసి చైర్మన్ నీరజ ప్రభాకర్ , మున్సిపాలిటీ చైర్మన్ మోహన్ నాయక్ , వైస్ చైర్మన్ కోటేశ్వరి , సత్తుపల్లి మున్సిపల్ చైర్మన్ రోహన బేగం, వైస్ చైర్మన్ బొంతు సుమలత, కల్లూరు పట్టణ అధ్యక్షులు ఉస్మాన్, కల్లూరు మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పొట్రూ అర్జున్ రావు, కల్లూరు మండల మరియు పట్టణం మండల నాయకులు, కార్యకర్తలు, మహిళా, యూత్, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చమని సీఎంకు చెప్పండి

## ప్రభుత్వాన్ని ప్రశ్నించిన ఎమ్మెల్యే చింతా ప్రభాకర్




లోకల్ గైడ్/ సంగారెడ్డి :సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని పి ఎస్ ఆర్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి కలిసి లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కళ్యాణలక్ష్మి పథకంతో పాటు తులం బంగారం ఇస్తామని చెప్పిన హామీ ఏమైందని గుర్తు చేస్తూ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.అదేవిధంగా ప్రతి మహిళకు నెలకు రూ.2,500 ఆర్థిక సహాయం అందిస్తామని ప్రకటించిన హామీ ఇప్పటికీ అమలు కాలేదని విమర్శించారు. వృద్ధులకు ప్రస్తుతం ఉన్న పెన్షన్‌ను రూ.2 వేల నుంచి రూ.4 వేల వరకు పెంచుతామని చెప్పి ఇప్పటి వరకు అమలు చేయలేదని అన్నారు.మహిళలకు అందిస్తామని చెప్పిన స్కూటీల కోసం మహిళలు ఆశగా ఎదురుచూస్తున్నారని, ప్రభుత్వం మాట తప్పిందని విమర్శించారు. ఎన్నికల హామీలన్నింటినీ వెంటనే అమలు చేసి ప్రజలకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటారా లేక హామీలే మిగిలిపోతాయా అన్నారుఅన్ని వర్గాల ప్రజలను కాంగ్రెస్ మోసం చేసింది ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారు.ఇంకా ఒక్క సంవత్సరం మాత్రమే కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుంది ... గత ప్రభుత్వం మీద ఇంకా ఎన్ని ఈరోజులు ఆరోపణలు చేస్తూ కాలం గడుపుతారు.ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని వారికి ఇచ్చిన హామీలు గుర్తు చేస్తున్నాం .కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీలో కొంత ఆలస్యం జరిగిందని, ఇకపై అలాంటి పరిస్థితి రాకుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు.

# పేద ప్రజల ఆరోగ్య రక్షణకు అండగా ముఖ్యమంత్రి సహాయ నిధి

## మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి



హనుమకొండ జిల్లా ప్రతినిధి,జూన్29(లోకల్ గైడ్ న్యూస్): మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు హనుమకొండ రాంనగర్ లోని తమ నివాసంలో 73 లక్షల 20వేల ఒక వంద రూపాయల విలువ గల మొత్తం119 సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి మాట్లాడుతూ పేద వర్గాల ప్రజలు అనారోగ్యం కారణంగా చికిత్స చేయించుకుకోవడానికి అయ్యే వైద్య ఖర్చులతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయం అందిస్తూ అండగా నిలుస్తుందని మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు సోమవారం రోజున తెలిపారు. రాష్ట్రంలోని నిరుపేద ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ముఖ్యమంత్రి సహాయ నిధి అండగా నిలుస్తూ ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ఆర్థిక సహాయం అందజేస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి సహాయ నిధికి ఎక్కువ నిధులు కేటాయిస్తున్నారని తెలిపారు. ఆర్థికపరమైన ఇబ్బందులు ఎదుర్కొంటూ కూడా పేద ప్రజల సంక్షేమాన్ని ఆపకుండా కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్నట్లు తెలిపారు. అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స కోసం వైద్య ఖర్చులకు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న పేద వర్గాలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గతంలో కంటే ఎక్కువగా ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. ఆ తర్వాత ప్రజలనుంచి వినదులను విజ్ఞప్తులను మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి స్వీకరించారు ప్రజల సమస్యలను సావధానంగా వింటూ కొండ మురళి అప్పటికప్పుడే సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతుందని కొండా మురళి తెలిపారు.


# జీడబ్ల్యూఎంసీ నూతన కమిషనర్‌కు జిల్లా కలెక్టర్ శుభాకాంక్షలు



హనుమకొండ టౌన్ శ్రీనివాస్,జూన్29(లోకల్ గైడ్ న్యూస్):జిడబ్లుఎంసి: గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ) నూతన కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన టి. వెంకన్న సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టర్, జీడబ్ల్యూఎంసీ ప్రత్యేకాధికారి చాహత్ బాజ్‌పాయ్ ను హన్మకొండ కలెక్టరేట్ లో మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ నూతన కమిషనర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నగర అభివృద్ధి, ప్రజలకు మెరుగైన మున్సిపల్ సేవల అందజేత, పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా తదితర అంశాలపై వారు చర్చించారు.

# నిర్దేశిత కార్యచరణ ప్రకారం ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ చేపట్టాలి

## రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి




నిజామాబాద్ జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్ ), జూన్ 29 :భారత ఎన్నికల సంఘం నిర్దేశిత కార్యాచరణ ప్రకారం ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ చేపట్టాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, ఈ.ఆర్.ఓ.లు, ఎ.ఈ.ఆర్.ఓ.లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ, నిర్దేశిత కార్యాచరణ ప్రకారం ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, సేకరణ, వివరాల నమోదు ప్రక్రియను సమర్థవంతంగా చేపట్టాలని తెలిపారు. జూలై 24వ తేదీ వరకు ఇంటింటి సర్వే నిర్వహించి ప్రతి అర్హులైన ఓటరుకు ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేసి, పూరించిన తర్వాత సేకరించాలని, ఫారాల పంపిణీ ప్రక్రియను జూలై 1వ తేదీ నాటికి పూర్తి చేసి ప్రతి రోజూ పురోగతి నివేదికలను సమర్పించాలని తెలిపారు. ప్రతి బూత్ స్థాయి అధికారి తమ పరిధిలోని ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో ధృవీకరించి, ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లు ఒకే పోలింగ్ కేంద్రంలో నమోదై ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓటరుగా నమోదు కావడం చట్టరీత్యా శిక్షార్హమని ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. పేర్లు, ఇంటిపేర్లు, మహిళల వివాహానంతర ఇంటిపేరు మార్పులు వంటి వ్యత్యాసాలను పరిశీలించి వివరాలు స్పష్టంగా నమోదు చేయాలని తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిరంతర సమన్వయం కొనసాగిస్తూ బూత్ స్థాయి అధికారుల జాబితాలు, పోలింగ్ కేంద్రాల వివరాలు అందుబాటులో ఉంచాలని, రాజకీయ పార్టీలు నియమించిన బూత్ లెవల్ ఏజెంట్లతో తరచూ సమావేశాలు నిర్వహించి ఓటరు జాబితాకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. ప్రతి శనివారం జిల్లా స్థాయిలో, ప్రతి వారం నియోజకవర్గ స్థాయిలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహించాలని సూచించారు. బూత్ స్థాయి అధికారులు బి.ఎల్.ఓ. యాప్‌ను తప్పనిసరిగా వినియోగించాలని, ఎం.ఎస్.ఎస్. వాలంటీర్లు, ఎన్.సి.సి. క్యాడెట్లు, పదవీ విరమణ పొందిన ఉద్యోగులు, స్థానిక స్వచ్ఛంద సంస్థల సహకారాన్ని వినియోగించుకోవాలని, గిరిజన, సరిహద్దు ప్రాంతాలలో స్థానిక భాష తెలిసిన హెల్పింగ్ హ్యాండ్స్‌ను నియమించాలని తెలిపారు. ఎన్యూమరేషన్ ఫారాలు సేకరించిన అనంతరం ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ప్రక్రియ పూర్తి అయిన స్టిక్కర్‌ను ప్రతి ఇంటికి అతికించాలని, ఫారాల పూరణ, సమర్పణపై ప్రజల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియ వేగవంతంగా కొనసాగుతోందని తెలిపారు. ఇప్పటికే 72శాతం ఎన్యూమరేషన్ ఫారంల పంపిణీ పూర్తయ్యిందని అన్నారు. జిల్లాలో మొత్తం 14,39,734 మంది ఓటర్లకు గాను 10,33,033 మంది ఓటర్లకు ఫారంల పంపిణీ జరిగిందని, మరో రెండు మూడు రోజులలో మిగతా 4,06,701 మంది ఓటర్లకు కూడా ఫారాలు పంపిణీ చేసేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. అర్బన్ ఏరియాలోనూ ఎస్ఐఆర్ అమలును వేగవంతం చేస్తామన్నారు. బీఎల్ఓ లు ఇంటింటికి తిరిగి ఫారంలు అందజేస్తున్నారని, ఈ.ఆర్.ఓ లు, ఏఈఆర్ఓ లు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ జరుపుతున్నారని అన్నారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో, బీఎల్ఏలతో క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ వి.భుజంగరావు, ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, బోధన్ ఆర్డీఓ విజయలక్ష్మి, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు బాలరాజు తదితరులు పాల్గొన్నారు.




# పంచాయతీ నిధులు పక్కదారి..? నిధుల దుర్వినియోగంలో సర్పంచ్ భర్త ప్రమేయం ఉందని గ్రామస్తుల ఆరోపణలు

మేడిపల్లిలో రూ5.లక్షల ఖర్చులకు తేలని లెక్కలు..?

జిల్లా కలెక్టర్‌కు గ్రామస్తుల వినతి.. ప్రత్యేక కమిటీతో విచారణకు డిమాండ్




కాటారం: లోకల్ గైడ్: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం మేడిపల్లి గ్రామపంచాయతీలో గ్రామపంచాయతీ నిధుల వినియోగంపై వివాదం నెలకొంది. 2025-26, 2026-27 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించిన అభివృద్ధి పనుల పేరుతో సుమారు రూ.6 లక్షల మేర ఖర్చు చేసినట్లు రికార్డుల్లో నమోదు చేసినప్పటికీ, ఆ పనులు క్షేత్రస్థాయిలో కనిపించడం లేదని గ్రామస్తులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.గ్రామపంచాయతీ రికార్డుల ప్రకారం వీధి దీపాల కొనుగోలు, అమరిక, సబ్‌మర్సిబుల్ మోటార్ల మరమ్మతులు, కొత్త మోటార్ల కొనుగోలు, ఫాగింగ్ మిషన్, జంగిల్ క్లియరెన్స్, ట్రాక్టర్ మరమ్మతులు, ఫర్నిచర్, కార్యాలయ నిర్వహణ తదితర పనులకు భారీ మొత్తంలో నిధులు ఖర్చు చేసినట్లు నమోదైందని గ్రామస్తులు తెలిపారు. అయితే, వాటిలో అనేక పనులు గ్రామంలో పూర్తిగా జరగలేదని లేదా అసలు కనిపించడం లేదని ఆరోపించారు.వీధి దీపాల కొనుగోలు, ఫిట్టింగ్ పేరుతో దాదాపు రూ.45 వేల వరకు ఖర్చు చూపించినప్పటికీ, గ్రామంలోని అనేక ప్రాంతాల్లో ఇప్పటికీ వీధి దీపాలు ఏర్పాటు కాలేదని గ్రామస్తులు పేర్కొన్నారు. అలాగే మోటార్ల మరమ్మతులకు నిధులు ఖర్చు చేసిన కొద్ది రోజులకే కొత్త మోటార్లు కొనుగోలు చేసినట్లు రికార్డుల్లో నమోదు కావడం అనుమానాలకు తావిస్తోందని తెలిపారు.జంగిల్ క్లియరెన్స్ పనులకు ప్రభుత్వ నిధులు ఖర్చు చేసినట్లు అధికారిక రికార్డులు చూపుతుండగా, అదే పనులను సర్పంచ్ స్వంత నిధులతో నిర్వహించినట్లు స్థానికంగా ప్రచారం జరగడం వల్ల అసలు ఏ నిధులతో పనులు జరిగాయనే సందేహాలు వ్యక్తమవుతున్నాయని గ్రామస్తులు ఆరోపించారు.అదేవిధంగా, గ్రామపంచాయతీ వ్యవహారాల్లో సర్పంచ్ భర్త ప్రత్యక్షంగా జోక్యం చేసుకుంటూ నిధుల వినియోగం, పనుల అమలులో కీలక పాత్ర పోషిస్తున్నారని గ్రామస్తులు ఆరోపించారు. ఈ అంశాలను గ్రామసభలో అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు.ఈ నేపథ్యంలో అడ్మినిస్ట్రేటివ్ సాంక్షన్లు, టెక్నికల్ సాంక్షన్లు, వర్క్ ఆర్డర్లు, మెజర్‌మెంట్ బుక్స్ (ఎంబీలు), జీఎస్టీ బిల్లులు, స్టాక్ రిజిస్టర్లు, బ్యాంకు లావాదేవీలు, ఫొటోలు తదితర రికార్డులను పరిశీలించి జిల్లా స్థాయి ప్రత్యేక సాంకేతిక కమిటీతో క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ చేపట్టాలని గ్రామస్తులు జిల్లా కలెక్టర్‌ను కోరారు.విచారణలో అక్రమాలు జరిగినట్లు తేలితే సంబంధిత ప్రజాప్రతినిధులు, అధికారులు, బాధ్యులపై చట్టపరమైన, శాఖాపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు ప్రభుత్వానికి జరిగిన నష్టాన్ని రికవరీ చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు

# ప్రజా వాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి - రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ కే. చంద్రా రెడ్డి.



రంగారెడ్డి జిల్లా బ్యూరో, ( లోకల్ గైడ్ ): ప్రజావాణి లో వచ్చిన ఫిర్యాదులను సాధ్యమైనంత వరకు త్వరగా పరిష్కరించాలని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ కే. చంద్రా రెడ్డి అన్నారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 108 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదు దారుల నుండి సమస్యలను జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) కిరణ్మయి, అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి తో కలిసి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ కిరణ్మయి మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూ శాఖ--20, ఇతర శాఖలు --88, మొత్తం దరఖస్తులు అందాయి.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి అనంత రెడ్డి వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బీఎల్‌వోలే స్వయంగా ప్రతి ఇంటికి వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేయాలి

బీఎల్‌వోలు అందజేసిన ఫారాలను పూర్తి చేసి తిరిగి ఇవ్వాలి.

ఎన్యూమరేషన్ ఫారాలు పూరించి సమర్పిస్తేనే డ్రాఫ్ట్ ఓటరు జాబితాలో పేరు నమోదు అవుతుంది

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి

లోకల్ గైడ్ /సంగారెడ్డి :ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా బీఎల్‌వోలు పంపిణీ చేస్తున్న ఎన్యూమరేషన్ ఫారాలను ప్రతి ఓటరు పూర్తిగా నింపి తిరిగి సమర్పిస్తేనే వారి పేరు ముసాయిదా ఓటరు జాబితాలో నమోదు అవుతుందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు.సోమవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల అధికారులు, సంబంధిత ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఎస్ఐఆర్ పురోగతి, ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, సేకరణ తదితర అంశాలపై సమీక్షించారు. రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని పూర్తి పారదర్శకంగా, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.బీఎల్‌వోలే స్వయంగా ప్రతి ఇంటికి వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేయాలని, ఈ బాధ్యతలను ఇతరులకు అప్పగించడం లేదా వారి ద్వారా సర్వే నిర్వహించడం అనుమతించబోదని స్పష్టం చేశారు. సూపర్‌వైజర్లు తమ పరిధిలోని గ్రామాలు, పట్టణాల్లో నిరంతరం పర్యటిస్తూ బీఎల్‌వోల పనితీరును



పర్యవేక్షించాలని సూచించారు ఓటర్లకు సహాయం అందించేందుకు ఏర్పాటు చేసిన 1950 ఓటర్ హెల్ప్‌లైన్, కలెక్టరేట్, ఈఆర్వో కార్యాలయాల్లోని హెల్ప్‌డెస్క్‌ల వివరాలను విస్తృతంగా ప్రచారం చేయాలని ఆదేశించారు. ఫారాలు నింపడంలో ఇబ్బందులు ఎదురైతే ప్రజలు హెల్ప్‌లైన్, హెల్ప్‌డెస్క్‌ల సేవలను వినియోగించుకోవాలని సూచించారు.విధుల నిర్వహణ సమయంలో బీఎల్‌వోలు ఎన్నికల సంఘం అందజేసిన టీ-షర్ట్, క్యాప్, ఐడీ కార్డు, బ్యాగ్‌ను తప్పనిసరిగా ధరించాలని తెలిపారు. దీంతో ప్రజలు వారిని సులభంగా గుర్తించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ప్రజలతో మర్యాదగా, సహనంతో వ్యవహరించాలని బీఎల్‌వోలకు సూచించారు.ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, సేకరణ, ఓటరు అవగాహన కార్యక్రమాలు, క్షేత్రస్థాయి అధికారుల పర్యటనలు, ప్రత్యేక కార్యక్రమాలకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియా వేదికల ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలని అధికారులను ఆదేశించారు.కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ, జిల్లాలో ఇప్పటివరకు 55 శాతం ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ పూర్తయిందని తెలిపారు. ఎస్ఐఆర్ కార్యక్రమంపై ప్రజల్లో అవగాహన పెరుగుతోందన్నారు. జిల్లాలో వంద శాతం ఫారాలు పంపిణీ చేసి, పూర్తిగా నింపిన ఫారాలను సేకరించేందుకు అన్ని చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.ఓటరు అవగాహన కార్యక్రమాలను




విస్తృతంగా నిర్వహించడంతో పాటు ప్రసార మాధ్యమాల ద్వారా ప్రచారం చేస్తున్నామని చెప్పారు.ఎన్యూమరేషన్ ఫారాలు నింపడంలో ప్రజలకు అవసరమైన సహాయం అందించేలా బీఎల్‌వోలు, బీఎల్‌వో సూపర్‌వైజర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. నిర్ణీత గడువులోగా ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేస్తామని పేర్కొన్నారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ పాండు, ఆర్డీఓలు రాజేందర్, రమేష్, వెంకటేశం, ఎన్నికల విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే లక్ష్యం : కోగురి పురుషోత్తం రెడ్డి

భైరంపల్లిలో రూ.12 లక్షలతో సీసీ రోడ్డు పనులకు శ్రీకారం చుట్టిన మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోగురి పురుషోత్తం రెడ్డి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహకారంతో శరవేగంగా అభివృద్ధి పనులు



(లోకల్ గైడ్ న్యూస్ కొందుర్గు)కొందుర్గు మండలం భైరంపల్లి గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు రూ.12 లక్షలతో చేపట్టనున్న నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోగురి పురుషోత్తం రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రత్యేక చొరవ, నిరంతర సహకారంతోనే గ్రామాభివృద్ధికి అవసరమైన నిధులు వేగంగా మంజూరవుతున్నాయని తెలిపారు. నియోజక వర్గంలోని ప్రతి గ్రామంపై ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టి సారిస్తూ, అంతర్గత రహదారుల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తున్నారని పేర్కొన్నారు. భైరంపల్లిలో నిర్మించనున్న ఈ సీసీ రోడ్డు వల్ల గ్రామ ప్రజలకు, ముఖ్యంగా వర్షాకాలంలో ఎదురయ్యే బురద రోడ్ల సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని అన్నారు. గ్రామాల సమగ్ర అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని వెల్లడించారు. రోడ్డు నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. గ్రామాభివృద్ధికి నిధులు మంజూరు చేయడంలో సహకరించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు గ్రామస్తులు, స్థానిక కాంగ్రెస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పేదింటి శ్రీకాంత్-యాదమ్మ, మాజీ ఎంపీటీసీ అంజిరెడ్డి, నాగులపల్లి కుమార్, శంకరయ్య, యాదగిరి, యాదయ్య, వార్డు సభ్యులు జంగీర్, కృష్ణారెడ్డి, పాపయ్య, రామరాజు, పొట్ట శివకుమార్, కమ్మరి రాజు, రమేష్, చెన్నమయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు..

## ఇంజనీరింగ్ 'బి కేటగిరీ' సీట్లను కౌన్సిలింగ్ ద్వారానే భర్తీ చేయాలి.

ఏఐఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర సమితి సభ్యుడు ఆకాష్ నాయక్ డిమాండ్.




(లోకల్ గైడ్ షాద్ నగర్ )ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలల్లో జరుగుతున్న ఫీజుల దోపిడీని అరికట్టాలని మరియు ఇంజనీరింగ్ 'బి కేటగిరీ' (మేనేజ్‌మెంట్ కోటా) సీట్లను పారదర్శకంగా కౌన్సిలింగ్ ద్వారానే భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ ఆల్ ఇండియా స్టూడెంట్స్ ఫెడరేషన్ ( ఏఐఎస్ఎఫ్) తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ ఆధ్వర్యంలో ఉన్నత విద్యా మండలి కార్యాలయం ముందు భారీ ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగింది.తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి కార్యాలయం ముందు విద్యార్థి నాయకులు ప్లకార్డులు పట్టుకుని, నినాదాలు చేస్తూ రోడ్డుపై బైఠాయించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర సమితి సభ్యుడు ఆకాష్ నాయక్ మాట్లాడుతూ..విద్యా హక్కు అనేది వ్యాపారం కాదని, విద్యార్థుల హక్కుల కోసం ఏఐఎస్ఎఫ్ ఎల్లప్పుడూ పోరాడుతుందని స్పష్టం చేశారు. యాజమాన్య కోటా సీట్లను లక్షలాది రూపాయలకు అమ్ముకుంటూ, విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటున్న ప్రైవేట్ కళాశాలలపై ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.ధర్నా ఉధృతంగా కొనసాగుతున్న సమయంలో పోలీసులు అక్కడికి చేరుకుని ఆందోళనకారులను అడ్డుకున్నారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థి నాయకులను పోలీసులు బలవంతంగా అరెస్ట్ చేసి, పోలీస్ వాహనాల్లో ఆసిఫ్ నగర్ పోలీస్ స్టేషన్కు తరలించారు. పోలీసుల అరెస్టులను భయపడేది లేదని, విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం పోరాటం కొనసాగుతుందని ఈ సందర్భంగా నాయకులు స్పష్టం చేశారు.

## ప్రతి అర్హుడూ తన ఓటు హక్కును కాపాడుకోవాలి మాజీ జెడ్పిటిసి తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి



( లోకల్ గైడ్ షాద్ నగర్ )ప్రత్యేక సమగ్ర సవరణ పేరుతో ఎన్నికల సంఘం చేపడుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎక్స్ జెడ్పిటిసి తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి పిలుపునిచ్చారు.ఓటు హక్కు ప్రతి పౌరుని రాజ్యాంగబద్ధమైన హక్కు. ఆ హక్కును ఏ కారణం చేతనైనా దూరం చేసే చర్యలు ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా అధికారులు పారదర్శకంగా వ్యవహరించాలని, రాజకీయ పక్షపాతం లేకుండా సవరణ ప్రక్రియ నిర్వహించాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఎక్స్ జెడ్పిటిసి తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి నాయకులు, కార్యకర్తలు ప్రతి గ్రామం, వార్డు, బూత్ స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించి, వారి పేర్లు ఓటరు జాబితాలో ఉన్నాయో లేదో తప్పనిసరిగా పరిశీలించాలని కోరారు. పేరు లేకపోయినా లేదా వివరాల్లో తప్పులు ఉన్నా వెంటనే సంబంధిత ఎన్నికల అధికారులను సంప్రదించి సరిదిద్దుకోవాలని సూచించారు.

## సింగరేణి ఎస్ బి ఐ కస్టమర్స్ కు బ్యాంకులో తగిన వసతులు కల్పించాలి

సిపిఐ (ఎం ఎల్ )మాస్ లైన్ జిల్లా నాయకులు జి. తేజ నాయక్ డిమాండ్



ఖమ్మం జిల్లా, కారేపల్లి (సింగరేణి ) : లోకల్ గైడ్, జూన్ 29 : సింగరేణి మండలంలోనీ ఎస్ బి ఐ బ్యాంకు కు ఇతరత్ర లావాదేవీలకు వచ్చే రైతులు, వృద్ధాప్య పింఛన్లకు వచ్చే మహిళ కస్టమర్లకు సరియైన బాత్రూమ్స్ వసతులు లేక ఇబ్బందులకు గురవుతున్నారు. మహిళలా పట్ల నిర్లక్ష్య ధోరణి చూపకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ఖమ్మం జిల్లా కమిటీ సభ్యులు, అఖిలభారత ఐక్య రైతు సంఘం డివిజన్ నాయకుడు గుగులోతు తేజ నాయక్ బ్యాంక్ మేనేజర్ తో మాట్లాడి త్వరలో వసతులు ఏర్పాటు చేయాలని బ్యాంక్ యజమాని డిమాండ్ చేశారు.

## గ్రామాల సమగ్ర అభివృద్ధే కాంగ్రెస్ పార్టీ ధ్యేయం.

### కొందుర్గు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కోగురి పురుషోత్తం రెడ్డి.

భైరంపల్లిలో రూ.12 లక్షలతో సీసీ రోడ్డు పనులకు శ్రీకారం.



లోకల్ గైడ్,కొందుర్గు.గ్రామాల సమగ్ర అభివృద్ధే కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యం అని కొందుర్గు మండలకాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కోగురి పురుషోత్తం రెడ్డి అన్నారు.మండల పరిధిలో ని భైరంపల్లి గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు రూ.12 లక్షలతో చేపట్టనున్న నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోగురి పురుషోత్తం రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రత్యేక చొరవ, నిరంతర సహకారంతోనే గ్రామాభివృద్ధికి అవసరమైన నిధులు వేగంగా మంజూరవుతున్నాయని తెలిపారు. నియోజక వర్గంలోని ప్రతి గ్రామంపై ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టి సారిస్తూ, అంతర్గత రహదారుల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తున్నారని పేర్కొన్నారు. భైరంపల్లిలో నిర్మించనున్న ఈ సీసీ రోడ్డు వల్ల గ్రామ ప్రజలకు, ముఖ్యంగా వర్షాకాలంలో ఎదురయ్యే బురద రోడ్ల సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని అన్నారు. గ్రామాల సమగ్ర అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని వెల్లడించారు. రోడ్డు నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. గ్రామాభివృద్ధికి నిధులు మంజూరు చేయడంలో సహకరించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు గ్రామస్తులు, స్థానిక కాంగ్రెస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పేదింటి శ్రీకాంత్-యాదమ్మ, మాజీ ఎంపీటీసీ అంజిరెడ్డి, నాగులపల్లి కుమార్, శంకరయ్య, యాదగిరి, యాదయ్య, వార్డు సభ్యులు జంగీర్, కృష్ణారెడ్డి, పాపయ్య, రామరాజు, పొట్ట శివకుమార్, కమ్మరి రాజు, రమేష్, చెన్నమయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా స్వామ్య వ్యవస్థలో ఓటు అత్యంత విలువైంది.

జిల్లేడు చౌదరిగూడెం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎన్.చెంద్రశేఖర్

ఎస్ఐఆర్ పై చౌదరిగూడెం, ఇంద్రనగర్, తుంపల్లి గ్రామాల్లో అవగాహన కార్యక్రమం.



లోకల్ గైడ్,జిల్లేడు చౌదరిగూడెం. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైందని జిల్లేడు చౌదరి గూడెం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎన్.చంద్రశేఖర్ అన్నారు.షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆదేశాల మేరకు జిల్లేడు చౌదరిగూడెం మండల పరిధిలోని చౌదరిగూడెం, ఇంద్రనగర్, తూంపల్లి గ్రామాల్లో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్)పై అవగాహన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఎన్. చంద్రశేఖర్, కాంగ్రెస్ ఆదివాసీ ఎస్టీ సెల్ సెక్రటరీ రఘు నాయక్, కాంగ్రెస్ పార్టీ బ్లాక్ అధ్యక్షుడు బాల్‌రాజ్ గౌడ్, ఫరూక్‌నగర్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, సత్యం రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ అస్త్ర బేగం, యాజజ్ అలీ, తుపాకుల శేఖర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, అన్ని గ్రామాల్లో ఎస్ఐఆర్ కార్యక్రమంలో పాల్గొంటున్న బీఎల్‌వోలు, బీఎల్ఏలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ఓటరు వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ప్రతి ఓటు ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యంత విలువైనదని, ఓటరు జాబితాలో అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఓటు హక్కు ప్రతి పౌరుడికి అత్యంత ముఖ్యమైనదని, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శ్వేత చంద్రబాబు, తూంపల్లి సర్పంచ్ రాంచంద్రయ్య, డిప్యూటీ సర్పంచ్ హాజర్ అలీ, ఆయా గ్రామాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జక్కన్నపేట గ్రామంలో సమర్థవంతమైన ఘన వ్యర్థాల నిర్వహణకు డస్ట్ బిన్స్ డ్రమ్ముల ఏర్పాటు

గ్రామ సర్పంచ్ చామంతుల సత్యనారాయణ




మెదక్ లోపలికి ప్రతినిధి( జూన్ 29)హవేలీ ఘనపూర్ మండలం జక్కన్నపేట గ్రామంలో గ్రామ సర్పంచ్ చామంతుల సత్యనారాయణ 4 రకాల చెత్త వర్గీకరణ గురించి ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రణాళిక సందర్భంగా పర్యావరణ పరిరక్షణకు, పరిశుభ్రతకు ఇది అత్యంత ముఖ్యమని గ్రామ పంచాయతీలో అన్ని రకాల పనిచేస్తున్న సిబ్బంది,వార్డు సభ్యులు,గ్రామ పెద్దలు యువకులతో వివరించి అవగాహన కల్పించడం జరిగింది.(సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్)ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ శీల కనకమ్మ,పంచాయతీ కార్యదర్శి,వార్డు సభ్యులు బుర్కయాదగిరి,కొరబోయిన నాగమణి యాదయ్య,గంట నాగమణి నర్సింలు అంగన్వాడీ టీచర్,ఆశ వర్కర్,పారిశుధ్య కార్మికులు,గ్రామ యువకులు, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.పోస్టర్ ప్రకారం చెత్తను నాలుగు రంగుల బుట్టల్లో వేరు చేయాలని తెలిపారు.పచ్చ రంగు బుట్ట తడి చెత్త,మిగిలిన ఆహారం, వంటగది చెత్త,కూర గాయలు,పండ్ల తొక్కలు, వాడిపోయిన పూలు, మాంసం వ్యర్థాలు మొదలైనవి.(ఇవి కంపోస్టింగ్‌కు ఉపయోగ పడతాయన్నారు) నీలి రంగు బుట్ట పొడి చెత్త కాగితం,అట్ట పెట్టెలు,ప్లాస్టిక్ వస్తువులు,లోహపు వస్తువులు మొదలైనవి. (రీసైకిల్ చేయదగినవి, చేయలేనివి రెండు వేరుగా ఉంచాలన్నారు).ఎరుపు రంగు బుట్ట శానిటరీ చెత్త డయాపర్లు,శానిటరీ ప్యాడ్స్, నాప్‌కిన్స్,కాండమ్స్ మొదలైనవి.(ఆరోగ్యానికి సంబంధించిన వ్యర్థాలు).నలుపు రంగు బుట్ట ప్రత్యేక జాగ్రత్త చెత్త పెయింటింగ్ డబ్బాలు,బల్బులు,పురుగు మందుల డబ్బాలు, టాయిలెట్స్ క్లీనర్స్,గడువు ముగిసిన మందులు,వాడిన సిరంజీలు,బ్యాటరీలు మొదలైనవి వేర్వేరు బుట్టలలో వేయాలని గ్రామ ప్రజలకు తెలియజేశారు.

## కేటీఆర్ గైర్హాజరు.. మిడ్జిల్‌కు హరీష్‌రావు

మన్యం వెంకట్‌రెడ్డి విగ్రహావిష్కరణకు భారీ ఏర్పాట్లు.. గులాబీమయంగా మారిన మండల కేంద్రం

మిడ్జిల్ జూన్ 29(లోకల్ గైడ్ )మిడ్జిల్ మాజీ సర్పంచ్ మన్యం రాధిక భర్త, దివంగత ప్రజానాయకుడు మన్యం వెంకట్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించనున్న వెంకట్‌రెడ్డి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వైరల్ ఫీవర్ కారణంగా హాజరు కాలేకపోతున్నట్లు పార్టీ నాయకులు తెలిపారు. ఆయన స్థానంలో బీఆర్ఎస్ ట్రబుల్ షూటర్, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు.ఈ మేరకు మండల పార్టీ అధ్యక్షుడు పాండు యాదవ్, మాజీ ఎంపీపీ సుదర్శన్ బరిగెల, మాజీ జడ్పీటీసీ శశిరేఖా బాలు, నాయకులు జంగా రెడ్డి, జైపాల్ రెడ్డి, గంజి కృష్ణ, సర్పంచ్‌లు శ్రీనివాస్ గౌడ్, గోపాల్ ముదిరాజ్, నాయకులు జగన్ గౌడ్ సోమవారం సంయుక్తంగా వెల్లడించారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.హరీశ్‌రావు రాక నేపథ్యంలో మిడ్జిల్ మండల కేంద్రం రాజకీయ సందడితో కళకళలాడుతోంది. జడ్చర్ల--కల్వకుర్తి జాతీయ రహదారి ఇరువైపులా భారీ ఫ్లెక్సీలు, కటౌట్లు, గులాబీ జెండాలు, స్వాగత తోరణాలతో ప్రత్యేకంగా అలంకరించారు. మండల కేంద్రంతో పాటు పరిసర గ్రామాల్లో కూడా బీఆర్ఎస్ శ్రేణులు విస్తృత ప్రచారం నిర్వహిస్తూ నాయకుల రాకకు ఘన స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.విగ్రహావిష్కరణ అనంతరం వెంకట్‌రెడ్డి సేవలను స్మరించుకుంటూ నివాళులర్పించడంతో పాటు పార్టీ నాయకుల సమావేశం నిర్వహించే అవకాశం ఉందని పార్టీ వర్గాలు తెలిపాయి. కార్యక్రమానికి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాతో పాటు వివిధ ప్రాంతాల నుంచి బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరయ్యే అవకాశముండటంతో మిడ్జిల్ మండల కేంద్రంలో రాజకీయ వాతావరణం నెలకొంది. పోలీసులు కూడా ట్రాఫిక్, భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించినట్లు సమాచారం.

## మద్యం మత్తులో పోలీసులతో దురుసు.. నిందితుడికి 3 రోజుల జైలు శిక్ష




మిడ్జిల్ జూన్ 29(లోకల్ గైడ్ ):మద్యం మత్తులో పోలీస్ స్టేషన్‌కు వచ్చి విధి నిర్వహణలో ఉన్న పోలీసు సిబ్బందితో దురుసుగా ప్రవర్తించిన వ్యక్తికి కోర్టు మూడు రోజుల సాధారణ జైలు శిక్ష విధించింది.మండలంలోని కాటంగడ్డ తండాకు చెందిన లక్ష్మణ్ పవార్ ఇటీవల పూర్తి మద్యం మత్తులో మిడ్జిల్ పోలీస్ స్టేషన్‌కు వచ్చి అక్కడ విధుల్లో ఉన్న పోలీసు సిబ్బందితో అనవసరంగా వాగ్వాదానికి దిగడంతో పాటు దురుసుగా ప్రవర్తించాడు. విధి నిర్వహణకు ఆటంకం కలిగించేలా వ్యవహరించడంతో పోలీసులు వెంటనే డీడీ కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నారు.అనంతరం నిందితుడిని సోమవారం గౌరవ న్యాయస్థానం ఎదుట హాజరుపరచగా, కేసును విచారించిన న్యాయమూర్తి నేరం రుజువుకావడంతో లక్ష్మణ్ పవార్‌కు మూడు రోజుల సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు. ప్రజలు మద్యం మత్తులో చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం, ప్రభుత్వ ఉద్యోగులతో దురుసుగా ప్రవర్తించడం చట్టరీత్యా శిక్షార్హమైన నేరమని పోలీసులు తెలిపారు. విధి నిర్వహణలో ఉన్న పోలీసులకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, చట్టాన్ని గౌరవించాలని సూచించారు.

## ప్రజల ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం.. 7వ వార్డులో నూతన కల్వర్టు బ్రిడ్జిని అందుబాటులోకి తీసుకొచ్చిన సర్పంచ్ నారగాని రాంబాయి



నాగులవంచ:లోకల్ గైడ్ :గ్రామాభివృద్ధే లక్ష్యంగా ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంలో నాగులవంచ గ్రామ సర్పంచ్ నారగాని రాంబాయి--శ్రీనివాసరావు మరో ముందడుగు వేశారు. గ్రామంలోని 7వ వార్డులో కొంతకాలంగా ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న కల్వర్టు బ్రిడ్జి సమస్యను గుర్తించి, వెంటనే స్పందించి నూతన కల్వర్టు బ్రిడ్జి నిర్మాణాన్ని చేపట్టించారు.వర్షాకాలంలో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతున్న పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని నాణ్యతా ప్రమాణాలతో బ్రిడ్జిని నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. దీంతో స్థానిక ప్రజలు, రైతులు, విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సురక్షితంగా రాకపోకలు సాగించే అవకాశం కలిగింది.ఈ సందర్భంగా సర్పంచ్ నారగాని రాంబాయి మాట్లాడుతూ, గ్రామ ప్రజల సమస్యల పరిష్కారమే తమ ప్రధాన బాధ్యత అని, గ్రామంలో అవసరమైన ప్రతి అభివృద్ధి పనిని దశలవారీగా పూర్తి చేసి ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు.గ్రామ ప్రజలు సర్పంచ్ నారగాని రాంబాయి తీసుకున్న చొరవను అభినందిస్తూ, ప్రజల అవసరాలను గుర్తించి అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయడం హర్షణీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో... నాగులవంచ శ్రీ గజగిరి లక్ష్మీనరసింహస్వామి మరియు కోదండరామస్వామి దేవాలయ కమిటీ చైర్మన్ ముత్తినేని వెంకటేశ్వర్లు, మాజీ దేవలయ కమిటీ చైర్మన్ నారగాని శ్రీనివాసరావు, ఏడో వార్డు సభ్యులు అనగాని జానకి - శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు ఏసు గోపయ్య, యేసు లక్ష్మయ్య, కందిమల్ల కాశయ్య, పడిశాల దినేష్, నరేష్, చల్లా నాగరాజు, తురక రమేష్,వేంకటేష్, గుడ్డేటి నాగేశ్వరావు వార్డు ప్రజలు,తదితరులు పాల్గొన్నారు.

## రైతుల అభ్యున్నతే సహకార బ్యాంకుల ప్రగతికి పునాది... రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు




ఖమ్మం :లోకల్ గైడ్ :సహకార బ్యాంకులు రైతులకు, గ్రామీణ ప్రజలందరికీ ఆర్థిక పరంగా అండగా నిలుస్తూ, పొదుపు, రుణాలు, ఇతర బ్యాంకింగ్ సేవలను సమర్థవంతంగా అందిస్తున్నాయని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సత్తుపల్లి నియోజకవర్గంలోని కల్లూరు పట్టణంలో సోమవారం ఖమ్మం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) కల్లూరు బ్రాంచ్ నూతన భవనాన్ని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్‌తో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా లిమంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, రైతులకు మరింత చేరువలో, సౌకర్యవంతమైన బ్యాంకింగ్ సేవలు అందించాలనే ఉద్దేశ్యంతో కల్లూరులో నూతన భవనంలో డీసీసీబీ శాఖను ప్రారంభించామని తెలిపారు. రైతు సుభిక్షంగా ఉంటేనే సహకార బ్యాంకులు కూడా అభివృద్ధి చెందుతాయని అన్నారు. రైతుల ఆదాయం పెరిగి, వారు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించినప్పుడు బ్యాంకింగ్ వ్యవస్థ మరింత బలోపేతమవుతుందని, తద్వారా మరింత మంది రైతులకు రుణాలు అందించే అవకాశం ఏర్పడుతుందని తెలిపారు.కల్లూరు బ్రాంచ్ ఆర్థికంగా బలమైన శాఖగా ఎదగడానికి వ్యాపారవేత్తలు, ప్రజలు తమ డిపాజిట్లను సహకార బ్యాంకులోనే ఉంచేలా అధికారులు కార్యాచరణ రూపొందించాలని సూచించారు. బ్యాంకు బలోపేతమైతే స్థానిక వ్యాపారాలు కూడా అభివృద్ధి చెందుతాయని అన్నారు. సత్తుపల్లి నియోజకవర్గంతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందని పేర్కొన్న మంత్రి, ప్రజలు తనపై ఉంచిన విశ్వాసంతో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టే అవకాశం లభించిందన్నారు.కల్లూరుకు రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేసినట్లు గుర్తు చేస్తూ, త్వరలో ఇంటిగ్రేటెడ్ సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని కూడా ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రిని కోరినట్లు తెలిపారు. అన్ని ప్రభుత్వ శాఖలు ఒకే ప్రాంగణంలో ఉండేలా ఆధునిక పరిపాలనా సముదాయాన్ని ఏర్పాటు చేయడానికి కృషి చేస్తామని వెల్లడించారు. కల్లూరు మండలంలో సాగునీరు, తాగునీరు, రహదారులు, ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, మౌలిక సదుపాయాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని మంత్రి అన్నారు. గతంలో మండల కార్యాలయాలు, కళాశాల భవనాలు, నీటి పథకాలు, లిఫ్ట్ ఇరిగేషన్ వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు.వేంసూరులో నిర్మాణంలో ఉన్న పామాయిల్ ఫ్యాక్టరీ త్వరలో ప్రారంభమైతే స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని మంత్రి తెలిపారు. ఖమ్మం-- అశ్వారావుపేట పాత రహదారిని నాలుగు లైన్ల జాతీయ రహదారిగా అభివృద్ధి చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరినట్లు మంత్రి తెలిపారు. అలాగే గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారికి ఎగ్జిట్, ఇతర మౌళిక వసతుల కల్పనకు కూడా చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. సత్తుపల్లి నియోజకవర్గానికి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మంచి పేరును మరింత పెంచేలా అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తామని, రాష్ట్ర ప్రభుత్వం లేదా కేంద్ర ప్రభుత్వం ద్వారా ఏ అవకాశం వచ్చినా ముందుగా సత్తుపల్లి నియోజకవర్గానికి తీసుకురావడానికి కట్టుబడి ఉంటానని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు.కార్యక్రమంలో సత్తుపల్లి ఎమ్మెల్యేమట్టా రాగమయి దయానంద్ మాట్లాడుతూ డిసిసిబి బ్యాంక్ ప్రయివేట్ బ్యాంకుల కంటే తక్కువ వడ్డీకే ఋణాలందిస్తున్నట్లు తెలిపారు. రైతులు సకాలంలో తీసుకున్న రుణాలు తిరిగి చెల్లించాలన్నారు. రైతులకు ఎన్ని రకాల రుణాలు వస్తాయో అధికారులు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిసిఓ గంగాధర్, ఏసీపీ వసుంధర యాదవ్, బ్యాంక్ సిఇఓ ఎన్. వెంకట ఆదిత్య, డిజిఎం ఎం. సర్వేశ్వర రావు, ఎజిఎం బి. చందర్ రావు, మేనేజర్ ఎం. అనిత, కల్లూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బాగం నీరజ, కల్లూరు మునిసిపల్ చైర్మన్ ఎం. మోహన్, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రైతన్నల తొలి పండగ ఏరువాక పౌర్ణమి - విస్తారమైన నదులనుండి పంటలు బాగా పండాలి

- రైతన్నల ఇంటిలో పండగ జరుపుకోవాలి

ఎన్కతల గ్రామ సర్పంచ్ పటేల్ గారి శ్రీకాంత్ గౌడ్

లోకల్ గైడ్, వికారాబాద్ :మోమిన్ పెట్ మండల పరిధిలోని ఎన్కతల గ్రామంలో ఏరువాక పౌర్ణమి సందర్భంగా గ్రామ సర్పంచి మాట్లాడుతూ..... రైతులు జరుపుకుని తొలి వ్యవసాయ పండుగ తొలకరి జల్లులను రుతుపవనాలను ఆహ్వానిస్తూ జ్యేష్ఠ మాసంలో వచ్చే పౌర్ణమి నాడు వ్యవసాయంలో సహాయపడే ఎద్దులకు ఆవులకు శుభ్రం కడిగి రంగులతో ఆలంకరించి కామిని కాంతల నుండి ఎన్కతల బురుజు చుట్టూ తిరుగుతూ పాత హనుమాన్ మందిరం వరకు పశువులను ఊరేగింపుతో నైవేద్యం చేసి రైతులకు శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పటేల్ గారి శ్రీకాంత్ గౌడ్ ఉపసర్పంచ్ సరోజ సురేష్ వార్డ్ నెంబర్స్, కార్బార్ కట్టెల నాగరాజ్ గ్రామ పెద్దలు చిన్నలు పాల్గొన్నారు.

## చిన్నారుల సంపూర్ణ ఆరోగ్య రక్షణే పరమావధి

విజయరాయి పిహెచ్‌సిలో స్వయంగా చిన్నారులకు పోలియో చుక్కలు వేసిన దెందులూరు ఎమ్మెల్యే శ్రీ చింతమనేని ప్రభాకర్



ఏలూరు జిల్లా ,పెదవేగి ,జూన్ 29 'నిండైన జీవితానికి రెండే చుక్కలు' నినాదంతో చిన్నారులకు పోలియో చుక్కలు పంపిణీలో పాల్గొన్న దెందులూరు ఎమ్మెల్యే శ్రీ చింతమనేని ప్రభాకర్..- ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని చిన్నారుల తల్లిదండ్రులకు, సంరక్షకులకు ఎమ్మెల్యే చింతమనేని పిలుపు.విజయరాయి (పెదవేగి), జూన్ భావి భారత పౌరులైన చిన్నారుల ఆరోగ్య భద్రతే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని, నియోజకవర్గంలో ప్రతి బిడ్డకూ సురక్షితమైన భవిష్యత్తును అందించడానికి తాము కట్టుబడి ఉన్నామని దెందులూరు శాసనసభ్యులు శ్రీ చింతమనేని ప్రభాకర్ స్పష్టం



చేశారు. "నిండైన జీవితానికి రెండే పోలియో చుక్కలు" అనే నినాదంతో దేశవ్యాప్తంగా చేపట్టిన జాతీయ పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా ఆదివారం పెదవేగి మండలం విజయరాయి గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పి హెచ్ సి ) లో జరిగిన పోలియో చుక్కల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి విచ్చేసిన దెందులూరు ఎమ్మెల్యే శ్రీ చింతమనేని ప్రభాకర్ కి స్థానిక కూటమి నాయకులు మెడికల్ అధికారుల ఆధ్వర్యంలో పుష్పగుచ్ఛలను అందించి ఘన స్వాగతం పలికారు..ఈ సందర్భంగా కేంద్రంలో ఉన్న చిన్నారులను ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఎంతో ఆప్యాయంగా దగ్గరకు తీసుకుని, తన చేతులతో స్వయంగా పోలియో చుక్కలు వేశారు. ఒక ప్రజాప్రతినిధిగా ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలిచే ఆయన.. పసిపిల్లల పట్ల చూపిన ప్రేమ, వాత్సల్యం అక్కడ ఉన్న తల్లులను, ప్రజలను ఎంతగానో ఆకట్టుకున్నాయి.పోలియో రహిత దెందులూరు మన లక్ష్యం - ఎమ్మెల్యే శ్రీ చింతమనేని:అనంతరం ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ.. ఐదేళ్ల లోపు వయసున్న ప్రతి చిన్నారికీ పోలియో చుక్కలు వేయించడం తల్లిదండ్రుల, సంరక్షకుల కనీస బాధ్యత అన్నారు. నియోజకవర్గంలో ఏ ఒక్క బిడ్డ కూడా ఈ కార్యక్రమానికి దూరం కాకూడదనే ఉద్దేశంతో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో పకడ్బందీ ఏర్పాట్లు చేయించామన్నారు. వైద్యులు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది సమన్వయంతో ప్రతి పల్లెకూ ఈ సేవలను చేరవేస్తున్నారని అన్నారు.ఈ కార్యక్రమంలో పెదవేగి మండల పార్టీ అధ్యక్షులు ఈడుపుగంటి అనిల్, ఎంపిడిఓ నాగేంద్ర, వైద్యాధికారులు డాక్టర్ ప్రత్యూష, డాక్టర్ మల్లికార్జున్ సహా పలువురు కూటమి నాయకులు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు..

## ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి హాస్పటల్ బిల్స్ నిమిత్తం మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు అందజేసిన కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాసరావు





ఏలూరు జిల్లా ,కైకలూరు ,జూన్ 29 ఈరోజు ఉదయం గవర్నమెంట్ అస్యూరెన్స్ కమిటీ చైర్మన్, శాసనసభ్యులు డా. కామినేని శ్రీనివాస్ వరహాపట్నం గ్రామములో తమ నివాసం వద్ద ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి హాస్పిటల్ బిల్స్ నిమిత్తం మంజూరైన చెక్కులను లబ్దిదారులకు అందజేసారు. ఈ కార్యక్రమంలో ఎన్ డి ఏ నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

**లబ్దిదారుల పేర్లు:**

వరహాపట్నం గ్రామస్థులు నంగెడ్డ మస్తాని కి రూ. 7,94,533/-కైకలూరు గ్రామస్థులు ఖ సత్యనారాయణ కి రూ. 1,62,846/-పేరూరు గ్రామస్థులు కుంభం గంగాధరరావు కి రూ. 74,670/-శృంగవరప్పాడు గ్రామస్థులు ఘంటసాల విజయ నిర్మల కి రూ. 65,000/-భైరవపట్నం గ్రామస్థులు బోలోమ్ నాగేశ్వరమ్మ కి రూ. 57,000/-పందిరిపల్లిగూడెం గ్రామస్థులు బలే వెంకట సుబ్బలక్ష్మి కి రూ. 49,584/-చిన్న తాడినాడ గ్రామస్థులు కొల్లాటి లక్ష్మి దుర్గ కి రూ. 43,580/-లోకుమూడి గ్రామస్థులు సదర్ల సాహితి కి రూ. 41,288/-చింతపాడు గ్రామస్థులు రాయపాటి లలిత దుర్గ కి రూ. 37,205/-ఊటుకూరు గ్రామస్థులు కుర్మా పుష్పలత కి రూ. 34,919/-ముదినేపల్లి గ్రామస్థులు ఉప్పాల రాంబాబు దుర్గ కి రూ. 26,218/-లింగాల గ్రామస్థులు పెరుమాళ్ళ వెంకట నాగలక్ష్మి కి రూ. 25,920/- 12 లబ్దిదారులకు గాను రూ. 14,12,763/- లు మంజూరైనవి.

## శ్రీకాళహస్తి వన్ టౌన్ సిఐగా బాధ్యతలు స్వీకరించిన వెంకటేష్



శ్రీకాళహస్తి నియోజకవర్గం, (29.06.2026):శ్రీకాళహస్తి వన్ టౌన్ సిఐగా వెంకటేష్ నేడు బాధ్యతలు స్వీకరించారు. గతంలో శ్రీకాళహస్తి రూరల్ ఎస్సైగా సమర్ధవంతంగా విధులు నిర్వహించిన ఆయన, మండల ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసారు. ఇటీవలే సిఐగా పదోన్నతి పొంది శ్రీకాళహస్తి వన్ టౌన్ సిఐగా నేడు బాధ్యతలు స్వీకరించారు. సిఐ వెంకటేష్ కి ఆర్టిఐ ఎక్స్ ప్రెస్ న్యూస్ పేపర్ తరపున హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేస్తూ... ఆయన విధులు సమర్ధవంతంగా నిర్వహించి, మరిన్ని ఉన్నతమైన పదవులు పొందాలని ఆకాంక్షితున్నాము.

# జంగారెడ్డిగూడెం మమత హాస్పిటల్ లో వైద్యం పొందుతున్నా రజిత



ఏలూరు జిల్లా ,జంగారెడ్డిగూడెం ,జూన్ 29అసలు ఆత్మహత్యాయత్నం చేసుకోవడానికి కారకులు ఎవరు.ఉండి మండలం వీధి నవీన్ తరపు బంధువులు, కెవిపిఎస్ నాయకుల వేధింపుల వల్లే ఆత్మహత్యకు పాల్పడ్డాను: వీధి నవీన్ కుమార్ భార్య రజిత.రజిత సూసైడ్ చేసుకోవడానికి అసలు కారణం ఏమిటి అసలు రజిత ఏం చెప్తుందో చూద్దాం.భర్త తరపు బంధువులు, కెవిపిఎస్ నాయకుల వేధింపుల వల్లే ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు ఉండి మండలం పాందువ్వ గ్రామానికి చెందిన వీధి నవీన్ కుమార్ భార్య రజిత పేర్కొన్నారు. పెళ్లయినప్పటి నుంచి కట్నం సరిపోలేదని నవీన్ తల్లి బుజ్జి, మేనమామ రవికుమార్ అతని భార్య కుమారి వారి కొడుకు క్రాంతి కుమార్ లు తనను తరచూ వేధిస్తూ ఉండేవారని పేర్కొంది. భర్త నవీన్ కు మోటార్ సైకిల్ కొనివ్వాలని తరచూ వేధిస్తుండడంతో నా పుట్టింటి వారు పెట్టిన చెవిలీలు అమ్మి డబ్బు ఇవ్వగా అవి కూడా సరిపోలేదని ఇంకా డబ్బు కావాలని వేధించేవారని వివరించింది. విషయం తన తల్లికి ఫోన్ చేసి నవీన్ ఎకౌంటుకు 20000 ఫోన్ పే చేయాలని కోరగా , ఫోన్ పే చేసిందన్నారు .దాంతో నవీన్ కుమార్ మోటార్ సైకిల్ కొనుక్కున్నాడని రజిత వివరించింది.సుమారు రెండు నెలల క్రితం నవీన్, నవీన్ తల్లి బుజ్జి అతని మేనమామ అతని భార్య వారి కొడుకు క్రాంతి కుమార్ ఇంట్లో వస్తువులు ఏమీ లేవని మళ్లీ వేధించడంతో తన తల్లి గత్యంతరం లేక నా కాపురం బాగుకోసం ఇంటి సామాగ్రి. మంచం, దివాన్ కాట్, బీరువా, డ్రెస్సింగ్ టేబుల్ మరికొన్ని సామాగ్రి కొని పంపించినట్లు వివరించింది. భర్త నవీన్ కుమార్ కు లక్ష్మి ప్రసన్న, అతని వదిన దుర్గతో గల అక్రమ సంబంధాల గురించి, పేకాటలు ఎక్కువగా ఆడుతున్నాడనే భర్తను నిలదీయగా ఇద్దరి మధ్య గొడవలు జరిగితే నవీన్ పురుగుమందు తాగడంతో అతనిని చికిత్స నిమిత్తం హాస్పిటల్ లో జాయిన్ చేశారని .భర్తను చూడటానికి హాస్పిటల్ కి వెళ్తే నవీన్ మేనమామ రవికుమార్. వాళ్ల అబ్బాయి క్రాంతి కుమార్ లు తనను లేనిపోని మాటలు అని చూడటానికి హాస్పిటల్ లోకి వెళ్లనీయలేదని వివరించింది.దీంతో నవీన్ ది 12.05.2026 వ తేదీ రాత్రి చనిపోయాడని పేర్కొంది. భర్త చనిపోయిన తర్వాత నవీన్ చూడడానికి వెళ్తే మాదాసు రవికుమార్ అతని భార్య కుమారి అతని కుమారుడు క్రాంతికుమార్ బంధువులు సరిపల్లి జాన్ మోజేష్ లు నీవల్లే నవీన్ చనిపోయాడని అక్కడకు రానీయలేదన్నారు. వీరంతా అనేకసార్లు నవీన్ నీవల్ల చనిపోయాడని నీ మీద కేసులు పెడతామని బెదిరించే వారిని వివరించింది. భర్త చనిపోయిన బాధలోఉంటే ఇష్టం వచ్చినట్టు వారంతా వేధిస్తుండడంతో కృంగిపోయానని రజిత వివరించింది.భర్త శవాన్ని ది 14-05-2026 తేదీన అంత్యక్రియలు చేయడానికి ముందు జరిగిన ప్రార్థన కార్యక్రమంలో నవీన్ కు "ఒక వేశ్యతో పెళ్లి అయిందని చివరికి ఆమె చంపేసింది" అని మాట్లాడి అందరిలో అవహేళన చేశారనీ రజిత వివరించింది. ఆ తర్వాత రోజు నుంచి కెవిపిఎస్ పార్టీకి చెందిన క్రాంతి కుమార్, నవీన్ తల్లి బుజ్జి, మేనమామ రవికుమార్, అతని భార్య కుమారి, వారి కొడుకు క్రాంతి కుమార్ , వీళ్ళకి బంధువులైన ఏలూరుకు చెందిన సరిపల్లి జాన్ మోజేష్ లు అనేకసార్లు నన్ను, నవీన్ చావుకి నువ్వే కారణం అంటూ మాకు 10,00,00/(10 లక్షల రూపాయలు ) ఇవ్వాలంటూ డిమాండ్ చేశారని పేర్కొంది. లేకపోతే మీపై పోలీసు కేసులు పెట్టి జైలుకు పంపిస్తామని భయపెట్టారని రజిత వివరించింది.ది 26-06-2026 వ తేదీన కెవిపిఎస్ పార్టీకి చెందిన క్రాంతి కుమార్ , నవీన్ తల్లి బుజ్జి మాదాసు రవికుమార్ వారి బంధువులు కలిసి విజయవాడ వెళ్లి అందరికీ తెలిసే విధంగా సోషల్ మీడియాలో పోస్టు పెట్టి వైరల్ చేస్తున్నారనీ,ఇది చూసిన తాను చస్తే గాని వీరంతా సంతోషంగా ఉండరని నిర్ణయానికి వచ్చానన్నారు. టీ నర్సాపురం మండలం మా అమ్మగారి ఇంటిలో పురుగుమందును వాటర్ లో కలుపుకుని తాగాననీ, తర్వాత జంగారెడ్డిగూడెం హాస్పిటల్ లో జాయిన్ చేశారని వివరించింది. ఈ విషయమై పోలీసులు పూర్తిస్థాయిలో దర్యాప్తు ప్రారంభించారు.

## కార్పొరేట్ ప్రైవేట్ విద్యాసంస్థల బస్సులకు పూర్తిస్థాయిలో ఫిట్‌నెస్ తనిఖీలు నిర్వహించాలి

- రవాణా అధికారి కరుణాసాగర్ రెడ్డి కి వినతి పత్రం ఇచ్చిన పి.డి.ఎస్.యు విద్యార్థి సంఘం




హిందూపురం జూన్ 29(ఈ సందర్భంగా పి.డి.ఎస్.యు విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు బాబావలి మాట్లాడుతూ డివిజన్ వ్యాప్తంగా ఉన్న కార్పొరేట్.ప్రైవేట్ స్కూల్ బస్సులను పూర్తిస్థాయిలో ఫిట్‌నెస్ తనిఖీలు నిర్వహించాలి.విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని కార్పొరేట్ ప్రైవేట్ విద్యాసంస్థలకు చెందిన అన్ని స్కూల్ బస్సులపై రవాణా శాఖ అధికారులు క్రమం తప్పకుండా ఫిట్‌నెస్ తనిఖీలు నిర్వహించాలి. బ్రేకులు, టైర్లు, ఫస్ట్ ఎయిడ్ బాక్సులు అత్యవసర ద్వారాలు, ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు, సీసీ కెమెరాలు తదితర భద్రతా ప్రమాణాలు సక్రమంగా ఉన్నాయా లేదా అనే విషయాలను పరిశీలించి.అలాగే, స్కూల్ బస్సుల్లో సీటింగ్ సామర్థ్యానికి మించి విద్యార్థులను తరలించడం వల్ల ప్రమాదాల సమయంలో తీవ్ర ప్రాణనష్టం సంభవించే అవకాశం ఉంది. విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఇటువంటి విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలి. అదేవిధంగా ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తున్న బస్సులపై జరిమానాలు విధించడంతో పాటు,అవసరమైతే వాటి అనుమతులను సైతం రద్దు చేయాలి అని డిమాండ్ చేశారు లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన నిరసన కార్యక్రమాలకు శ్రీకారం చుడదామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పి డి ఎస్ యు నాయకులు నాగేంద్ర అనుదీప్ లక్ష్మీపతి నందీష్ యశ్వంత్ అభివర్ధన్ పాల్గొనడం జరిగింది.

## సహకార వారోత్సవాల్లో భాగంగా మొక్కలు నాటిన తంగేళ్లపాలెం పీఏసీఎస్




శ్రీకాళహస్తి నియోజకవర్గం, (29.06.2026):సహకార వారోత్సవాల్లో భాగంగా సహకారం ద్వారా సమృద్ధినినాదంతో శ్రీకాళహస్తి నియోజకవర్గం, తొట్టంబేడు మండల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) ఆధ్వర్యంలో సోమవారం మొక్కలు నాటే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. తిరుపతి జిల్లా సహకార శాఖ ఆదేశాల మేరకు సంఘ కార్యాలయ ప్రాంగణంలో ఈ కార్యక్రమం చేపట్టారు. సంఘ అధ్యక్షులు బీమాల భాస్కర్ ముదిరాజ్, సహకార శాఖ అధికారి, సంఘ సీఈవో పి.చిరంజీవిరెడ్డి, తెదేపా మండల ప్రధాన కార్యదర్శి చిల్లకూరు బాలసుబ్రమణ్యం సంయుక్తంగా మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సంఘ ఉద్యోగులు, స్థానిక రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని పలు రకాల మొక్కలను నాటారు. హరితహారం పెంపునకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని సంఘ అధ్యక్షులు భాస్కర్ ముదిరాజ్ పిలుపునిచ్చారు. సహకార సంఘాలు కేవలం ఆర్థిక సేవలకే పరిమితం కాకుండా సామాజిక బాధ్యత కలిగిన కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని సీఈవో చిరంజీవిరెడ్డి తెలిపారు. సహకార రంగాన్ని బలోపేతం చేయడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో పచ్చదనం పెంపొందించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి చిల్లకూరు బాలసుబ్రమణ్యం, రైతులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే అమిలినేని జేబులోకే బెల్ట్ షాపుల అక్రమ వసూళ్లు - మాజీ ఎంపీ రంగయ్య

నియోజకవర్గంలో 372 బెల్ట్ షాపులతో అక్రమ దోపిడీ..

ఎక్సైజ్ సీఐకి వినతిపత్రం అందజేత





కళ్యాణదుర్గంప్రతినిధి బి గోవిందు జూన్ 29కళ్యాణదుర్గం నియోజకవర్గంలో బెల్ట్ షాపుల పేరుతో సాగుతున్న అక్రమ అదనపు వసూళ్లను తక్షణమే అరికట్టాలని మాజీ ఎంపీ, వైఎస్ఆర్సీపి నియోజకవర్గ సమన్వయకర్త రంగయ్య డిమాండ్ చేశారు. నియోజకవర్గంలో సాగుతున్న ఈ అక్రమ దోపిడీని నిరసిస్తూ



వైఎస్ఆర్సీపి శ్రేణులతో కలిసి ఆయన కళ్యాణదుర్గం ఎక్సైజ్ సీఐకి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా మాజీ ఎంపీ రంగయ్య మాట్లాడుతూ.కళ్యాణదుర్గం నియోజకవర్గంలో అధికార పార్టీ అండతో మద్యం దోపిడీ పతాక స్థాయికి చేరిందని మండిపడ్డారు. నియోజకవర్గవ్యాప్తంగా మొత్తం 372 బెల్టు షాపులను ఏర్పాటు చేసి, మద్యపాన ప్రియుల నుండి అక్రమంగా అదనపు వసూళ్లకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. ఈ బెల్ట్ షాపుల ద్వారా వస్తున్న అక్రమ వసూళ్లన్నీ నేరుగా ఎమ్మెల్యే అమిలినేని జేబుల్లోకే వెళ్తున్నాయని రంగయ్య తీవ్ర ఆరోపణలు చేశారు.అధికార బలాన్ని వాడుకుంటూ నియోజకవర్గంలో సమాంతర మద్యం సామ్రాజ్యాన్ని నడుపుతున్నారని, ఈ అక్రమ దోపిడీపై ఎక్సైజ్ అధికారులు తక్షణమే స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. బెల్టు షాపులలో అక్రమ వసూళ్లు అరికట్టకుంటే వైఎస్ఆర్సీపి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సీపి రాష్ట్ర కార్యదర్శి బోయ తిప్పేస్వామి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు దొడగట్ట నారాయణ, ములకనూరు తిమ్మరాయుడు, లీగల్ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు హనుమంతరెడ్డి, ఐదు మండలాల కన్వీనర్లు,జెడ్పీటీసీలు,ఎంపీపీలు మరియు పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## తుగ్గలి మండలంలో ఉప్పర్లపల్లి , మారెళ్ల సొసైటీల్లో సహకార జెండా ఆవిష్కరణ - వారోత్సవాలు ప్రారంభం





తుగ్గలి: జూన్ 29మండల పరిధిలోని ఉప్పర్లపల్లి , మారెళ్ల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ఆధ్వర్యంలో 2026 సహకార వారోత్సవాలు ఘనంగా ప్రారం భమయ్యాయి. జూన్ 29 నుంచి జూలై 7 వరకు వారోత్సవాలు నిర్వహిస్తున్నారు వారు తెలిపారు. సోమవారం ఉప్పర్లపల్లి సొసైటీ జొన్నగిరి కార్యాలయంలో సీఈఓ గిడ్డయ్య సహకార జెండాను ఆవిష్కరించి వారోత్సవాలను ప్రారంభించారు. అదేవిధంగా మారెళ్ల అశోక్ పీఏసీఎస్ కార్యాలయంలో సీఈవో మనోహర్ నాయుడు, జెండా ఎగురవేశారు. సహకార శాఖ ఏర్పడి 5 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా ఈ కార్యక్రమాలు చేపట్టారు.ఈ వారోత్సవాల ద్వారా రైతులకు వ్యవసాయ రుణాలు, పంట బీమా, ప్రభుత్వ పథకాలు, సహకార సంఘాల సేవలపై అవగాహన కల్పించనున్నారు. రచ్చబండ కార్యక్రమాల ద్వారా గ్రామాల్లో రైతుల సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఉప్పర్లపల్లి సొసైటీ కార్యాలయం సిబ్బంది, రైతులు, మారెళ్లలో సెక్రటరీ మధుసూదన్ నాయుడు, డైరెక్టర్లు రాంపల్లి శ్రీనివాసులు, బొందిమడుగుల మోహన్ యాదవ్, సొసైటీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు. సహకార సంఘాల అభివృద్ధికి సభ్యులు, రైతులు సహకరించాలని కోరారు.

# మధిర సభ రద్దు..
# 'రైతు భరోసా'పై రేవంత్ సర్కార్ క్లారిటీ



హైదరాబాద్: భారీ వర్షాల కారణంగా ఖమ్మం జిల్లా మధిరలో నిర్వహించాల్సిన రైతు ఆశీర్వాద సభను తెలంగాణ ప్రభుత్వం రద్దు చేసింది. దీంతో రైతు భరోసా నిధుల విడుదల ఉండదా? అనే ఆందోళనలు రైతుల్లో వ్యక్తమైంది. అయితే.. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో సభా వేదికను హైదరాబాద్‌కు మార్చినట్లు ప్రభుత్వ వర్గాలు ఓ క్లారిటీ ఇచ్చాయి. మొదట మధిరలో భారీ బహిరంగ సభ నిర్వహించి, రైతుల సమక్షంలో రైతు భరోసా పథకం నిధులు విడుదల చేయాలని రేవంత్ ప్రభుత్వం నిర్ణయించింది. అయితే రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలు, మధిర పరిసరాల్లో కూడా ప్రతికూల వాతావరణం నెలకొనడం.. సభా ప్రాంగణంలో మోకాల లోతు నీరు చేరడంతో.. చివరి నిమిషంలో సభను రద్దు చేసింది. దీంతో జూన్ 30 సాయంత్రం 4 గంటలకు హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో రైతు ఆశీర్వాద సభ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి రైతులను ఉద్దేశించి ప్రసంగించడంతో పాటు, రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులను విడుదల చేయనున్నారు. సభా వేదిక మారినప్పటికీ రైతు భరోసా నిధుల విడుదల కార్యక్రమంలో ఎలాంటి మార్పు లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. రైతులకు నిర్ణీత షెడ్యూల్ ప్రకారమే నిధులు జమయ్యేలా ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు. వర్షాల కారణంగా ప్రజలకు, రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకే మధిర సభను రద్దు చేసి హైదరాబాద్‌లో ఇండోర్ వేదికను ఎంపిక చేసినట్లు ప్రభుత్వం వెల్లడించింది.

## రాష్ట్రంలో అరు నెలల్లోపే అసెంబ్లీ ఎన్నికలు..
## సిద్ధంగా ఉండాలని డీఎంకే శ్రేణులకు ఎంకే స్టాలిన్ పిలుపు..!




**న్యూఢిల్లీ,:** తమిళనాడు లో రాజకీయ పరిణామాలు వేగంగా మారే అవకాశం ఉందని డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ అన్నారు. మరో ఐదేళ్లు ఎదురుచూడాల్సిన అవసరం లేదని, మూడు నెలలు లేదా ఆరు నెలల్లో ఎన్నికలు రావొచ్చని పార్టీ శ్రేణులను అప్రమత్తం చేశారు. ఇప్పటి నుంచే ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. చెన్నై లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో మాజీ మంత్రి బెంజమిన్‌తో పాటు పలువురు ఏఐఏడీఎంకే నేతలు, కార్యకర్తలు డీఎంకేలో చేరారు. ఈ సందర్భంగా స్టాలిన్ మాట్లాడారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న టీవీకే ప్రభుత్వానికి సొంతంగా మెజారిటీ లేదన్నారు. 118 సీట్ల మెజారిటీ అవసరం కాగా ఆ పార్టీకి 108 స్థానాలే వచ్చాయని గుర్తుచేశారు. ప్రస్తుతం ప్రభుత్వం ఇతర పార్టీల మద్దతుతోనే కొనసాగుతోందన్నారు. ఇటీవల వరకు డీఎంకే కూటమిలో ఉన్న కాంగ్రెస్, వామపక్షాలు, వీసీకే, ఐయూఎంఎల్ మద్దతుతోనే ప్రభుత్వం నడుస్తోందని చెప్పారు. అలాంటి ప్రభుత్వం ఎంతకాలం కొనసాగుతుందో చెప్పలేమన్నారు. ఎప్పుడు కూలిపోతుందో తెలియదని వ్యాఖ్యానించారు.అందుకే పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇప్పటి నుంచే ఎన్నికలకు సిద్ధం కావాలని స్టాలిన్ సూచించారు. ఎన్నికల షెడ్యూల్ వచ్చిన తర్వాత కాకుండా ఇప్పటి నుంచే క్షేత్రస్థాయిలో పని ప్రారంభించాలని కోరారు. డీఎంకేను మళ్లీ అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. టీవీకే ప్రభుత్వంపై కూడా స్టాలిన్ విమర్శలు గుప్పించారు. గత నెల రోజులుగా రాష్ట్రంలో అభివృద్ధి మందగించిందన్నారు. పెట్టుబడిదారులు ఇతర రాష్ట్రాలకు వెళుతున్నారని అన్నారు. మహిళలపై నేరాలు, మాదకద్రవ్యాల కేసులు, దోపిడీలు, పెట్రోల్ బాంబు దాడులు, విద్యుత్ కోతలు పెరిగాయని విమర్శించారు. ప్రతిపక్ష నేత ఉదయనిధి స్టాలిన్ కూడా ప్రభుత్వంపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఒకప్పుడు తమిళనాడులో ఉన్న సుపరిపాలన ఇప్పుడు కనిపించడం లేదన్నారు. ప్రజలు విద్యుత్, తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వం పాలన కంటే ప్రచారంపైనే ఎక్కువ దృష్టి పెడుతోందని విమర్శించారు. అసెంబ్లీ సమావేశాలు సభలా కాకుండా సినిమా షూటింగ్‌లా మారిపోయాయని ఎద్దేవా చేశారు.

## అయోధ్య బార్ అసోసియేషన్ కీలక నిర్ణయం..
## నిందితుల తరపున వాదిస్తే 5 లక్షల ఫైన్



అయోధ్య: అయోధ్య రామాలయంలో విరాళాలను దుర్వినియోగం చేసిన కేసులో 8 మందిని అరెస్టు చేసిన విషయం తెలిసిందే. అయితే ఇవాళ అయోధ్య బార్ అసోసియేషన్ కీలక నిర్ణయం తీసుకున్నది. నిందితుల తరపున కేసును వాదించబోమని లాయర్ల సంఘం తీర్మానించింది. బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కాలికా ప్రసాద్ మిశ్రా మాట్లాడుతూ.. నిధుల చోరీ కేసులో నిందితులను తరపున ఎవరూ వాదించరు అని, ఒకవేళ వాదిస్తే వారికి 5 లక్షల జరిమానా విధించనున్నట్లు చెప్పారు. బార్ అసోసియేషన్ మరో నిర్ణయాన్ని కూడా తీసుకున్నది. రామాలయ జనరల్ సెక్రటరీ చంపత్ రాయ్, సభ్యుడు అనిల్ మిశ్రా, గోపాల్ రావు.. తక్షణమే అయోధ్య విడిచి వెళ్లాలని డిమాండ్ చేసింది. మూడు రోజుల్లోగా అయోధ్య నుంచి వెళ్లిపోకుంటే, అప్పుడు సిటీని బ్లాక్ చేస్తామని, ఎవర్నీ లోపలికి రానివ్వకుండా చేస్తామని మిశ్రా తెలిపారు. అయితే ఈ ముగ్గురిలో ఏ ఒక్కరి పేరు కూడా ఎఫ్ఐఆర్‌లో నమోదు కాకపోవడం గమనార్హం. ఈ కేసులోని 8 మంది నిందితుల్లో అవినాశ్ శుక్లా, అనుకల్ప్ మిశ్రా, లవ్ కుష్ మిశ్రా, మనీశ్ కుమార్ యాదవ్, కరుణేశ్ పాండే, రామ్ శంకర్ మిశ్రా, సుభాష్ శ్రీవాత్సవ, రామశంకర్ ఉన్నారు. నిందితులు అందరూ క్యాష్ కౌంటింగ్, విలువైన వస్తువులను భద్రత పరిచే ఉద్యోగంలో ఉన్నారు. ఈ కేసులో సీబీఐ విచారణ చేపట్టాలని బార్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. సమగ్ర విచారణ కోసం సుప్రీంకోర్టు వరకు వెళ్లనున్నట్లు ప్రసాద్ మిశ్రా తెలిపారు. చంపత్ రాయ్, అనిల్ మిశ్రా ప్రస్తుతం ట్రస్టుకు రాజీనామా చేశారు. దానిపై జూలై 7వ తేదీన నిర్ణయించనున్నారు.

## రికార్డు స్థాయిలో తిరుమలను దర్శించుకున్న భక్తులు



అమరావతి: తిరుమల లో వేంకటేశ్వరస్వామిని దర్శించుకోవడానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు రికార్డు స్థాయి లో స్వామివారిని దర్శించుకున్నారు. ఆదివారం ఒక్క రోజే 91,793 మంది శ్రీవారిని దర్శించుకున్నారని టీటీడీ అధికారులు వివరించారు. 31,221 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించుకున్న కానుకల ద్వారా హుండీకి రూ .4.90 కోట్లు ఆదాయం వచ్చిందన్నారు. భక్తులు శిలాతోరణం వరకు క్యూలైన్‌లో నిలబడగా వీరికి 18 గంటల్లో సర్వదర్శనం అవుతుందని తెలిపారు 4.38 లక్షల లడ్డూలను భక్తులకు విక్రయించగా 3.31 మంది అన్నప్రసాదం స్వీకరించారని వివరించారు.

# 15 ఏళ్ల డాలర్ బంధానికి ముగింపు!




ఒక దేశపు కరెన్సీ విలువను మరో దేశపు కరెన్సీతో స్థిరంగా అనుసంధానించి ఉంచడం.. ఆ తర్వాత ఆ బంధాన్ని తెంచుకోవడం సాధారణ నిర్ణయం కాదు. అలాంటి కీలక అడుగే ఇప్పుడు బొలీవియా వేసింది. 15 ఏళ్లుగా కొనసాగిన డాలర్ పెగ్ విధానానికి ముగింపు పలికింది. ఈ నిర్ణయం వెనుక ఉన్న బలమైన కారణం ఏంటి? డాలర్ పెగ్‌ను వదిలేయాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చింది? ఈ మార్పు బొలీవియా ఆర్థిక వ్యవస్థను ఎలా ప్రభావితం చేయనుంది? పరిశీలిస్తే.. సాధారణంగా ఒక దేశ కరెన్సీ విలువ మార్కెట్లో డిమాండ్, సరఫరా ఆధారంగా మారుతూ ఉంటుంది. అయితే కొన్ని దేశాలు తమ కరెన్సీ విలువను అమెరికన్ డాలర్‌కు స్థిరంగా కట్టిపెడతాయి. దీనినే "డాలర్ పెగ్" అంటారు. బొలీవియా కూడా గత 15 ఏళ్లుగా తన కరెన్సీ అయిన "బొలివియానో" విలువను డాలర్‌తో స్థిరంగా కొనసాగించింది. మార్కెట్లో పరిస్థితులు ఎలా మారినా.. ఒక నిర్దిష్ట మారకపు రేటును ప్రభుత్వం కొనసాగిస్తూ వచ్చింది. ఇందుకోసం భారీ మొత్తంలో డాలర్ నిల్వలు అవసరమవుతాయి.

### సడన్‌గా ఎందుకు?..

ఇటీవలి కాలంలో బొలీవియా తీవ్ర ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటోంది. దేశ విదేశీ మారక నిల్వలు గణనీయంగా తగ్గిపోయాయి. ఇంధన దిగుమతులు, విదేశీ చెల్లింపుల కోసం అవసరమైన డాలర్లను సమకూర్చడం ప్రభుత్వానికి భారంగా మారింది. మరోవైపు మార్కెట్లో డాలర్ల కొరత తీవ్రమైంది. అధికారిక మారకపు రేటు ఒకలా ఉండగా, బ్లాక్ మార్కెట్లో డాలర్ ధర మరింత ఎక్కువగా పలుకుతోంది. దీంతో ప్రజలు అధికారిక బ్యాంకింగ్ వ్యవస్థపై నమ్మకం కోల్పోయి బ్లాక్ మార్కెట్ వైపు మొగ్గు చూపడం ప్రారంభించారు. ఈ పరిస్థితుల్లో పాత విధానాన్ని కొనసాగించడం సాధ్యం కాదని ప్రభుత్వం భావించింది.

### ఇకపై..

డాలర్ పెగ్ విధానాన్ని రద్దు చేయడంతో ఇకపై బొలీవియా కరెన్సీ విలువ మార్కెట్ పరిస్థితులను బట్టి నిర్ణయించబడుతుంది. అంటే డిమాండ్, సరఫరా ఆధారంగా కరెన్సీ విలువ పెరగవచ్చు లేదంటే తగ్గవచ్చు. ఈ నిర్ణయం తర్వాత బొలివియానో విలువ గణనీయంగా పడిపోయే అవకాశాలు ఉన్నాయని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. అలాగే దీని ప్రభావంగా.. దిగుమతి వస్తువుల ధరలు పెరిగి ద్రవ్యోల్బణం అధికమయ్యే అవకాశం ఉంది. అయితే దీర్ఘకాలంలో కరెన్సీ నిజమైన మార్కెట్ విలువను ప్రతిబింబించడం వల్ల ఆర్థిక వ్యవస్థ మరింత పారదర్శకంగా మారుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

మరికొన్ని దేశాలు..

బొలీవియా నిర్ణయం ప్రపంచానికి కొత్తేమీ కాదు. గతంలో అనేక దేశాలు డాలర్‌తో ఉన్న స్థిర అనుబంధాన్ని వదిలేశాయి. దక్షిణ అమెరికా దేశమైన అర్జెంటీనా 1990లలో తన కరెన్సీ పెసోను డాలర్‌కు 1:1 నిష్పత్తిలో కట్టిపెట్టింది. కానీ తీవ్రమైన ఆర్థిక సంక్షోభం కారణంగా 2002లో ఆ విధానాన్ని రద్దు చేయాల్సి వచ్చింది. అనంతరం అర్జెంటీనా కరెన్సీ భారీగా విలువ కోల్పోయింది. అలాగే కజకిస్తాన్ 2015లో, ఈజిప్ట్ 2016లో తమ కరెన్సీలను మార్కెట్ ఆధారిత విధానానికి మార్చాయి. నైజీరియా కూడా గత కొన్నేళ్లుగా విదేశీ మారక సంక్షోభం నేపథ్యంలో కరెన్సీపై నియంత్రణలను సడలిస్తోంది. అయితే మరోవైపు సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, హాంకాంగ్ వంటి దేశాలు ఇప్పటికీ డాలర్ పెగ్ విధానాన్ని కొనసాగిస్తున్నాయి. ఈ దేశాల వద్ద భారీ విదేశీ మారక నిల్వలు ఉండటం ఇందుకు ప్రధాన కారణం. ఒక దేశం తన కరెన్సీని డాలర్‌కు కట్టిపెట్టడం ఎంత కష్టమో, ఆ బంధాన్ని తెంచుకోవడం కూడా అంతే కీలక నిర్ణయం. బొలీవియా తీసుకున్న తాజా నిర్ణయం ఆ దేశ ఆర్థిక పరిస్థితి ఎంత క్లిష్టంగా మారిందో చెబుతూనే, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో డాలర్ ఆధిపత్యం, కరెన్సీ విధానాలపై మరోసారి చర్చకు దారితీసింది. భారత్ డాలర్ పెగ్ విధానాన్ని అనుసరించదు. మన కరెన్సీ రూపాయి 'మేనేజ్డ్ ఫ్లోట్' విధానంలో ఉండటంతో.. మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా దాని విలువ మారుతుంటుంది. అయితే రూపాయిలో తీవ్ర ఒడిదొడుకులు రాకుండా అవసరమైనప్పుడు ఆర్‌బీఐ జోక్యం చేసుకుంటుంది.

# చిక్కుల్లో మెట్రో స్వాధీనత




అభివృద్ధిలో అంగలు వేస్తున్న హైదరాబాద్ నగరానికి తలమానికంగా నిలువాల్సిన మెట్రో రైల్ కాంగ్రెస్ ప్రభుత్వం కల్పించిన సంక్షోభంలో చిక్కుకుని పట్టాలు తప్పుతున్నది. ఈ అత్యాధునిక రవాణా వ్యవస్థ సీఎం రేవంత్‌రెడ్డి మొదలుపెట్టిన స్వాధీన ప్రహసనంతో అవస్థలు పడుతున్నది. ఒకరకంగా చెప్పాలంటే త్రిశంకుస్వర్గంలో వేలాడుతున్నది. సీఎం దుందుడుకు, దుస్సాహసిక నిర్ణయాలే ఇందుకు తార్కాణం. సర్కార్ వైఖరితో విసిగిపోయిన ఎల్ అండ్ టీ కాడి పడేసేందుకు సిద్ధమైంది. రెండో దశ విస్తరణ మాటేమోగానీ మొదటి దశను నడపడం తన వల్ల కాదంటూ చేతులెత్తేసింది. దాంతో పాలక ప్రభుత్వమే మెట్రోను స్వాధీనం చేసుకుంటుందని రేవంత్ అనాలోచితంగా ప్రకటించడం అందర్నీ విస్మయపరిచింది. ఒకప్పుడు పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ పద్ధతిలో మొదలుపెట్టిన ప్రాజెక్టును ప్రభుత్వం ఉన్నపళంగా చేపట్టాల్సిన అవసరం ఏమిటి? అనేది ప్రశ్న. పైగా స్వాధీనానికి పరిహారంగా రూ.13,538 కోట్లు ఎల్ అండ్ టీకి చెల్లించాలని, అదీ అప్పుచేసి ఇవ్వాలనుకోవడం భావ్యమా? అనేది మరో ప్రశ్న. మెట్రో పరిధిలోని వేల కోట్ల ఆస్తుల పందేరం కోసమే ఈ తతంగానికి తెరతీశారని ఆరోపణ ఉన్నది. ఆశ బారెడు ఉండొచ్చు. అయితే అందుకు తగ్గ ఆచరణ లేకపోతే అసలుకే ఎసరు వస్తుంది. మెట్రో రైల్ విషయంలో అదే జరిగింది. మెట్రోకు పరిహారం చెల్లిస్తామని ప్రభుత్వం ఒప్పందమైతే చేసుకున్నది. కానీ అందుకు అవసరమైన అప్పును సాధించడంలో దారుణంగా విఫలమైంది. ఆస్తుల మదింపు, లాభనష్టాల బేరీజు లేకుండానే భారత రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఆర్ఎఫ్‌సీ) రుణం కోసం దరఖాస్తు చేస్తే అది కాస్తా తిరస్కరణకు గురైంది. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వల్లే రుణం ఆగిపోయిందని రుసరుసలాడటం, మీ చేతకానితనం వల్లే రుణం మంజూరు కాలేదని ఆయన ఎదురు దాడికి దిగడం ఓ ప్రహసనం. ఇంత జరిగాక అదే కిషన్‌రెడ్డిని వెంటపెట్టుకుని ఢిల్లీకి వెళ్లి రుణం కోసం సీఎం పైరవీలు చేయడం విడ్డూరం. స్వరాష్ట్ర సాధన నాటికి మెట్రో పనులు మొదలై నత్తనడక నడుస్తున్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వ ప్రోత్సాహంతో పనులు వేగం పుంజుకొని 2017లో మెట్రోరైల్ పట్టాలెక్కింది. మెట్రో విస్తరణకు కేసీఆర్ హయాంలోనే పునాదులు పడ్డాయి. కొవిడ్ కాలంలో సంస్థ ఎదుర్కొన్న నష్టాలను తగ్గించేందుకు గత సర్కార్ రూ.100 కోట్ల సాయం కూడా ప్రకటించింది. మొదటి దశను సజావుగా కొనసాగనిస్తూ, రెండో దశకు సిద్ధం కావాల్సిన తరుణంలో మొత్తమంతా తలకిందులు చేస్తూ సర్కార్ స్వాధీనానికి రేవంత్ ఒంటెత్తు పోకడలతో పరుగులు పెట్టారు. 'అనుకున్నదొక్కటి.. అయ్యిందొక్కటి' అనేట్టుగా రుణం రాకపోవడంతో బోల్తాపడ్డారు. ఇంతకూ రుణం ఎప్పుడొస్తుందో తెలియదు గానీ ఈలోగా బ్యాంకుకు నెలనెలా వడ్డీ కట్టక తప్పని పరిస్థితి. అదికాస్తా తడిసి మోపెడవుతున్నది. ఈనెల15 నాటికి సర్కార్ రూ.130 కోట్లు మిత్తీ రూపంలో చెల్లించాల్సి వచ్చింది. తనకు చెందాల్సిన భూమిని సర్కార్ వేలం వేసిందని అంటూ కోర్టుకు వెళ్లినందుకు ఎస్బీఐ మీద సీఎం నిర్హేతుకంగా కక్షగట్టారు. సర్కార్ ఖాతాలన్నీ ఉపసంహరించుకుని ప్రతీకారం తీర్చుకోబోతున్నారని వార్తలు వెలువడ్డాయి. ఇప్పుడు అదే బ్యాంకు అనుబంధ సంస్థ అయిన ఎస్బీఐ క్యాప్స్‌కు తాజాగా మదింపు బాధ్యతను అప్పగించాల్సి రావడం వైపరీత్యం. కొత్తగా జరిపే మదింపులో సంస్థ విలువ తగ్గినట్టుగా తేలితే ప్రభుత్వం ఎల్ అండ్ టీతో కుదుర్చుకున్న ఒప్పందం ఏమవుతుంది? ఇదివరకు ఐడీబీఐకి చెల్లించిన కన్సల్టెన్సీ ఫీజు బూడిదలో పోసిన పన్నీరైంది. ఇప్పుడు ఎస్బీఐ క్యాప్స్‌కు మళ్లీ ఫీజు చెల్లించాల్సి వస్తున్నది. అట్టహాసంగా మొదలుపెట్టిన స్వాధీనం కాస్తా ప్రభుత్వ అసమర్థ నిర్వహణ వల్ల చిక్కుల్లో పడి దిక్కులు చూస్తున్నది. ముందుచూపు లేకుండా రుణం కోసం వెళ్లడం కాంగ్రెస్ సర్కార్ అసమర్థ నిర్వహణకు నిలువెత్తు నిదర్శనం. స్వాధీనత పేరిట జరిగిన కుప్పిగంతుల పుణ్యమా అని ఇప్పుడు మెట్రో భవిత ఊగిసలాటలో పడింది. అందుకు రేవంత్ బాధ్యత వహిస్తారా?

# 'ఇరాన్‌ను లేకుండా చేస్తాం'.. 'నరకం చూపిస్తాం'!




పశ్చిమాసియాలో మరోసారి యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్నాయి. అమెరికా-ఇరాన్ మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చిన కొద్ది రోజులకే.. ఇరు దేశాలు మళ్లీ పరస్పర దాడులకు దిగడంతో పరిస్థితి అత్యంత ఉద్రిక్తంగా మారింది. హర్మూజ్ జలసంధి గుండా ప్రయాణిస్తున్న చమురు ట్యాంకర్‌పై దాడి జరిగిందని ఆరోపిస్తూ అమెరికా వరుసగా రెండో రోజు ఇరాన్‌లోని కీలక సైనిక స్థావరాలపై వైమానిక దాడులు నిర్వహించింది. దీనికి ప్రతిగా అమెరికా గల్ఫ్ ప్రాంతంలోని సైనిక స్థావరాలపై విరుచుకుపడుతోంది. హర్మూజ్ జలసంధి సమీపంలో ప్రయాణిస్తున్న పనామా జెండా కలిగిన కికు (ఖ×ఖఖ) అనే చమురు ట్యాంకర్‌పై ఇరాన్ డ్రోన్‌తో దాడి చేసిందని అమెరికా ఆరోపించింది. సుమారు 20 లక్షల బ్యారెళ్ల ముడి చమురును తీసుకెళ్తున్న ఈ నౌక దెబ్బతిన్నప్పటికీ సిబ్బంది సురక్షితంగా ఉన్నట్లు వెల్లడించింది. దీనికి ప్రతిగా అమెరికా సెంట్రల్ కమాండ్ (జజుచీజూవీ) ఇరాన్‌లోని 10 కీలక సైనిక లక్ష్యాలపై దాడులు నిర్వహించింది. నిఘా వ్యవస్థలు, కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌లు, వైమానిక రక్షణ కేంద్రాలు, డ్రోన్ నిల్వ కేంద్రాలు, సముద్ర మైన్లను మోహరించే సామర్థ్యాలపై లక్ష్యంగా దాడులు చేసినట్లు తెలిపింది. కాల్పుల విరమణ ఒప్పందాన్ని గౌరవించే అవకాశం ఇచ్చినా.. ఇరాన్ మళ్లీ దాడులకు పాల్పడిందని అమెరికా ఆరోపించింది. ఈ పరిణామాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. కాల్పుల విరమణను ఇరాన్ పదేపదే ఉల్లంఘిస్తోందని ఆరోపించిన ఆయన, అవసరమైతే అమెరికా యుద్ధాన్ని పూర్తిస్థాయిలో ముగిస్తుందని హెచ్చరించారు. అలాంటి పరిస్థితి వస్తే.. ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ అనే దేశమే ఇక ఉండదు అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. అయితే ట్రంప్ హెచ్చరికలకు ఇరాన్ కూడా అదే స్థాయిలో కౌంటర్ ఇచ్చింది. హర్మూజ్ జలసంధిపై నియంత్రణ పూర్తిగా తమదేనని మరోసారి స్పష్టం చేసిన ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చీ.. తమ నిబంధనలను ఉల్లంఘించే నౌకలు ఉద్రిక్తతలకు కారణమవుతాయని



హెచ్చరించారు. అదే సమయంలో, గల్ఫ్ ప్రాంతంలోని అమెరికా సైనిక స్థావరాలు త్వరలోనే నరకాన్ని అనుభవిస్తాయి అని ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ నేవీ కమాండర్ హెచ్చరించారు. మరోవైపు పశ్చిమాసియాలో ప్రాంతీయ ఉద్రిక్తతలు మరింత విస్తరించాయి. అమెరికా దాడులకు ప్రతీకారంగా కువైట్, బహ్రెయిన్‌లలోని అమెరికా సైనిక స్థావరాలపై క్షిపణులు, డ్రోన్లతో దాడులు జరిపినట్లు ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ ప్రకటించింది. కువైట్‌లోని అలీ అల్ సలేం ఎయిర్‌బేస్, బహ్రెయిన్‌లోని అమెరికా ఐదో నౌకాదళ స్థావరాన్ని లక్ష్యంగా చేసుకున్నట్లు వెల్లడించింది. అయితే కువైట్ సైన్యం తమ వైమానిక రక్షణ వ్యవస్థలు శత్రు క్షిపణులు, డ్రోన్లను విజయవంతంగా అడ్డుకుంటున్నాయని తెలిపింది. గల్ఫ్ దేశాల్లో సైరన్లు మోగించడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సమీపంలోని సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని అధికారులు సూచించారు. అయితే తీవ్ర సైనిక ఉద్రిక్తతల మధ్య కూడా దౌత్య ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. స్విట్జర్లాండ్‌లో శాంతి చర్చలపై అవగాహన ఒప్పందం కుదిరిన సంగతి తెలిసిందే. అయితే మళ్లీ దాడులతో.. 60 రోజుల వ్యవధిలో శాంతి చర్చలపై ప్రతిష్టంభన నెలకొంది. అయితే.. మధ్యవర్తిత్వం వహిస్తున్న ఖతార్, పాకిస్తాన్‌ల విజ్ఞప్తితో అమెరికా, ఇరాన్ ప్రతినిధులు చర్చలకు ముందుకొచ్చినట్లు సమాచారం అందుతోంది. మంగళవారం లేదంటే ఈ వారంలోనే దోహాలో సమావేశమై హర్మూజ్ జలసంధిలో వాణిజ్య నౌకల రాకపోకలు, సముద్ర భద్రత, కాల్పుల విరమణ అమలుపై చర్చలు జరపనున్నట్లు తెలుస్తోంది. ఈ చర్చలు సఫలమైతే ప్రాంతంలో యుద్ధ ముప్పు కొంత తగ్గే అవకాశం ఉన్నప్పటికీ.. మరోవైపు ఇరు దేశాల నుంచి వస్తున్న హెచ్చరికలు మధ్యప్రాచ్యాన్ని మరోసారి అగ్నిగుండంలా మార్చే ప్రమాదాన్ని సూచిస్తున్నాయి.

## రాజ్యసభ సభ్యునిగా ఖర్గే ప్రమాణ స్వీకారం




న్యూఢిల్లీ: కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కర్ణాటక నుండి రాజ్యసభకు తిరిగి ఎన్నికైన తర్వాత, సోమవారం నాడు ఎంపీగా ఘనంగా ప్రమాణ స్వీకారం చేశారు. ఉపరాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ సీపీ రాధాకృష్ణన్ తన ఛాంబర్‌లో ఖర్గే చేత ప్రమాణం చేయించారు. చేతిలో రాజ్యాంగ ప్రతిని పట్టుకుని, హిందీ భాషలో ఖర్గే ఈ ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం మల్లికార్జున ఖర్గే సోషల్ మీడియా వేదికగా మోదీ ప్రభుత్వానికి గట్టి హెచ్చరికలు పంపారు. ప్రజల గొంతుకను, వారి ఆకాంక్షలను పార్లమెంట్‌లో పూర్తి చిత్తశుద్ధితో వినిపిస్తానని ఆయన అన్నారు. ప్రభుత్వాన్ని ఎప్పటికప్పుడు నిలదీస్తూ, జవాబుదారీతనంతో వ్యవహరించేలా ఒత్తిడి తీసుకురావడమే తన ప్రధాన బాధ్యతని ఖర్గే ప్రకటించారు. రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడిగా కొనసాగే అవకాశం లభించడం తనకు దక్కిన గొప్ప గౌరవంగా భావిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ చారిత్రాత్మక కార్యక్రమానికి కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ అధినేత్రి సోనియా గాంధీ, వయనాడ్ ఎంపీ ప్రియాంకా గాంధీ వాద్రా ప్రత్యేకంగా హాజరై ఖర్గేకు అభినందనలు తెలిపారు. వీరితో పాటు కేంద్ర మంత్రులు జె.పి. నడ్డా, కిరణ్ రిజిజు, అర్జున్ రామ్ మేఘవాల్, రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ కూడా ఈ వేడుకలో పాల్గొన్నారు. ఖర్గేతో పాటు బీజేపీ నేత తరుణ్ చుగ్, గుజరాత్, కర్ణాటక, మహారాష్ట్ర, మణిపూర్, రాజస్థాన్ రాష్ట్రాలకు చెందిన మరో ఆరుగురు కొత్త సభ్యులు కూడా ఈ రోజు రాజ్యసభ ఎంపీలుగా ప్రమాణం చేశారు.ద

## కరూర్ ఘటన.. విజయ్ కీలక నిర్ణయం



చెన్నై: తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ కీలక నిర్ణయం తీసుకున్నారు. కరూర్ తొక్కిసలాట బాధితులను కలిసేందుకు ముఖ్యమంత్రి విజయ్ సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా విజయ్ ఓదార్పు యాత్ర చేపట్టనున్నారు. జూలై రెండో సీఎం విజయ్.. కరూర్‌లో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా బాధితులను కలిసి మాట్లాడనున్నారు. కాగా, ఇటీవల అసెంబ్లీ సమావేశాల సందర్భంగా కూడా విజయ్.. కరూర్ ఘటనను గుర్తు చేసుకున్నారు. కాగా, తమిళనాడు అసెంబ్లీలో ముఖ్యమంత్రి విజయ్ ఇటీవల జరిగిన ప్రసంగంలో కరూర్ తొక్కిసలాట ఘటనను ప్రస్తావించారు. ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని, ఇలాంటి విషాదాలు మళ్లీ జరగకుండా కఠినమైన భద్రతా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ ఘటన 2025 సెప్టెంబర్‌లో కరూర్‌లో జరిగిన టీవీకే సభ సందర్భంగా చోటుచేసుకుంది. నాడు సభ కోసం భారీ సంఖ్యలో ప్రజలు ఒక్కసారిగా వేదిక వైపు దూసుకెళ్లడంతో తొక్కిసలాట జరిగి 41 మంది మరణించగా, 80 మందికి పైగా గాయపడ్డారు. విచారణలో సభా నిర్వహణలో లోపాలు, జనసమూహ నియంత్రణలో వైఫల్యాలు ఉన్నట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ కేసు ప్రస్తుతం సీబీఐ దర్యాప్తులో ఉంది. ఈ ఘటనపై దర్యాప్తు కొనసాగుతుండగా, పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి విజయ్‌ను కూడా సీబీఐ విచారించింది. ఇటీవల అసెంబ్లీలో ఆయన ఈ విషాదాన్ని ప్రస్తావిస్తూ బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేలా చర్యలు కొనసాగుతాయని చెప్పారు.

## తిరుమలలో టీటీడీ నిర్లక్ష్యం.. భూమన సీరియస్



తిరుపతి: తిరుమలలో టీటీడీ, విజిలెన్స్ నిర్లక్ష్యంపై టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. టీటీడీలో నిర్లక్ష్యానికి చంద్రబాబు బాధ్యత వహించాలన్నారు. స్వామి వారి చిత్రపటాలు చెత్త కుప్పల్లో పడేస్తున్నారు. పవనానంద స్వామి.. మీ సనాతనం ఎలా ఉందో చూడండి అని మండిపడ్డారు. ఇవన్నీ చూసి పాలకులు సిగ్గుపడాలన్నారు. టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి తాజాగా తిరుమలలో మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు పాలనలో టీటీడీని పరిరక్షిస్తున్నామంటూ గొప్పలు చెబుతూనే తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. అబద్దాలు చెప్పే ముఖ్యమంత్రి పాలనలో అలిపిరి దగ్గర నుంచి కిలోమీటర్ పరిధిలో వెంకటేశ్వర స్వామి స్థలాల్లో పవిత్రంగా ఉండాల్సిన చోట టీటీడీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. కొన్ని వందల వేల స్వామి వారి ఫొటోలు అన్ని కూడా అత్యంత నిర్లక్ష్యంగా చెత్తకుప్పల్లో, మల మూత్రాల మధ్య పడేశారు. టీటీడీ వాళ్లు పడేశారు అని చెప్పడం లేదు.. విజిలెన్స్ వైఫల్యం చూపిస్తున్నాం. గత రెండేళ్ల పాలనలో టీటీడీ ప్రక్షాళన చేస్తున్నామని చెబుతున్నారు. కానీ, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. చంద్రబాబుకు ఊడిగం చేసే వారు సిగ్గుతో తలదించుకోవాలి. స్వామి వారి చిత్రపటాలు మల మూత్రాల మధ్య, బీరు బాటిల్స్ మధ్య ఉన్నాయి. వీటిని శుభ్రం చేయాల్సిన బాధ్యత మీకు లేదా?. నిర్లక్ష్యంగా వదిలివేసి టీటీడీ చోద్యం చూస్తోంది. మీ పాలనలో ఎన్ని అపచారాలు జరుగుతున్నాయి అనేది కళ్లకు కట్టినట్లు చూపిస్తున్నాం. దీనికి ముఖ్యమంత్రి బాధ్యత వహించాలి. టీటీడీ పాలకులు, అధికారులు సిగ్గుపడాలి. సనాతన ధర్మం సాంప్రదాయం కాపాడతామన్న ఉపముఖ్యమంత్రి పవనానంద స్వామి.. మీ సనాతనం ఎలా ఏడ్చి చచ్చిందో ఓసారి వచ్చి చూడండి. ప్రక్షాళన చేస్తామన్నా పవనానంద స్వామి.. ఇదేనా ప్రక్షాళన, మీ పాలన అంతా అవినీతిమయమే' అంటూ మండిపడ్డారు.

## తిరుమలలో టీటీడీ నిర్లక్ష్యం.. భూమన సీరియస్

తిరుపతి: తిరుమలలో టీటీడీ, విజిలెన్స్ నిర్లక్ష్యంపై టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. టీటీడీలో నిర్లక్ష్యానికి చంద్రబాబు బాధ్యత వహించాలన్నారు. స్వామి వారి చిత్రపటాలు చెత్త కుప్పల్లో పడేస్తున్నారు. పవనానంద స్వామి.. మీ సనాతనం ఎలా ఉందో చూడండి అని మండిపడ్డారు. ఇవన్నీ చూసి పాలకులు సిగ్గుపడాలన్నారు. టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి తాజాగా తిరుమలలో మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు పాలనలో టీటీడీని పరిరక్షిస్తున్నామంటూ గొప్పలు చెబుతూనే తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. అబద్దాలు చెప్పే ముఖ్యమంత్రి పాలనలో అలిపిరి దగ్గర నుంచి కిలోమీటర్ పరిధిలో వెంకటేశ్వర స్వామి స్థలాల్లో పవిత్రంగా ఉండాల్సిన చోట టీటీడీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. కొన్ని వందల వేల స్వామి వారి ఫొటోలు అన్ని కూడా అత్యంత నిర్లక్ష్యంగా చెత్తకుప్పల్లో, మల మూత్రాల మధ్య పడేశారు. టీటీడీ వాళ్లు పడేశారు అని చెప్పడం లేదు.. విజిలెన్స్ వైఫల్యం చూపిస్తున్నాం. గత రెండేళ్ల పాలనలో టీటీడీ ప్రక్షాళన చేస్తున్నామని చెబుతున్నారు. కానీ, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. చంద్రబాబుకు ఊడిగం చేసే వారు సిగ్గుతో తలదించుకోవాలి. స్వామి వారి చిత్రపటాలు మల మూత్రాల మధ్య, బీరు బాటిల్స్ మధ్య ఉన్నాయి. వీటిని శుభ్రం చేయాల్సిన బాధ్యత మీకు లేదా?. నిర్లక్ష్యంగా వదిలివేసి టీటీడీ చోద్యం చూస్తోంది. మీ పాలనలో ఎన్ని అపచారాలు జరుగుతున్నాయి అనేది కళ్లకు కట్టినట్లు చూపిస్తున్నాం. దీనికి ముఖ్యమంత్రి బాధ్యత వహించాలి. టీటీడీ పాలకులు, అధికారులు సిగ్గుపడాలి. సనాతన ధర్మం సాంప్రదాయం కాపాడతామన్న ఉపముఖ్యమంత్రి పవనానంద స్వామి.. మీ సనాతనం ఎలా ఏడ్చి చచ్చిందో ఓసారి వచ్చి చూడండి. ప్రక్షాళన చేస్తామన్నా పవనానంద స్వామి.. ఇదేనా ప్రక్షాళన, మీ పాలన అంతా అవినీతిమయమే' అంటూ మండిపడ్డారు. "

# ప్రజా భాగస్వామ్యంతోనే ప్రగతి

## 135వ 'మన్ కీ బాత్'లో ప్రధాని మోదీ వ్యాఖ్య



న్యూఢిల్లీ: దేశ భద్రత, స్వావలంబన దిశగా భారత్ సరికొత్త మైలురాళ్లను చేరుకుందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. సముద్రాల నుంచి గగనతలం దాకా మన దేశం మరింత సురక్షితంగా, స్వయం సమృద్ధిగా మారుతోందని హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం 'మన్ కీ బాత్' 135వ ఎపిసోడ్‌లో దేశ ప్రజలను ఉద్దేశించి మోదీ ప్రసంగించారు. రక్షణ రంగంలో విజయాలు, కేంద్ర ప్రభుత్వ బీమా పథకాలు, పర్యావరణ పరిరక్షణ, మూఢనమ్మకాల నిర్మూలన తదితర అంశాలను ప్రస్తావించారు. ప్రధానమంత్రి ఏం చెప్పారంటే..

రక్షణ, విమానయాన రంగాల్లో స్వదేశీ ముద్ర

"కోల్‌కతాలో జరిగిన నావికాదళ కార్యక్రమంలో ఐఎన్ఎస్ దుణగిరి, ఐఎన్ఎస్ సంశోధక్, ఐఎన్ఎస్ అగ్రయ్ యుద్ధనౌకలు భారత నౌకాదళంలో చేరాయి. వీటి డిజైన్ నుంచి తయారీ వరకు అంతా స్వదేశీ పరిజ్ఞానమే. విమానయాన రంగంలోనూ భారత్ మరో ఘనత సాధించింది. మొట్టమొదటి 'మేడ్ ఇన్ ఇండియా'సి--295 సైనిక రవాణా విమానం తొలి ప్రయాణాన్ని విజయవంతంగా పూర్తి చేసింది. ఇలాంటి 40 విమానాలు మన దేశంలోనే తయారవుతున్నాయి" అని అన్నారు.

సామాన్యులకు బీమా భద్రత

"బీమా పథకాలు సామాన్యుల జీవితాలకు భద్రత కల్పిస్తున్నాయి. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా బహదూర్‌పురాకు చెందిన పెత్కర్ కుటుంబం వివాహ వేడుక సందర్భంగా 3,500 మంది గ్రామస్థులకు రూ.లక్ష చొప్పున ప్రమాద బీమా సదుపాయం కల్పించడం హర్షణీయం. అందుకు వారిని అభినందిస్తున్నా. కేంద్ర ప్రభుత్వం సైతం కోట్లాది మందికి బీమా రక్షణ కల్పిస్తోంది. ప్రధానమంత్రి సురక్షా బీమా యోజన కింద కేవలం రూ.20 వార్షిక ప్రీమియంతో రూ.2 లక్షల ప్రమాద బీమా లభిస్తోంది. ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన కింద ఏడాదికి రూ.436 ప్రీమియంతో రూ.2 లక్షల జీవిత బీమా అందుతోంది" అని అన్నారు.

మూఢ నమ్మకాలపై అస్సాం మహిళల పోరు

"మూఢ నమ్మకాలను సైన్స్, తర్కంతో పారదోలవచ్చని అస్సాం మహిళలు నిరూపించారు. పరిసరాలను శుభ్రపర్చి పర్యావరణానికి మేలు చేసే హర్గిలా అనే అరుదైన పక్షిని అపశకునంగా భావించి చెట్లను నరికివేస్తూ వాటిని తరిమేసేవారు. అయితే, జీవ శాస్త్రవేత్త పూర్ణిమా దేవి బర్మన్ చొరవతో అస్సాం మహిళలు 'హర్గిలా ఆర్మీ'గా ఏర్పడి ఆ పక్షులను సంరక్షిస్తున్నారు. హర్గిలా పక్షులు అపశకునం కాదని రుజువు చేస్తున్నారు. ఆ పక్షులు నేడు అస్సాం గ్రామాలకు గొప్ప గుర్తింపుగా మారాయి " అని అన్నారు.

మేఘాలయా వేర్ల వంతెనలు..

"మేఘాలయాలో దశాబ్దాల పాటు రబ్బరు చెట్ల వేర్లను పరస్పరం అనుసంధానించి సహజసిద్ధంగా నిర్మించిన వేర్ల వంతెనలు నిజంగా అద్భుతం. ఈ వంతెనల సంరక్షణకు 50 ఏళ్లుగా కృషి చేస్తున్న హాలీవార్‌కు ఈ ఏడాది పద్మ పురస్కారం లభించింది. మధ్యప్రదేశ్‌లోని రాజ్‌గఢ్ జిల్లా బియోరాలో ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి 'ఎకో--బ్రిక్స్'గా మార్చి బహిరంగ ప్రదేశాలను సుందరంగా తీర్చిదిద్దడానికి స్థానిక మహిళలు కృషి చేస్తుండడం ఎంతైనా ప్రశంసనీయం" అని అన్నారు.

వోకల్ ఫర్ లోకల్ స్ఫూర్తిని చాటిచెప్పాలి

"గణేశ్ చతుర్థి ఉత్సవాలకు సంబంధించిన అంశంపై మాట్లాడాలని కోరుతూ చాలామంది నాకు లేఖలు రాశారు. ప్రతి ఒక్కరూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను పూజించడం మానుకోవాలి. పర్యావరణాన్ని కాపాడేందుకు దేశీయ మట్టితో చేసిన విగ్రహాలనే పూజించాలి. వోకల్ ఫర్ లోకల్ స్ఫూర్తిని చాటిచెప్పాలి"అని మోదీ పిలుపునిచ్చారు.

నా వినతిని ప్రజలు అర్థం చేసుకున్నారు

నా విజ్ఞప్తిని మన్నించినందుకు దేశ ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నా. పశ్చిమాసియా పరిస్థితుల దృష్ట్యా కొంతకాలం పాటు బంగారం కొనుగోలు చేయొద్దని, విదేశీ విహార యాత్రలు వాయిదా వేసుకోవాలని, చమురును ఆదా చేయడానికి కార్‌పూలింగ్ పద్ధతిని పాటించాలని కోరాను. ప్రజలు నా వినతిని అర్థం చేసుకున్నందుకు సంతోషంగా ఉంది.

# కార్పొరేషన్లు గెలవాలి.. కాంగ్రెస్‌ను దించాలి

### పార్టీ శ్రేణులకు బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్‌నబిన్ దిశానిర్దేశం

### యువతకు ఉద్యోగ కల్పనలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం

### బీఆర్ఎస్, కాంగ్రెస్‌లు ప్రజల ఆకాంక్షలను చిదిమేశాయని ధ్వజం



హైదరాబాద్: తెలంగాణలో కాంగ్రెస్ సర్కార్‌ను గద్దె దించడమే ధ్యేయంగా వచ్చే రెండున్నరేళ్లపాటు యావత్‌పార్టీ ముందుకు సాగాలని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్‌నబిన్ పిలుపునిచ్చారు. అధికార కాంగ్రెస్ అవినీతికి వ్యతిరేకంగా ఎంపీలు మొదలు అన్ని స్థాయిల వారు తమ పరిధులు, క్షేత్రాల్లో పోరాడి, ఎక్కడికక్కడ ప్రజల మద్దతును కూడగట్టాలన్నారు. ఆదివారం రాత్రి బీజేపీ కార్యాలయంలో పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలతో ఆయన సమావేశమయ్యారు. రాబోయే రోజుల్లో జరగబోయే ప్రతీ ఎన్నికల్లో గెలిచి సత్తా చాటాలని దిశానిర్దేశం చేశారు. పట్టణ ప్రాంతాల్లో పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శించేలా జీహెచ్ఎంసీ, సైబరాబాద్, మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్లు, వరంగల్, ఖమ్మం కార్పొరేషన్లను కైవసం చేసుకోవడమే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను తెలంగాణలోని ప్రతి గడపకు తీసుకెళ్లి రాష్ట్రాభివృద్ధి, ప్రజల పురోగతి కోసం అందరినీ భాగస్వాములను చేయాలన్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు, ఉపాధి కల్పనలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, దీనిపై వెంటనే యువమోర్చా ఆధ్వర్యంలో రోడ్డెక్కి విద్యార్థి, యువత మద్దతును కూడగట్టే దిశలో కార్యాచరణను ప్రారంభిస్తుందని ప్రకటించారు.రాష్ట్ర ఏర్పాటుకు బీజేపీ పూర్తిస్థాయిలో సహకరిస్తే..తెలంగాణ ఏర్పడ్డాక గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ సర్కార్ ప్రజల ఆకాంక్షలను పూర్తిగా చిదిమేశాయని మండిపడ్డారు. ప్రధానంగా నీటిపారుదల రంగంలో భారీ అవినీతికి తెరతీసి తెలంగాణలోని బీడుబారిన పొలాలకు సాగునీరు చేరకుండా అడ్డుకున్నాయని ధ్వజమెత్తారు. నెల రోజుల్లో వాతావరణం మారాలి: 'తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడమే ఏకైక లక్ష్యం. నెల రోజుల్లో ఆ వాతావరణం క్రియేట్ చేయాలి. ఎవరో వస్తారు కాదు. మీరు ఒక నేరేటివ్ క్రియేటివ్ చేయాలి. మీరు అది క్రియేట్ చేశాక అప్పుడు హైకమాండ్ నుంచి ఏం చేయాలో అది చేస్తాం. రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి రావడానికి పూర్తి స్కోప్ ఉంది. కులపిచ్చి బంద్ చేయండి..మీరు ఇలాగే ఉంటే పార్టీ ముందుకు పోదు. ఇకనైనా మారండి. పార్టీ ఫస్ట్..లీడర్ నెక్ట్స్. ఎవరు ఏం చేస్తున్నారో నాకు ఐడియా ఉంది. కష్టపడి పని చేయండి. ఐక్యంగా ముందుకు సాగాలి. నేను గతంలో తెలంగాణలో పర్యటించాను. నాకు కొంత ఐడియా ఉంది. ఇవాళ తేదీ గుర్తు పెట్టుకోండి. మళ్లీ అధికారంలోకి వచ్చాక ఇది గుర్తు చేసుకోవాలి' అని నితిన్‌నబిన్ చెప్పారు. ఆదివారం ఆయన పాల్గొన్న మూడు సమావేశాల్లోనూ దశాబ్దాలుగా తెలంగాణతో బీజేపీకున్న అనుబంధం, కార్యకర్తల త్యాగం, బలమైన కేడర్ తదితరాలను ప్రస్తావించారు. మధ్యాహ్నం శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు చేరుకొని, అక్కడి నుంచి ఊట్‌పల్లిలో రంగారెడ్డి రూరల్ జిల్లా కార్యాలయం, మరో 8 జిల్లాల ఆఫీస్‌లను వర్చువల్‌గా ప్రారంభించారు. సాయంత్రం 5 గంటలకు నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో జీహెచ్ఎంసీ, సైబరాబాద్, మల్కాజ్‌గిరి కార్పొరేషన్ల పరిధిలోని పోలింగ్ బూత్‌ల అధ్యక్షులను ఉద్దేశించి ప్రసంగించారు. సోమవారం ఉదయం 10 గంటలకు ఘట్‌కేసర్‌లోని వీబీఐటీ క్యాంపస్‌లో 'స్టూడెంట్స్ అండ్ యూత్ కాన్‌క్లేవ్'లో యువత, విద్యార్థులతో సమావేశం అవుతారు. అక్కడి నుంచి భువనగిరి మీదుగా వరంగల్‌కు చేరుఒని, మధ్యాహ్నం 2 గంటలకు హనుమకొండలోని అశోక కన్వెన్షన్‌లో గిరిజన, ఆదివాసీ నాయకులతో, సాయంత్రం 4 గంటలకు వరంగల్‌లోని ఆర్ట్స్‌కాలేజీ గ్రౌండ్స్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పోలింగ్ బూత్ అధ్యక్షులు, ఆపై స్థాయి నాయకులతో భేటీ జరగనుంది. రాత్రికి హైదరాబాద్‌కు చేరుకుంటారు.

# నిరాధార ఆరోపణలతో పరువు ప్రతిష్ఠకు భంగం కలిగించవద్దు: ఏజీఎం దయాకర్ రెడ్డి

### ఇటీవల కొన్ని పత్రికలు, సోషల్ మీడియా వేదికల్లో

లోకల్ గైడ్, షాద్‌నగర్ : ఇటీవల కొన్ని పత్రికలు, సోషల్ మీడియా వేదికల్లో తనకు సంబంధించిన అంశాలపై ప్రచురితమైన కథనాల్లో వాస్తవాలు ప్రతిబింబించలేదని జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఏజీఎం దయాకర్ రెడ్డి తెలిపారు. పూర్తి వివరాలు తెలుసుకోకుండా, తన వివరణ తీసుకోకుండా ఏకపక్షంగా వార్తలు ప్రచురించడం విచారకరమని పేర్కొన్నారు.మైనర్‌లకు రుణాలు మంజూరు చేశారన్నది, బంధువులకు నిబంధనలకు విరుద్ధంగా రుణాలు ఇచ్చారన్న ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదని ఆయన స్పష్టం చేశారు. ఒకే ఇంటిపేరు ఉన్నంత మాత్రాన అందరూ బంధువులు కారని, బ్యాంకు నిబంధనల ప్రకారమే అవసరమైన పూచీకత్తులు, భూముల ఆధారంగా రుణాలు మంజూరు అవుతాయని వివరించారు.తాను విధి నిర్వహణలో ఎల్లప్పుడూ పారదర్శకత, నిబంధనలకు కట్టుబడి పనిచేశానని, షాద్‌నగర్, చేగూర్, కొందూరు తదితర శాఖల్లో అన్ని రుణాలు నిబంధనల ప్రకారమే మంజూరు చేశానని తెలిపారు. తనపై ఎలాంటి అవకతవకలు జరిగినట్లు ఇప్పటివరకు అధికారులు నిర్ధారించలేదని, తుది నిర్ణయం వెలువడకముందే ఆరోపణలను నిజాలుగా ప్రచారం చేయడం సరైన విధానం కాదన్నారు.ఏదైనా అంశంపై సందేహాలు ఉంటే సంబంధిత అధికారుల నుంచి, తన నుంచి కూడా వివరణ తీసుకుని వాస్తవాలను నిర్ధారించిన అనంతరం వార్తలు ప్రచురిస్తే ప్రజలకు సరైన సమాచారం చేరుతుందని అభిప్రాయపడ్డారు. నిర్ధారణ కాని ఆరోపణలను ప్రచురించడం వల్ల వ్యక్తుల ప్రతిష్ఠతో పాటు మీడియాపై ప్రజల విశ్వాసం కూడా దెబ్బతినే అవకాశం ఉందని అన్నారు.ప్రజలకు వాస్తవ సమాచారం అందించడంలో మీడియా కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొంటూ, నిజానిజాలు పూర్తిగా వెలుగులోకి వచ్చే వరకు సంయమనం పాటించాలని, ఆధారాలతో కూడిన సమాచారానికే ప్రాధాన్యం ఇవ్వాలని దయాకర్ రెడ్డి కోరారు. అలాగే, భవిష్యత్తులోనూ వాస్తవాల ఆధారంగానే తన వివరణను ప్రజల ముందుకు తీసుకువస్తానని తెలిపారు.

DCCB
MAHABUBNAGAR

Edited, Printed, Published & Owned by CH.RAM REDDY Published from CRR publications, D.No.1-144/1, Near Apple Hospital Mothinagar, Balanagar Mandal, Ranga Reddy Dist.Telangana State and printed atGayatri Printers, near Apple Hospital Mothinagar, Balanagar Mandal, Rangareddy Dist,Telangana state.RNI NO:APBIL/2013/50718 Editor CH.RAM REDDYEMAIL: Localguide9999@gmail.com eb:www.localguidenews.com,contact:8977761499\\\